ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

విజయవాడ fb.com/vaartha

PUBLISHED FROM VIJAYAWADA, HYDERABAD, VISAKHAPATNAM, RAJAHMUNDRY, KADAPA, NIZAMABAD, ONGOLE, WARANGAL, TIRUPATHI, ANANTAPUR, KURNOOL, KARIMNAGAR, MAHABUBNAGAR, KHAMMAM, NELLORE, NALGONDA, GUNTUR, TADEPALLIGUDEM,SRIKAKULAM

3-10-2022 సోమవారం సంపుటి : 28 సంచిక : 244, పేజీలు : 12 వెల : 6.50



ముంబయిలో రూ. 1476 కోట్ల డ్రగ్స్ పట్టివేత

62.33 కోట్లకు పెరిగిన కరోనా వైరస్ కేసులు 9లో



ఆదివారం మైసూర్‌లో భారీ వర్షంలో మాట్లాడుతున్న రాహుల్

## మైసూరు చేరుకున్న రాహుల్ యాత్ర

### మహాత్ముడికి నివాళులర్పించి కొనసాగించిన కాంగ్రెస్ అగ్రనేత

### జోరు వానలోనూ ముమ్మరంగా సాగిన యాత్ర

# రైతు భరోసాతో ఆసరా



- బహుళ ప్రయోజన కేంద్రాలుగా మార్చేందుకు రూ. 9093 కోట్లు
- వ్యవసాయ మార్కెటింగ్ శాఖపై సిఎం జగన్ సమీక్ష
- రైతులనుంచి కొనుగోలు చేసిన పంట ఉత్పత్తులకు 10 రోజుల్లోగా నగదు చెల్లింపు

**విజయవాడ,అక్టోబరు 2,ప్రభాతవార్త ప్రతినిధి:** వ్యవసాయంలో పెట్టే పెట్టుబడి లాభాలను అందిస్తోందనే నమ్మకాన్ని రైతులకు కలిగిస్తున్నామని సిఎం వైఎస్ జగన్మోహనరెడ్డి స్పష్టం చేసారు. రైతు తన వ్యవసాయ ఉత్పత్తులకు మంచి గిట్టుబాటు ధరను కలిస్తున్నామన్నారు. అవసరమైతే ప్రభుత్వమే పంటలను కొనుగోలు చేస్తోందన్నారు. మార్కెటింగ్ వ్యవస్థలో ప్రభుత్వం తీసుకు వచ్చిన మార్పులు సత్ఫలితాలను అందిస్తున్నాయన్నారు. వ్యవసాయం మన రాష్ట్ర పురోగతి కీలకమని సిఎం జగన్ పునరుద్ఘాటించారు. అంతటి ప్రాధాన్యత ఉన్న వ్యవసాయ రంగానికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో ప్రయోజనం కల్పిస్తోందన్నారు. వ్యవసాయరంగాభివృద్ధికి సంబంధించి ఆయన సంబంధిత శాఖాధికారులకు కీలకాదేశాలు జారీ చేసారు. రైతుభరోసా కేంద్రాల నుంచి వ్యవసాయ రంగంలో అభ్యున్నతి ఆరంభం కావాలన్నారు. రైతులు అత్యంత ప్రయాస పడి సాధించే అధిక వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర ఉండాలన్నారు. రైతులకు సరైన ధర వచ్చే విధంగా అధికారులు నిరంతరం అ ప్రమత్తంగా ఉండాలన్నారు. ఏయేపంటలకు ఎంఎస్‌పీ లభించడం లేదో సమాచారం యాప్‌ద్వారా వస్తోందని వెంటనే చర్యలు తీసుకుంటామని అధికారులు సీఎం జగన్‌కు వివరించారు. 10641 రైతుభరోసా కేంద్రాలు ద్వారా పంటలకు కనీస మద్దతు ధరలు లభిస్తున్నాయా ? లేదా అన్న అంశంపై సమాచారం కచ్చితంగా ప్రతి రోజు అధికారుల వద్ద కీలక సమాచారం ఉండాలన్నారు. ఆ సమాచార నివేదికలను అలర్ట్స్‌ను ప్రతి రోజు పరిశీలించాలన్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన వ్యవసాయ ఉత్పత్తులకు 10 రోజుల్లోగా సొమ్ము చెల్లింపు అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

5811 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని అధికారులు సమావేశంలో సిఎం జగన్‌కు వివరించారు. పంటలకు కనీస మద్దతు ధరలను ఇప్పటికే మనం ప్రకటించామన్నారు. అన్ని రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాలు, కీలక ప్రభుత్వ కార్యాలయాలు, కూడళ్ళల్లో మద్దతు ధరల పోస్టర్లును ప్రదర్శించాలని సిఎం జగన్ ఆదేశించారు. ఏ పంటకు ఏ మద్దతు ధర లభిస్తుందనే విషయంలో రైతుకు అవగాహన కలిగించాలన్నారు. వర్షాలు కారణంగా దెబ్బతిన్న వరి, వేరు శనగ, పత్తి వంటి పంటలను కొనుగోలు చేయడంలో రైతులు ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి జగన్ ఆదేశాలు జారీ చేసారు. పత్తి రైతులు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా అధికారులకు సిఎం జగన్ ఆదేశాలు ఇచ్చారు. పంటలను అమ్ముకోవడానికి రైతులు ఇబ్బందులు పడుకున్నారు. అటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలన్నారు. ప్రత్యామ్నాయ మార్కెట్లును చూపించాలి, లేని పక్షంలో ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. ఈ విషయంలో వ్యవసాయ శాఖా మంత్రి, సంబంధిత అధికారులతో ప్రతిరోజు సమీక్ష చేయాలన్నారు. రైతులకు అందుతున్న కనీస ≫2

## దుర్గమ్మకు సిఎం పట్టు వస్త్రాలు

### వైభవంగా మూలా నక్షత్రం నాడు దసరా వేడుకలు

**ఇంద్రకీలాద్రి, అక్టోబరు 2, ప్రభాతవార్త:** బెజవాడ దుర్గమ్మకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్టువస్త్రాలను, పసుపు, కుంకుమలను ఆదివారం సమర్పించారు. మధ్యాహ్నం 3 గంటలకు దుర్గమ్మకు పట్టువస్త్రాలు తీసుకువచ్చిన సిఎం జగన్‌మోహన్‌రెడ్డికి ముందుగా ఆలయానికి చేరుకున్న సిఎంకు అక్కడ డిప్యూటి సిఎం, రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొట్టుసత్యనారాయణ, మంత్రి జోగిరమేష్, ఎమ్మెల్యేలు మల్లాదివిష్ణు, వెల్లంపల్లి శ్రీనివాస్, నగర మేయర్ బాగ్యలక్ష్మి,లు స్వాగతించారు. పండితులు పూర్ణకుంభంతో అధికార స్వాగతం పలకగా ఆలయానికి చేరుకున్న సిఎంకు ఆలయ స్థానాచార్యులు పరివేష్టితం చేసి, అమ్మవారికి సమర్పించే పట్టువస్త్రాలను, పసుపు, కుంకుమలను సిఎం తలపైపెట్టుకుని ఆలయంలోకి ప్రవేశించి అక్కడ దుర్గమ్మకు సమర్పించారు. అంతరాలయంలో ఆలయ ప్రధాన అర్చకులు లింగంబొట్ల శివప్రసాద్, ఇతర అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సిఎంకు శ్రీ దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు. వేదపండితులు వేదస్వస్తి పలికారు.

**దుర్గమ్మ సేవలో విఐపిలు:**

దుర్గమ్మను శ్రీ సరస్వతి దేవి అమ్మవారిగా ఆదివారం రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత, రాష్ట్ర మహిళా కమీషన్ చైర్మన్ వాసిరెడ్డి పద్మ, విజయవాడ ఎంపిలు కేశినేని నాని, నందిగం సురేష్, బాలశౌరి, ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెల్లంపల్లి శ్రీనివాస్, కొడాలి వెంకటేశ్వరరావు, కె అనిల్‌కుమార్, కిలారు వెంకట రోశయ్య, ఎమ్మెల్సీలు తలసిల రఘురాం, మొండితోక అరుణ్‌కుమార్, కల్పలతా రెడ్డి, ఎండి రుహుల్లాలు దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శ్రీ అమ్మవారి దర్శనానంతరం ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటో అందించిన తదుపరి వేదాశీర్వచనం ≫2


గాంధీ జయంతి సందర్భంగా మహాత్మునికి నివాళి అర్పిస్తున్న సిఎం జగన్

## పట్టణాలకు దీటుగా పల్లెల అభివృద్ధి

### గాంధీజీ ఆశించిన గ్రామస్వరాజ్యాన్ని అమలు చేస్తున్నాం

### శాస్త్రీజీ ఆశించిన రీతిలో వ్యవసాయం అభివృద్ధి

### ఇద్దరు మహానేతలకు నివాళులర్పించిన సిఎం జగన్

**విజయవాడ, అక్టోబరు 2, ప్రభాతవార్త ప్రతినిధి :** ఎటువంటి సంక్లిష్టమైన పరిస్థితులైనా శాంతి యుతంగా, సహనంతో పరిష్కరించుకునే శక్తిని మనకు మహాత్మాగాంధీ అందించారని సిఎం వైఎస్ జగన్మోహనరెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజలంతా అభ్యున్నతి సాధించినప్పుడే మంచి సమాజ నిర్మాణం జరుగుతుందనే సందేశ మిచ్చారన్నారు. మాటల కన్నా చేతలు ముఖ్యమన్న మహాత్ముని స్ఫూర్తితో ప్రజలంతా ముందుకు నడవాల న్నారు. జాతిపిత మహాత్మాగాంధీ, మాజీప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రిల జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహనరెడ్డి ఆదివారం ఆయన క్యాంపు కార్యాలయంలో వారి చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పిం ≫2

## హైదరాబాద్‌లో ఉగ్రకుట్ర భగ్నం

### జంటనగరాలలో బాంబుదాడులకు యత్నం

### సిటీ పోలీసులకు చిక్కిన ముగ్గురు వాంటెడ్ ఉగ్రవాదులు

### ఐఎస్ఐ ఉగ్రవాదుల నుంచి నిధులు, హ్యాండ్ గ్రెనేడ్ల చేరవేత


పోలీసులు అరెస్టు చేసిన ఉగ్రవాదులు

**హైదరాబాద్, అక్టోబర్ 2, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో బాంబు దాడులకు పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు పన్నిన కుట్రను సిటీ పోలీసులు భగ్నం చేశారు. దసరా ప ండగ వేళ జనసమూహం వున్నచోట హ్యాండ్ గ్రేనేడ్లతో దాడులు చేసి మారణహోం సృష్టించేందుకు కుట్ర పన్నిన ముగ్గురు ఉగ్రవాదులు ఈ సందర్భంగా పట్టుబడ్డారు. వీరి వద్ద నుంచి నాలుగు హ్యాండ్ గ్రేనేడ్లతో పాటు భారీగా నగదు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

దేశ వ్యాప్తంగా ఉగ్ర దాడులకు పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పిఎఫ్ఐ) పన్నిన కుట్రలను భగ్నం చేసిన పోలీసులు ఈ క్రమంలో ఇతర ఉగ్ర సంస్థలతో పాటు వాటి సానుభూతిపరులపై నిఘా వుంచగా సిటీ పోలీసులకు ఆదివారం నాడు ముగ్గురు కరుడుగట్టిన ఐఎస్ఐ ఉగ్రవాదులు పట్టుబడ్డారు. మలక్‌పేట్‌లోని మూసారాంబాగ్‌కు చెందిన అబ్దుల్ జాహెద్ అలియాస్ మోటు (40), అదే ప్రాంతంలోని అక్బర్‌బాగ్‌కు చెందిన మహమ్మద్ సమీరుద్దీన్ అలియాస్ అబ్దుల్ సమీ (39), హుమాయూన్‌నగర్‌కు చెందిన మాజ్ హసన్ ఫారూక్ అలియాస్ మాజ్ (29) అనే ముగ్గురు ఉగ్రవాదులు జంట నగరాలలో దసరా పండగ వేళ నగరంలో జనం ఎక్కువగా వుండే ప్రాం తాలలో గ్రేనేడ్లతో దాడులు చేసి మారణహోమం సృష్టించాలని వ్యూహం రచించారు. ఈ ముఠాకు జాహెద్ నాయకుడు. ఇతనిపై అనేక ఉగ్ర కేసులున్నాయి. ఇందులో 2005లో బేగంపేట్‌లో అప్పట్లో వున్న సిటీ టాస్క్‌ఫోర్స్ కార్యాలయంపై జరిగిన ఆత్మాహుతి దాడి కేసు కూడా వుంది. ఈ కేసులో ఆత్మాహుతి బాంబర్‌గా వున్న బం గ్లాదేశ్‌కు చెందిన దాలిన్‌తో పాటు ఇతన్ని అడ్డుకున్న హోంగార్డు సత్యనారాయణ కూడా బలయ్యాడు. ఈ ఘటన అప్పట్లో సంచలనం రేపింది. దేశంలో పారా మిలటరీ, రక్షణ బలగాల కార్యాలయాలు మినహా శాంతి భద్రతల పోలీసు కార్యాలయాలపై ఈ తరహా దాడులు జరగడం అదే మొదటిసారి.


ఈ కేసులో జాహెద్ సహా అనేక మంది నిందితులున్నారు. కాగా ఈ ఘటన తరువాత జాహెద్ అరెస్టయి బెయిలుపై విడుదలై పారిపోయి అజ్ఞాతంలో వుంటూ పాకిస్తాన్‌లోని ఐఎస్ఐ ఉగ్రవాదులతో కలిసి హైదరాబాద్‌లో బాంబుదాడులకు కుట్రలు పన్నుతూనే వున్నాడు. ఈ క్రమంలో పాకిస్తాన్‌లోని ఉగ్రవాదుల నుంచి జాహెద్‌కు భారీగా నిధులతో పాటు హ్యాండ్ గ్రానేడ్లు అందాయి. ఈ గ్రానేడ్లను వాడి దసరా రోజున జంట నగరాలలో విధ్వంసం సృష్టించేందుకు జాహెద్ వ్యూహం రచించాడు. ఇందుకుగానూ తనకు నమ్మకంగా వున్న స మీయుద్దీన్, హాసన్ ఫారుక్‌లను ఎంచుకు న్నాడు. ఈఇద్దరుకూడా ఉగ్రవాదులే కావడం గమనార్హం. వీరికి కూడా పాక్‌లోని ఉగ్రవాదుల నుంచి దండిగా డబ్బులు అందాయి.

ఇదే సమయంలో పాక్‌లో రహస్యంగా వున్న హైదరాబాద్‌కు చెందిన ఉగ్రవాదులు షర్ఫతుల్లా ఘోరీ అలియాస్ సిద్దిఖీ, సిద్దిఖీ బిన్ ఉస్మాన్ ≫2

## పార్టీలో సంస్కరణలు నా లక్ష్యం: శశిథరూర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 2:** కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష ఎన్నికల సమయం దగ్గరపడుతున్న కొద్దీ ప్రధాన అభ్యర్థులు మల్లిఖార్జున ఖర్గే, శశిథరూర్ ప్రచారం ముమ్మరం చేశారు. అందులో భాగంగా శశిథరూర్ ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌కు వచ్చారు. కాంగ్రెస్ నేతలను కలువనున్నారు. తాజాగా ఎంపీ శశిథరూర్ స్పందిస్తూ... ఇదేమీ యుద్ధం కాదని, తామీమీ శత్రువులం కాదని స్పష్టం చేశారు. ఇవి తమ పార్టీ భవిష్యత్తు కోసం జరుగుతున్న ఎన్నికలు మాత్రమేనని అన్నారు. ఖర్గే కాంగ్రెస్ పార్టీలోని టాప్-3 నేతల్లో ఒకరని తెలిపారు. అయితే ఖర్గే వంటి నేతలు పార్టీలో ఎలాంటి మార్పును తీసుకురాలేరని, ఉన్న వ్యవస్థలనే కొనసాగించడం తప్ప వారేమీ కొత్తగా చేయలేరని థరూర్ పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలు కోరుకుంటున్న మార్పు నాతోనే సాధ్యం అంటూ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి కోసం పోటీ పడుతున్న అభ్యర్థుల మధ్య బహిరంగ చర్చ ఏర్పాటు చేయాలని అన్నారు.

ఇటీవల బ్రిటన్ ప్రధానిని ఎన్నుకునేందుకు కన్జర్వేటీవ్ పార్టీ అనుసరించిన విధానం తరహాలోనే సభ్యుల మనోగతాలను తెలుసుకోవాలని శశిథరూర్ సూచించారు. సంస్థాగత సిద్ధాంతాలను తోడు ప్రభావవంతమైన నాయకత్వమే కాంగ్రెస్ పార్టీని సమర్థంగా నడిపించగలమని అభిప్రాయపడ్డారు. నెహ్రూ-గాంధీ కుటుంబీకులకు కాంగ్రెస్ శ్రేణుల హృదయాల్లో ఎల్లప్పుడూ ప్రత్యేక స్థానం ఉంటుందని అన్నారు. ఈఅక్టోబర్ 17న కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి.



## కరోనా సమాచారం

| |
|---|
| ప్రపంచంలో |
| మొత్తం బాధితులు 62.33 కోట్లు |
| మరణాలు-65.50 లక్షలు |
| దేశంలో |
| తాజా కేసులు - 3,364 |
| మరణాలు - 7 |
| తెలంగాణలో |
| తాజా కేసులు- 66 |
| మృతులు -0 |

## దసపల్లా భూములపై రాజకీయం వద్దు

### ఇష్టానుసారంగా ఆరోపణలు చేస్తే న్యాయపరమైన చర్యలు

**విశాఖపట్నం, అక్టోబరు 2, ప్రభాతవార్త:** నగరంలోని దసపల్లా భూములపై రాజకీయ రంగు పులమొద్దు అని ఆ భూముల యాజమాని రాణి కమలాదేవి కుమారుడు దిగ్విజయ్ చంద్ర దేవ్ భంజ్ స్పష్టంచేశారు. రాజకీయపరమైన అవసరాల నేపథ్యంలో పలువురు చేస్తున్న ఆరోపణలతో తీవ్రంగా కలత చెందారని దిగ్విజయ్ చంద్ర దేవ్ భంజ్ తరుపున ఆయన న్యాయవాది ఎస్.ఆరుణ్‌దేవ్ స్పష్టంచేశారు. రాజకీయంగా లబ్దిపొందేందుకు రాజకీయ పలుముకొని... కొంతమంది రాజకీయ ప్రముఖులను ఈ అంశంలోకి తీసుకొనిరావడం సమంజసం కాదని ఆయన స్పష్టంచేశారు. భూములకు సంబంధించిన అంశం కోర్టులో వుందని, కొంత స్థలంపై కోర్టు వివాదం నడుస్తుండగా, మరికొంత స్థలం క్రయ, విక్రయాలకు అనుకూలంగా వుందనిచ ఆ స్థలం థర్డ్ పార్టీకి విక్రయించినట్టు ఆయన స్పష్టంచేశారు. రాజకీయమైన రంగును పులుముతూ... మమ్ముల్ని నవ్వులపాలు చేస్తూ... రాజకీయంగా లబ్దిపొందాలని ఇష్టానుసారంగా ఆరోపణలు చేయడం సమంజసం కాదని ఆ భూముల యాజమాని మహారాణి రాణి కమలాదేవి కుమారుడు దిగ్విజయ్ చంద్ర దేవ్ భంజ్ పేరిట ఆయన తరుపున ఆయన న్యాయవాది ఎస్.ఆరుణ్‌దేవ్ వివరించారు. విశాఖ నగరంలో దసపల్లా భూములకు చట్టబద్ధమైన, నిజమైన యజమానులైన దసపల్లా మహారాణి రాణి కమలా దేవి, ఆమె కుమారుడు దిగ్విజయ్ చంద్రదేవ్ భాంజ్ మాత్రమేనని వివరించారు. ఈ దసపల్లా భూములను సుప్రీంకోర్టు సైతం ప్రయివేటు భూములుగానే ప్రకటించినట్టు ఆయన పేర్కొన్నారు.

2015లో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఏపీ అడ్వకేట్ జనరల్ దసపల్లా రాణి కుటుంబసభ్యులకు, సన్నిహితులకు తెలియజేశారని, ఇదే విషయాన్ని జిల్లా కలెక్టర్‌కు కూడా తెలియజేసినట్టు వివరించారు. కొన్ని సందర్భాల్లో ప్రత్యర్థులు స్వార్థ రాజకీయ పూరితంగా దాఖలు చేసిన వ్యాయజ్యాలు సైతం కోర్టు కొట్టివేసిందని పేర్కొన్నారు. మహారాణి కమలాదేవికి అనుకూలంగా డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పు నేపథ్యంలో... స్వార్థ రాజకీయ ప్రయోజనాల కారణంగా ఆస్తుల రిజిస్ట్రేషన్ చాలా కాలంగా నిలిచిపోయాయి. దసపల్లా కుటుంబం 1959 నుంచి తమ భూమిలో కొంత భాగాన్ని థర్డ్ పార్టీలకు విక్రయించడం.. దసపల్లా కుటుంబానికి చెందిన కొనుగోలుదారులు, దసపల్లా కుటుంబ సభ్యులు కలిసి మిగిలిన భూమిని నిషేధిత రిజిస్టర్ నుంచి డి-నోటిపై చేయాలని ప్రభుత్వంతో అవిశ్రాంతంగా ఉద్యమించారు. దసపల్లా కుటుంబ సభ్యులు, వారి కొనుగోలు దారులు ఆ భూములను అభివృద్ధి చేసేందుకు అష్యూర్ డెవలపర్స్ ఎల్‌ఎల్‌పితో సంయుక్తంగా అభివృద్ధి ఒప్పందాలు కుదుర్చుకున్నాయని తెలియజేసుకుంటున్నాం. దసపల్లా కుటుంబానికి, ఇతర కొనుగోలుదారులకు ఏ రాజకీయ పార్టీతో కానీ, ముఖ్యంగా రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి లేదా అతని కుటుంబ సభ్యులతో రాజకీయ సంబంధాలు మా భూములకు సంబంధించి లేవని, మా భూములకు సంబంధించి మాలో మేము రాజకీయ నాయకులు సంప్రదించలేదని స్పష్టచేస్తున్నట్టు న్యాయవాదిఎస్.ఆరుణ్‌దేవ్ స్పష్టం చేశారు.

దసపల్లా కుటుంబం, భూమిని కొనుగోలు చేసి ఇతర లావాదేవీలు పూర్తిగా వారి వ్యక్తిగత లావాదేవీలని, పేర్లను ప్రమేయం చేయవద్దని, జోడించవద్దని దసపల్లా భూముల యాజమానులు అభ్యర్తిస్తున్నట్టు వివరించారు. ఈ భూమికి ఏదైనా రాజకీయ రంగు అయినప్పటికీ కొన్ని స్వార్థ రాజకీయ ప్రయోజనాల కారణంగా ఆస్తుల రిజిస్ట్రేషన్ చాలా కాలంగా నిలిచిపోయిందని వివరించారు. అష్యూర్ డెవలపర్‌లతో ఒప్పందం పూర్తిగా మా ఇష్టానుసారంగా, వాణిజ్యపరమైన పరిశీలనపై ఆధారపడి ఉంటుందని వివరించారు. ఎటువంటి ఒత్తిడి, బలవంతం కానీ లేదని పేర్కొన్నారు.

దసపల్లా కుటుంబానికి, ఇతర కొనుగోలుదారులకు ఏ రాజకీయ పార్టీతో, పార్టీలోని వ్యక్తులతో మాకు సంబంధం లేదని, వ్యక్తిగత లావాదేవీలు మా శ్రమేనని తెలియజేసుకుంటున్నామని ఆయన వివరించారు. దసపల్లా భూములపై ఎటువంటి లావాదేవీలైనా.. మా వ్యక్తిగతమైనవి మాత్రమేనని రాణి కమలాదేవి కుమారుడు దిగ్విజయ్ చంద్ర దేవ్ భంజ్ స్పష్టంచేసినట్టు ఆయన న్యాయవాది ఎస్.ఆరుణ్‌దేవ్ స్పష్టం చేశారు.



## ఎదురు కాల్పుల్లో లష్కరే ఉగ్రవాది హతం

**శ్రీనగర్, అక్టోబరు 2:** జమ్ముకాశ్మీర్‌లో రక్షణ దళాలు గాలింపుచర్యలు ముమ్మరంచేసారు. దక్షిణ కాశ్మీర్‌లోని షోపియన్ జిల్లాలో బస్కుచరన్ ప్రాంతంలో మిలిటెంట్లు సంచరిస్తున్నారన్న నిర్దిష్టమైన సమాచారం అందడంతో గాలింపులు ముమ్మరంచేసారు. దీనితో మిలిటెంట్లు ఎదురపడిన జవాన్లపై కాల్పులకు తెగపడటంతో భద్రతా దళాలు జరిపిన కాల్పుల్లో లష్కరే తాయిబా ఉగ్రవాది చనిపోయాడు. మిలిటెంట్ షోపియన్ ప్రాంతంలోని నౌపోరా ప్రాంతానికి చెందిన నసీర్ అహ్మద్‌భట్ అని తేలింది. మిలిటెంట్ చనిపోయిన తర్వాత కూడా గాలింపుచర్యలు ముమ్మరంగా కొనసాగాయి. అయితే ఈమిలిటెంట్ స్థానికుడేనని, లష్కరేకు పనిచేస్తున్నట్లు తెలిపారు. అదనపు డిజిపి విజయ్‌కుమార్ మాట్లాడుతూ చనిపోయిన ఉగ్రవాది అనేక ఉగ్ర నేరాల్లో పాలుపంచుకున్నాడని, ఇటీవలికాలంలోనే ఒక ఎన్‌కౌంటర్‌ప్రాంతంనుంచి తప్పించుకున్నట్లు కూడా తెలిపారు. సంఘటన ప్రాంతంలో ఉగ్రసమాచారంతోపాటు ఆయుధ సామగ్రి, ఒక ఎకె 47 తుపాకీని స్వాధీనం చేసుకున్నారు.



గాంధీజీ, శాస్త్రీజీలకు ఘన నివాళులు



ఆదివారం న్యూఢిల్లీలోని రాజ్‌ఘాట్ వద్ద మహాత్మా గాంధీజీకి, విజయ్ ఘాట్ వద్ద లాల్‌బహదూర్ శాస్త్రికి నివాళులర్పిస్తున్న రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోడీ

## వారం - వర్జ్యం

**3-10-2022 సోమవారం**
శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం
ఆశ్వయుజ మాసం, శుక్ల పక్షం, కార్తి హస్త
అష్టమి మ.3-36; పూర్వాషాఢ రా.12-25
వర్జ్యం ఉ.11-01 ల 12-30
రా.కా.ఉ.7-30 - 9-00 వ
యమగండం ఉ.10-30 ల 12-00 వ
దుర్ముహూర్తం మ.12-24 ల 1-12;
మ.2-48 ల 3-36 వ

## వార్తాఫలం

**మేషం:** ధర్మ రక్షణకై పాటుపడతారు చిరు వ్యాపారులకు పోటీ అధికం.

**వృషభం:** దేవాలయాలు సందర్శిస్తారు. భాగస్వామ్య వ్యాపారులకు సామాన్యం.

**మిథునం:** స్త్రీలకు స్థిరాస్తులు లభిస్తాయి. రోజంతా ఉత్సాహంగా గడుస్తుంది.

**కర్కాటకం:** ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆదాయానికి మించిన ఖర్చులు.

**సింహం:** ఉద్యోగులకు అదనపు ఆదాయం లభిస్తుంది. ముఖ్యమైన పనులు పూర్తి.

**కన్య:** ఆదాయానికి తగిన ఖర్చులుంటాయి. భూ వివాదాలు తీరుతాయి.

**తుల:** సాహస నిర్ణయాలు అమలు. ఆకస్మిక సంఘటనలు జరిగే సూచనలున్నాయి.

**వృశ్చికం:** చోర భయం పొంచి వుంది, విలువైన పత్రాల విషయంలో జాగ్రత్త.

**ధనుస్సు:** ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తారు.

**మకరం:** కుటుంబ గౌరవం పెంపొందుతుంది. విద్యార్థులకు పరీక్షల్లో విజయం.

**కుంభం:** శక్తి సామర్థ్యాలకు తగిన గుర్తింపు లభిస్తుంది. తీర్థ యాత్రలు చేస్తారు.

**మీనం:** చిరకాల వాంఛ నెరవేరుతుంది. సన్నిహితుల సహకారం లభిస్తుంది.

**- పాలకుర్తి సంతోష శర్మ,** విజయపురి కాలనీ, హైదరాబాద్

# అహింసను మించిన ఆయుధం లేదు

## మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రికి నివాళులర్పించిన గవర్నర్ హరిచందన్



మహాత్మా గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటాలవద్ద నివాళులర్పిస్తున్న గవర్నర్ హరిచందన్

**విజయవాడ, అక్టోబరు 2, ప్రభాతవార్త ప్రతినిధి** :అహింసను మించిన ఆయుధం లేదని ప్రపంచానికి చాటి చెప్పిన మహాత్ముని జీవితం ఆచరణీయమని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. కేవలం భారతీయులే కాక ప్రపంచ వ్యాప్తంగా "అంతర్జాతీయ అహింసా దినోత్సవం"గా జరుపుకోవడం భారతీయులుగా మనకు గర్వకారణమన్నారు. ఆదివారం మహాత్మాగాంధీ 153వ జయంతి దివంగత ప్రధాని లాల్‌బహుదూర్ శాస్త్రి జయంతి 118వ జయంత వేడుకలు రాజ్‌భవన్‌లో ఘనంగా నిర్వహించారు. గవర్నర్ జాతిపిత గాంధీ, దివంగత ప్రధాని లాల్ బహుద్దూర్ శాస్త్రిల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా బిశ్వభూషణ్ హరిచందన్ మాట్లాడుతూ మహాత్మాగాంధీ సత్యం, న్యాయం పట్ల విశ్వాసంతో యావత్ ప్రపంచానికి మార్గదర్శిగా నిలిచారన్నారు. అహింసా మార్గంలో శాంతిని నెలకొల్ప దానికి గాంధీజీ చేసిన కృషి చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. భారతదేశ స్వాతంత్ర ఉద్యమానికి మార్గదర్శకత్వం వహించిన గొప్ప నాయకుడిని స్మరించుకోవడానికి, ఆయన కలలు కన్న భారతదేశ నిర్మాణం విషయంలో పునరంకితం కావడానికి జయంతి వేడుకలు ప్రేరణగా నిలుస్తాయన్నారు. మహాత్మాగాంధీ శాంతియుత పౌరహక్కుల ఉద్యమాల్లో భాగంగా 1930 నాటి ఉప్పు పన్నుపై దండి మార్చ్, 1942లో క్విట్ ఇండియా ఉద్యమం ఆలంబనగా బ్రిటీష్ పాలకులు భారతదేశాన్ని విడిచి వెళ్లాలన్న వత్తిడి తీసుకురాగలిగారన్నారు. స్ఫూర్తి దాయకమైన గాంధీజీ ఆలోచనల ఫలితంగానే లక్షలాదిమంది ప్రజల స్వాతంత్ర్య ఉద్యమాలకు సమిధలుగా మారారన్నారు. గాంధీజీ తన చివరి శ్వాస వరకు దేశంలో సామాజిక సమస్యల నిర్మూలనకు కృషి చేశారని, కుల వ్యవస్థ, అంటరానితనం నిర్మూలన, సమానత్వం, సామాజిక న్యాయం సాధన వంటి విషయాల్లో అలుపెరుగని పోరాటం చేశారని గవర్నర్ అన్నారు.

మరోవైపు లాల్ బహుదూర్ శాస్త్రిజయంతిని ఈ రోజు కూడా జరుపుకుంటున్నామని, 'జైజవాన్ జై కిసాన్' అన్న శాస్త్రీజీ నినాదం మనందరి మనస్సులలో శాశ్వతంగా నిలిచిపోతుందన్నారు. లాల్ బహుదూర్ శాస్త్రి సామాన్యులతో అత్యంత సన్నిహితంగా మెలిగిన నేపథ్యంలో ప్రజా జీవితం దేశ ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. లాల్‌బహుదూర్ శాస్త్రి బలమైననాయకునిగా దేశ ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నప్పటికి వినయంతో, మృదువుగా మాట్లాడేవారని గవర్నర్ అన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ వారి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్‌పి సిసోడియా, రాజ్‌భవన్ సంయుక్త కార్యదర్శి సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉగ్రకుట్ర భగ్నం

≫ అలియాస్ రఫీక్, అ బ్దుల్ హంజా అలియాస్ మజీద్‌లు జాహెద్‌కు సహకారం అందించారు. పాక్‌లో తలదాచుకున్న షర్వతుల్లా ఘోరీ, సిద్దిఖీ బిన్ ఉస్మాన్, అబ్దుల్ హంజాలు నగరంలో గత ంలో జరిగిన అనేక ఉగ్రదాడుల్లో నిందితులుగా వున్నారు. 2002లో దిల్‌సుక్ నగర్‌లోని సాయిబాబా దేవాలయం వద్ద జరిగిన బాంబు దాడి, 2005లో సిటీ టాస్క్‌ఫోర్స్ కార్యాలయంపై జరిగిన ఆత్మాహుతి దాడి, 2004లో సికింద్రాబాద్‌లోని ప్రసిద్ధ గణేష్ దేవాలయం వద్ద పేలుడుకు జరిగిన కుట్రలోనూ నిందితులుగా వున్నారు. దీంతో పాటు ముంబాయిలో జరిగిన ఉగ్ర దాడుల్లో కూడా వీరి పాత్ర వెలుగు చూసింది. కాగా హైదరాబాద్‌లో దసరా పండగ వేళ వరుస దాడులకు పన్నిన కుట్ర భ గ్నం అయిన తరువాత ఇందులో కీలక నిందితుడుగా వున్న జాహెద్‌ను పోలీసులు విచారించగా అనేక విషయాలను వెల్లడించాడు. పాకిస్తాన్‌లో వున్న షర్వతుల్లా ఘోరీ, సిద్దిఖీ బిన్ ఉస్మాన్, అబ్దుల్ హంజాలతో తాను నిత్యం మాట్లాడుతూనే వున్నానని, వారు తనకు అక్కడి ఉగ్రవాదులతో కలిసి భారీగా డబ్బులు పంపడంతో పాటు దస రా పండగ నాడు బాంబు దాడులకు పథకం రచించాలని ఆదేశించారని వెల్లడించాడు. వీరి ఆదేశాలతోనే తాను తనతో నమ్మకంగా వుండే సమీయుద్దీన్, మాజ్ హసన్‌లను ఉగ్రవాదులుగా భర్తీ చేశానని, వారికి కూడా డబ్బుల ఆశచూపి తనతో వుండేలా చేసుకున్నానని జాహెద్ తెలిపాడు.

# మైసూరు చేరుకున్న రాహుల్ యాత్ర

**మైసూర్ :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ఆదివారం 25వ రోజున మైసూర్ చేరుకుంది. ప్రస్తుతం కర్నాటకలో యాత్ర సాగిస్తున్న రాహుల్..జాతిపిత మహాత్ముడి జయంతి సందర్భంగా ఆదివారం ఉదయం ఆయనకు నివాళులర్పించి ఆ తర్వాత ఇతర కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 1927లో కర్నాటక మైసూర్ జిల్లాలోని బాదనవాలులో గాంధీ సందర్శించిన ఖాదీ గ్రామోదయ కేంద్రంలో మహాత్ముడికి రాహుల్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాహుల్ ప్రసంగిస్తూ..గాంధీ సిద్ధాంతాన్ని వల్లించడం కేంద్రంలో అధికారంలో ఉన్నవారికి సులభంగానే ఉంటుంది. కానీ, ఆయన అడుగుజాడల్లో నడవడం మాత్రం కష్టమంటూ విమర్శించారు. జాతిపితను చంపిన సిద్ధాంతమే గడిచిన ఎనిమిదేళ్లుగా దేశంలో అసమానత్వం, విభజనవాదాన్ని వ్యాప్తి చేస్తోందని రాహుల్ ఆరోపించారు. దేశం కన్న గొప్పబిడ్డ గాంధీఅని రాహుల్ అన్నారు. అహింస, ఐక్యత, సమానత్వం, న్యాయం ఆయన సిద్ధాంతమని రాహుల్ గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో భారత్ జోడో యాత్రను కొనసాగిస్తున్నామన్నారు. బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా గాంధీ పోరాడినట్లే, మహాత్ముడిని చంపిన సిద్ధాంతంపై తాము యుద్ధం ప్రకటించామని రాహుల్ అన్నారు. సాయంత్రం కూడా రాహుల్ తన యాత్రను కొనసాగించారు. రాహుల్ యాత్ర మైసూర్ చేరుకున్న సందర్భంగా భారీ జన సమీకరణ జరిగింది. జోరున వర్షం కురుస్తున్నా రాహుల్ తన ప్రసంగాన్ని కొనసాగించారు.

ఈ సందర్భంగా రాహుల్ 'భారత్‌ను ఐక్యం చేయకుండా మమ్మల్ని ఎవరూ అడ్డుకోలేరు. భారత్ వాణిని వినిపించకుండా మమ్మల్ని ఎవరూ అడ్డుకోలేరు. కన్యాకుమారి నుంచి కాశ్మీర్‌కు సాగే భారత్ జోడో యాత్రను ఎవరూ అడ్డుకోలేరు' అంటూ హిందీలో ట్వీట్ చేశారు.

# పల్లెల అభివృద్ధి

≫చారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ గాంధీ కలలను సాకారం చేసే రీతిలో తమ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్ద ద్వారా గాంధీజీ ఆశించిన గ్రామీణ స్వరాజ్యస్దాపనకు కృషి చేస్తున్నామన్నారు. దేశ,జాతీయ ఆర్థిక పరిపుష్టికి వ్యవసాయరంగం దోహదం చేస్తుందన్నారు.ఆ వ్యవస్ద అభివృద్ధి చెందాలంటే రైతు క్షేమంగా ఉండాలని దివంగత ప్రధాని లాల్‌బహుదూర్‌శాస్త్రి ఆశించారన్నారు,ఆయనను ఆదర్శంగా తీసుకుని వ్యవసాయరంగంలో విప్లవాత్మక మార్పులకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యం తీసుకువచ్చామని ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి పేర్కొన్నారు.రాష్ట్రంలో ఏర్పాటు చేసిన గ్రామసచివాలయ వ్యవస్ద,గ్రామ/వార్డు వాలంటరీ వ్యవస్ద అనుహ్య పాలనా మార్పులు తీసుకుని వచ్చిందన్నారు.ఇంటి ముంగిటకే ప్రభుత్వ పరిపాలన తరలివచ్చిందన్నారు.మన గ్రామాల్లో మన ఇంటి వద్దకే వచ్చి మన తలుపు తట్టి మనకు ఏ సహాయం కావాలన్నా కూడా వివక్షకు తావు లేకుండా, లంచాలకు తావులేకుండా మనకు మంచి చేస్తున్న గ్రామ, వార్డు సచివాలయాలు, వాలంటీర్ల వ్యవస్థ స్థాపించి అక్టోబర్ 2, గాంధీజయంతికి మూడేళ్ళు పూర్తయిందన్నారు.

గ్రామస్వరాజ్యం మన అందరికీ కూడా కళ్ల ఎదుటే కనిపించేవిధంగా వీరందరూ సేవలు చేస్తున్నారన్నారు. వీరి సేవలను అభినందిసూ ప్రజలంతా ఏక కాలంలో వారిని చప్పట్లు కొట్టి అభినందించడం సంతోషంగా ఉందన్నారు.ప్రజా సంబంధిత సేవలకు సంబంధించి ఇప్పటికి అమలులో వున్న విధానాన్ని బట్టి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి న పరిస్థితి.మండల కేంద్రాల్లోని తహసీల్దార్,మండల పరిషత్, వ్యవసాయ శాఖ,సహకార వ్యవస్దలపై ప్రజలు ఆధారపడాల్సి వచ్చేదన్నారు..

చిన్న ధృవీకరణ పత్రానికి సైతం వారాలు తరబడాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడా పరిస్థితి లేదన్నారు..ప్రతి సచివాలయంలో 10మంది వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు అందుబాటులో ఉంటారన్నారు. సచివాలయాలు ద్వారా పూర్తి పౌరసేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు.ఈ కార్యాలయాల్లో.అర్జీలు అందించిన 72గంటల్లో పూర్తయ్యే 10 సేవలను మొదట ఈ సచివాలయాల ద్వారా అందుబాటులోకి తీసుకుని వచ్చామన్నారు. ఈ సేవలను క్రమేపీ పెంచుతూ పూర్తి స్థాయిలో సేవలను అందుబాటులోకి తీసుకుని వచ్చామన్నారు..,ఈ కార్యాలయాల ద్వారా మరణ.జనన ధృవీకరణ పత్రాల నమునాలను తక్షణం అందజేస్తారు .ప్రతిరోజు గ్రామ సచివాలయాల్లో స్పందన కార్యక్రమం కొనసాగుతుంది..అమ్మఒడి,ఆరోగ్యశ్రీ,రైతు భరోసా,పించన్లు,ఫీజు రీయింబర్సుమెంటు తదితర పథకాలకు సంబంధించిన సేవలన్నింటిని సచివాలయాల ద్వారా అమలు చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి సచివాలయాలను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించిన క్రమంలో అవినీతికి ఆస్కారం లేకుండా ఈ కార్యాలయాల ద్వారా సేవలు అందుతాయని విషయాన్ని అధికారులు నిరూపిస్తున్నారు.ప్రతి గ్రామంలో,వార్డుల్లో జనభాను అనుసరించి సచివాలయాలను ఏర్పాటు చేయటం జరిగిందని వివరించారు.

ఈ కార్యాలయాల పరిధిలో ఆయా పథకాలు అమలుకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని అందుబాటులో ఉంచామన్నారు. ప్రభుత్వం ఇప్పటికే ఆయా సేవలకు సంబంధించి ఉద్యోగులకు విధి విధానాలు,బాధ్యతలకు సంబంధించి అవగాహన సదస్సులను,,శిక్షణను మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అందిస్తున్నట్లు తెలిపారు.

కరోనా నియంత్రణ చర్యల్లోను,ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్దిని ప్రయోజనదారుల దగ్గరికి చేర్చడంలో అనితర సాధ్యమైన రీతిలో వార్డు వాలంటీరులు పనిచేస్తున్నారన్నారు.ప్రజలకు ప్రజా సంకల్ప యాత్ర సందర్భంగా ప్రభుత్వం చేసిన వాగ్దానాల్లో 95శాతం పూర్తి చేసామన్నారు. గ్రామాల రూపే రేఖలు మారుతున్నాయన్నారు.

పట్టణాలు,నగరాలకు దీటుగా అంతర్జాలం, డిజిలైజేషన్ వంటి సదుపాయాలు వచ్చాయన్నారు.గ్రామాలనుంచి కుడా వర్క్ ఫ్రం హోంను నిర్వహించుకునే అవకాశం తీసుకుని వచ్చామన్నారు. గ్రామాలో అత్యంత ఆధునిక వైద్యసేవలను అందించే రీతిలో విలేజీ క్లినిక్ వ్యవస్థను అందు బాటులోకి తీసుకుని వచ్చామన్నారు.రైతు భరోసా కేంద్రాలు దేశ చరిత్రలోనే నూతన అధ్యాయానికి నాంది పలికిందన్నారు.ఈ వ్యవస్దను అభివృద్ధి చేయడం ద్వారా మన ప్రభుత్వం కీలక సంస్కరణలు తెచ్చిందన్నారు.లాల్ బహుద్దూర్ శాస్త్రికుడా రైతులు బాగుండాలని ఆశించారన్నారు.ఆ రీతిలోనే మనం వ్యవసాయాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు.

# రైతు భరోసాతో ఆసరా

≫మద్దతు ధరలు,కొనుగోళ్ళపై ప్రతి రోజు సమీక్ష చేయాలన్నారు.సీఎం యాప్ ద్వారా అందుతున్న డేటాపై డిస్కస్ చేయాలన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.మనం రైతు భరోసా కేంద్రాల అభివృద్ధికి రూ.9093 కోట్లు ఖర్చు చేసు్తన్నందున ఆ పరిధిలో నిర్మిస్తున్న గిడ్డంగులు, శీతలగిడ్డంగులు ఏర్పాటు కావాలన్నారు.డ్రైయింగ్ ప్లాట్‌పామ్స్,ఆక్వా ఇన్‌ఫ్రాస్టక్చర్,అందుబాటులో ఉంచుతున్న వ్యవసాయ యంత్రపరికరాలు, ప్రొక్యూర్‌మెంటు సెంటర్లు,బల్క్‌మిల్క్ కూలింగ్ యూనిట్లు,ఆక్వా బజారు, ప్రీసాసింగ్ ప్లాంట్లు, ప్రాసెసింగ్ ప్లాంట్లు,ఈ- మార్కెటింగ్ ప్లాట్‌ఫాంలతో బహుళ ప్రయోజనకరంగా రూపొందాలన్నారు.

రైతు భరోసా కేంద్రాలను బహుళ ప్రయోజనకర కేంద్రాలుగా రూపొందించే దిశలో కార్యచరణ ప్రణాళిక రూపకల్పన జరగాలనా న్నరు.పై అన్ని రకాల పనులన్ని కుడా ఏక కాలంలో మందుకు సాగాలని ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఆదేశించారు.అధికారులు క్షేత్రస్దాయిలో పనుల పురోగతి ప్రస్ఫుష్టంగా కన్పించాలన్నారు.గ్రామాల్లో ప్రీ పాసెసింగ్ యూనిట్లు ముఖ్యమన్నారు. గిడ్డంగులుతో సహా ఈ యూనిట్లు యుద్ధప్రతిపాదికన ఏర్పాటు కావాలన్నారు.ఇదే సందర్భంలో పేమెంటు గేట్‌వే సెక్యూరిటీ అత్యంత ముఖ్యమన్నారు.బయ్యర్లు,రైతుల మధ్య చెల్లింపులు సక్రమంగా ఉండేందుకు అనువుగా ఒక పటిష్ట విధానం ఉండాలని సీఎం జగన్ అధికారులకు మార్గదర్శనం చేసారు.

బయ్యరు ఆర్డర్ చేయగానే మూడు,నాలుగు రోజుల్లో పంటల డెలివరీ అయ్యే విధంగా చర్యలు ఉండాలన్నారు.లాజిస్టిక్స్ ఉండాలని ముఖ్యమం త్రి జగన్ స్పష్టం చేసారు. డెలవరీ చేయడానికి రైతులు ఇబ్బందులు పడకూడదన్నారు.అన్నింటికి మించి క్వాలిటీకి పెద్దపీట వేయాలన్నారు. ప్రభుత్వం ఆ దిశలో చర్యలను పకడ్బందిగా తీసుకుంటుందన్నారు. గడిచిన వ్యవసాయ తరుణాల్లో రూ.3000కోట్ల ధరల స్దిరికరణ నిధులతో ప్రభుత్వమే గిట్టుబాటు ధరలకు పంటలను కొనుగోలు చేసిందన్నారు.ఈ ఏడాది ధరల స్దిరికరణ నిధికి రూ.3500కోట్లు కేటాయిం చింది, వ్యవసాయ ఉత్పత్తులన్నింటికి కనీస గిట్టుబాటు ధర చెల్లింపు జరగాలన్నారు.రైతులు తమ పంటలు అమ్ముకోవడానికి ఇబ్బందులు పడే పరిస్థితులు ఇక మీదట ఉండవని ఏపీ ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి స్పష్టంచేసారు.



శ్రీవారి ఆలయంలో భక్తితో ధ్వజస్తంభానికి మొక్కుతున్న సిజెఐ జస్టిస్ లలిత్

# అందరికీ శుభాలు కలగాలి

## శ్రీవారి దర్శనంలో సుప్రీం సిజెఐ జస్టిస్ లలిత్

**తిరుమల,అక్టోబర్ 2 ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ శుభాలు కలగాలని స్వామివారిని ప్రార్థించినట్లు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ యుయు లలిత్ తెలిపారు. రెండు రోజుల తిరుమల సందర్శనలో ఆదివారం ఉదయం జస్టిస్ లలిత్ దంపతులు ఆలయం వద్దకు చేరుకున్నారు. వీరికి ఆలయ మహాద్వారం వద్ద టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి, ఇఓ ఏవి ధర్మారెడ్డి స్వాగతం పలికారు. తొలుత ఆలయంలో ధ్వజస్తంభం మొక్కారు. ఆనందనిలయంలోనికి చేరుకుని శ్రీవారిని దర్శించుకుని, ఆశీస్సు లందుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు.

టిటిడి ఛైర్మన్ సుబ్బారెడ్డి, ఇఓ ధర్మారెడ్డి శ్రీవారి ప్రసా దాలను, చిత్ర పటాన్ని అందించారు. డ్రైఫ్లవర్స్‌తో రూపొందించిన శ్రీవారి ఫోటోఫ్రేమ్‌ను ప్రత్యేకంగా బహుకరించారు. సిజెఐ జస్టిస్ లలిత్ వెంట ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సిజె జస్టిస్ ప్రశాంత్ కుమార్‌మిశ్ర ఉన్నారు.



దుర్గమ్మకు పట్టువస్త్రాతలు సమర్పించడానికి వెళుతున్న సిఎం జగన్

# పట్టు వస్త్రాలు

≫ పలికారు. ఆదివారం మూలానక్షత్రం ఈ రెండు ఒకేమారు రావడంతో దుర్గమ్మ భక్తులు వెల్లువలా తరలివచ్చారు. శనివారం ఆలయం మూసివేసే సమయానికి భక్తులు రాత్రి నుండి క్యూలైన్ల లో కి చేరుకుని దుర్గమ్మను ఆదివారం దర్శించుకోటానికి సిద్దంగా వచ్చేశారు. దాంతో క్యూలైన్లన్ని నిండిపోయాయి. ఉదయం 2 గంటలకు దర్శనాలు మొదలైనాయి. ముందుగా వివిఐపిలు, విఐపిలను అనుమంతించి ఉదయం 3 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతించారు. భక్తులందరికి శీఘ్రంగా దర్శనం కలిగించడానికి దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, కలెక్టర్ ఢిల్లీరావు, ఇఓ డి భ్రమరాంబలు ఆలయం, క్యూలైన్లు పరిశీలిస్తూ ఎక్కడా జాప్యం లేకుండా దర్శనం కలిగేలా తగు చర్యలు తీసుకున్నారు. ఇక సిఎం పర్యటన వుండడంతో మధ్యాహ్నం 2.30 గంటలకు దర్శనాలు నిలిపివేసి, మరలా మధ్యాహ్నం 3.30 గంటలకు భక్తులను దర్శనాలకు అనుమతించారు. సిఎం పట్టువస్త్ర సమర్పణ విజయవంతంగా పూర్తవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

**6వరోజు ఆలయ ఆదాయం:**

దసరా నవరాత్రుల్లో అయిదవ రోజు శనివారం అమ్మవారు శ్రీ మహాలక్ష్మి దేవి అలంకారం రోజు వివిధ సేవల టికెట్‌లు కొనుగోలు, ప్రసాదాలు అమ్మకాల ద్వారా రూ.60,59,248/-లు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఇవో దర్భముళ్ల భ్రమరాంబ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

**సిఎం పర్యటన వున్నప్పటికి భక్తులకు శీఘ్రంగా దర్శనం: మంత్రి కొట్టు**

దుర్గమ్మను దర్శించుకోటానికి తరలివచ్చిన భక్తులకు ఒక్క గంటసేపు మాత్రమే ఆదివారం దర్శనాలు నిలిపివేశామని, సిఎం పర్యటన వేగంగా ముగించి సామాన్య భక్తులకు త్వరితంగా దర్శనమయ్యేల ఏర్పాట్లు చేయడంతో భక్తులంతా హర్షం వ్యక్తం చేసినట్లు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి అయిన కొట్టు సత్యనారాయణ మీడియాకు తెలిపారు. ఆదివారం సాయంత్రం దేవస్థానం మీడియా పాయింట్లో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది భక్తజనానికి త్వరగా దర్శనమ్యేలా తాము చేసిన ఏర్పాట్లు సత్ఫలితాలిచ్చాని సంతృప్తి వ్యక్తం చేశారు.

**ఉత్సవ ఏర్పాట్లు భేష్:డిజిపి రాజేంద్రనాథ్‌రెడ్డి**

దుర్గమ్మ ఆలయానికి దసరా సందర్భంగా తరలివచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వేగంగా దర్శనం అయ్యేలా ఏర్పాట్లు చేయడాన్ని రాష్ట్ర డిజిపి రాజేంద్రనాథ్ రెడ్డి అభినందించారు. సరస్వతి మాత అలంకారంలో ఆదివారం దుర్గమ్మను ఆయన దర్శించుకున్నారు. ఆయనకు దర్శనానంతరం తీర్థప్రసాదాలు, వేదాశీర్వచనం, శేషవస్త్రం, శ్రీ అమ్మవారి మెమొంటోలను అందజేశారు.

**దసరాల్లో అపశృతి:**

దుర్గమ్మ దర్శనానికి వచ్చిన ఒక వృద్దుడు ఆదివారం మధ్యాహ్నం క్యూలైన్లో వుండగా ఉన్నట్లుండి కుప్పకూలిపోయాడు. ఆయనను వెంటనే అధికారులు వైద్యశాలకు తరలించగా అక్కడ వైదు ్యలు ఆయన మరణించినట్లు ధృవీకరించారని జిల్లా వైద్య శాఖాధికారిణి ఎం సుహాసిని వెల్లడించారు.

**క్యూలైన్లలో పడిగాపులు పడిన భక్తుల అగచాట్లు:**

దుర్గమ్మ దర్శనానికి 45 నిముషాలు మాత్రమే పడుతున్నట్లు మంత్రులు, అధికారులు ఆర్భాటంగా ప్రకటిస్తున్నప్పటికి ఆదివారం కనీసం 5 గంటలు పట్టినట్లు దుర్గమ్మను దర్శించుకున్న భక్తులు వెల్లడించారు.

క్యూలైన్లలో తమకు మంచినీరు, తదితర సౌకర్యాలందించినప్పటికి 5.30 గంటలపాటు క్యూలైన్లోనే వుండాల్సి రావడంతో తామంతా పలు ఇబ్బందులకు గురయ్యారన్నారు. మంత్రులు అధికారులు 45 నిముషాల్లోనే సామాన్యునికి దర్శనం అన్నమాటలు నమ్ముకుని వచ్చిన తమకు ఇంత ఆలస్యమవుతుందని ముందుగానే తెలిస్తే కనీసం ఏమన్నా ఆహారం తెచ్చుకునేవారమంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

# అరుదైన వ్యాధి చికిత్సకోసం సిఎం జగన్ ఉదారత

## చిన్నారి హనీ వైద్యానికి రూ.కోటి మంజూరు

### మొదటి విడతగా రూ.10లక్షల విలువ చేసే 13 ఇంజక్షన్లు అందజేసిన కలెక్టర్



**అమలాపురం, అక్టోబర్ 2 ప్రభాతవార్త బ్యూరో:** డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం నక్కా రామేశ్వరానికి చెందిన కొప్పాడి రాంబాబు నాగలక్ష్మి దంపతులకు చెందిన రెండున్నర సంవత్సరాల చిన్నారి హనీకి గాకర్స్ వ్యాధి చికిత్స కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి రూ.కోటి బడ్జెట్ కేటాయించారని కలెక్టర్ తెలిపారు. చిన్నారి హనీకు పుట్టుకతో ఈ వ్యాధి వచ్చిందని ఈ వ్యాధి మూలంగా లివరు పనిచెయ్యదని జిల్లా కలెక్టర్ హి మాన్స్ శుక్లా తెలిపారు. ఆదివారం స్థానిక ఏరి యా ఆసుపత్రి వద్ద జిల్లా కలెక్టర్ పాప తల్లి దండ్రులకు ప్రభుత్వం ద్వారా ఉచితంగా సరఫరా చేసిన 13 ఇంజక్షన్లును చిన్నారి తల్లి దండ్రుల కు అందజేశారు. ఇటీవల గోదావరి వరదలు మూ లంగా వరద ప్రాంతాల సందర్శనకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి వారిని కలవడానికి ఆ దంపతులు ప్లేకారు ప్రదర్శించి కాన్వాయ్‌ని ఆపి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డికు ఆ దంపతులు పాపకు అనారోగ్యంగా ఉందని మీరే సహకారం అందించాలని కోరారని, ఆయన వెంటనే స్పందించి అక్కడి కక్కడే ప్రభుత్వ ఉన్నతాధికారులు, వైద్యాధికా రులను జిల్లా కలెక్టర్‌ని సంప్రదించి వైద్య సహాయం అందించాలని ఆదేశించారని ఆ మేరకు గత రెండు నెలలుగా ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపడం జరిగిందని కలెక్టర్ వెల్లడించారు. అవి మంజూరు కావడంతో పాటు పాప హనీ భవిష్యత్తు కోరకు మొత్తం ముఖ్యమంత్రి రూ.కోటి బడ్జెట్ కేటాయించారని కలెక్టర్ తెలిపారు. ఈ గాకర్స్ వ్యాధి నివారణ కోరకు రాష్ట్ర ప్రభుత్వం 52 ఇంజక్షన్లను మంజూరు చేసి ప్రస్తుతం 13 ఇంజక్షన్లను స్థానిక ప్రాంతీయ ఆసుపత్రికి పంపడం జరిగిందన్నారు. ఈ ఇంజక్షన్ ఖరీదు రూ.1,25,000 రాయితీలో రూ.74వేలకు రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసి ఉచితంగా ఇప్పించడం జరిగిందని ఈ ఇంజక్షన్ అమెరికాలో తయారవుతుందని ఇప్పటి వరకూ రూ.1008,000లు విలువ చేసే ఇంజక్షన్లను ప్రభుత్వం ద్వారా ఉచితంగా సరఫరా చేశారని తెలిపారు. ఈ ఇంజక్షన్ 15 రోజులకు ఒకమారు రెగ్యులర్‌గా పాపకి ఇవ్వాలని, పాప భవిష్యత్తు ఎడ్యుకేషన్ పరంగా కూడా ముఖ్యమంత్రి స్పం దించి ఉదారంగా సహకారం అందించారన్నారు. పాప భవిష్యత్తుకు కూడా ప్రణాళికను రచించడం జరుగుతోందన్నారు. పింఛన్ ఇప్పించేందుకు కూడా చర్యలు చేపట్టామన్నారు. దేశంలో ఈ వ్యాధి చాలా అరుదుగా సంక్రమిస్తుందని దేశవ్యా ప్తంగా ఇటువంటి వ్యాధితో బాధపడుతున్న వారు 14మంది ఉన్నారని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వ ఆసుపత్రిలో ఇటువంటి వైద్యం ఇప్పటివరకూ అందించలేదని తొలుతగా స్థానిక ప్రాంతీయ ఆసుపత్రి వద్ద ఈ తరహా వ్యాధి నివారణ చర్యలు ఆరంభమయ్యాయ న్నారు. శరీరంలో జీవక్రియలు జరగడానికి లివర్ అనేది చాలా ముఖ్యమని ఇది జీవితాంతం ఉండిపోతుందని ప్రతీ నెల రెండు పర్యాయాలు అందించాల్సి ఉందన్నారు. పాప తండ్రి కొప్పాడ రాంబాబు తన స్పందన తెలియ జేస్తూ ముఖ్య మంత్రి వర్యులను కలవగానే ఎంతో ఉదారంగా స్పందించి ఎంత ఖర్చు అయినా ఫర్వాలేదు నేను ప్రభుత్వపరంగా ఆదుకుంటానని భరోసా కల్పిం చారన్నారు. భరోసా ఇచ్చిన రెండు నెలల్లో వైద్య సేవలు ఆరంభంకావడం ఎంతో సంతోషంగా ఉం దన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమి షనర్ విఐపి నాయుడు, మున్సిపల్ చైర్మన్ రెడ్డి సత్యనాగేంద్ర మణి, డిసిహెచ్ఎస్ డాక్టర్ పద్మశ్రీ రాణి, ప్రాంతీయ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకర్రావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని సిహెచ్ భరత్ లక్ష్మీ, స్థానిక ప్రజాప్రతినిధులు చెల్లుబోయిన శ్రీనివాస్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.



# అశేష భక్తులకు గరుడసేవ

## సంతృప్తికర దర్శనంపై ఆనందం!

## శ్రీవారిసేవకుల, పోలీసుల,ఉద్యోగుల సేవలు అభినందనీయం

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** దసరా సెలవులు, వారాంతం, ఏడుకొండల్లో అంగరంగవైభవంగా జరుగుతున్న సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ఐదవ రోజు శనివారం రాత్రి గరుడవాహనసేవ విజయవంతంగా తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించింది. పదిరోజుల పక్కా ప్రణాళికలు, కార్యాచరణతో టిటిడి ఉద్యోగులు, తిరుపతి జిల్లా పోలీసుయంత్రాంగం, టిటిడి నిఘాభద్రత విభాగం సమన్వయంతో పనిచేయడంతో 3లక్షల మంది భక్తులకు గరుడవాహన వీక్షణం ప్రశాంతంగా చేయించారు. సాధారణంగా ఏడుకొండలపై 70వేలమంది భక్తులు పెరిగితేనే అటు స్వామివారి దర్శనం ఇటు వసతి సదుపాయం గగనంగా మారుతుంది. టిటిడి అధికారులు తలలుపట్టుకునే పరిస్థితి ఎదురవుతుంది. అలాంటిది ఒక్కసారిగా 3.50లక్షలమంది భక్తులు కిటకిటలాడినా చిన్నపాటి ఇబ్బందులు లేకుండా విజయవంతంగా నిర్వహించడం టిటిడి పనితీరు అభినందనీయం. ఆలయ మాఢవీధుల్లోని గ్యాలరీల్లో గంటలుగంటలు నిరీక్షించినా ,ప్రతి భక్తునికి శ్రీవారిసేవకులు, పోలీసులు, టిటిడి నిఘాభద్రత సిబ్బంది, ఉద్యోగులు చక్కటి సేవలందించి అన్నప్రసాదాలు, తాగునీరు, టీ అందించి భక్తుల మన్ననలు అందుకున్నారు. సాధారణరోజుల్లో రోజుకు 90వేల మంది నుంచి లక్షమంది వరకు భక్తులు వస్తున్న తిరుమల కొండపై 4లక్షలమందికి సేవలుచేయడం టిటిడికి పెద్ద క్లిష్టమైన సమస్యకాదు....అయితే శనివారం దసరా సెలవులు ,ఆపై గరుడసేవరోజు విచ్చేసిన అశేషభక్తులకు నిరంతరాయంగా సకల సదుపాయాలు కల్పించడం వెనుక టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి, టిటిడి ఇఓ ఏవి ధర్మారెడ్డి, తిరుపతి కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జిల్లా ఎస్పి పరమేశ్వరరెడ్డి, సివిఎస్ఓ నరసింహకిశోర్ తమతమ సిబ్బందితో ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ స్వయంగా పరిశీలించారు. గరుడవాహనసేవను విజయవంతం చేసి భక్తులకు సకల సేవలందించిన టిటిడి అధికారులు,సిబ్బంది, పోలీసు,స్కాట్స్ గైడ్స్, శ్రీవారిసేవకుల సమిష్టి పనితీరును టిటిడి ఇఓ ఏవి ధర్మారెడ్డి,తిరుపతి జిల్లా ఎస్పి పరమేశ్వరరెడ్డి పత్యేకంగా అభినందించారు. శనివారం మధ్యాహ్ననికే 4లక్షలమంది భారీసంఖ్యలో భక్తులు తిరుమలకొండపైకి తరలిరావడం, మాఢవీధుల్లోని గ్యాలరీల్లో దాదాపు 2లక్షలమంది భక్తులు వుండటం, వెలుపల మరో 50వేలు, కొండపై మరో 50వేల వరకు పలుచోట్ల వేచి వున్న భక్తులకు సకల సౌకర్యాలు, సేవలందించారు.

# బాలుర విజేత చిత్తూరు, బాలికలు విశాఖి



మొదటి స్థానం సాధించిన చిత్తూరు,వైజాగ్ బాల బాలికలు

**శ్రీకాళహస్తి,అక్టోబర్ 2 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో జరిగిన మూడు రోజుల ఇంటర్ డిస్ట్రిక్ట్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఆదివారం ఫైనల్ మ్యాచ్‌లలో చిత్తూరుజిల్లా బాలురు విజేతలు కాగా బాలికల విభాగంలో విజేతగా విశాఖ జిల్లా విజేతలుగా నిలిచారు. ఆదివారం సాయంత్రం విజేతలకు కప్‌లు, ప్రైజ్‌మనీ అందించారు. శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి,శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు విజేతలకు బహుమతులు అందించారు.

**ఉత్కంఠ భరితంగా సాగిన మ్యాచ్‌లు**

శ్రీకాళ హస్తిలో మూడు రోజుల పాటు ఉత్కంఠభరి తంగా సాగిన మ్యాచ్‌లు ఆదివారంతో ముగి సింది. మ్యాచ్‌లు జరిగిన మూడు రోజులు వర్షం భయభ్రాంతుల్ని చేసింది. ఉత్కంఠభరితంగా సాగిన పోటీలు సజావుగా సాగాయి.13జిల్లాల నుంచి సుమారు 500 మంది క్రీడాకారులు హాజరయ్యారు. 8వ ఇంటర్‌డిస్ట్రిక్ట్ పోటీలను సమర్థవంతంగా నిర్వహించుటకు శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి సహాకారంతో నిర్వహించారు.ఆదివారం సాయంత్రం ఫైనల్ పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి.ఇటు బాలురు అటు బాలికల ఫైనల్ పోటీలు క్రీడాకారుల ఉత్సాహ భరితంగా సాగాయి. శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి మ్యాచ్‌లను తిలకిస్తూ సాగించారు.

**బాలుర పోటీలో చిత్తూరు విజేత**

ఇక్కడ జరిగిన 13జిల్లాల పోటీల్లో బాలుర విభాగంలో చిత్తూరు జిల్లా విజేతలయ్యారు. వారికి కప్‌తోపాటు నగదు బహుమతి రూ.10 వేలు అందించారు. క్రీడాకారులు, విజేతల హర్ష ధ్వానాల మధ్య శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి అందించారు.కాగా రన్నర్‌గా ప్రకాశం జిల్లా క్రీడాకారులు, మూడవ స్థానంలో విశాఖ, నాల్గవ స్థానం కృష్ణాజిల్లా క్రీడాకారులు గెలుపొందారు. వారికి బహుమతులతోపాటు కప్పులను అందించారు.

**బాలికల విభాగం విజేతలు విశాఖ**

శ్రీకాళహస్తిలో జరిగిన 8వ ఇంటర్‌డిస్ట్రిక్ట్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో బాలికల విభాగం విజేతలుగా మూడవ సారి విశాఖ పట్టణానికిచెందిన టీం గెల్చుకున్నారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన పోటీల్లో వరుసగా మూడవ సారి మొదటి బహుమతిని గెల్చుకున్నారు.వారికి శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనంరెడ్డి కప్‌తోపాటు ప్రైజ్‌మనీ రూ.5వేలు నగదును అందించారు. కాగా ద్వితీయ స్థానంలో నెల్లూరుజిల్లా టీం బహుమ తులు అందుకున్నారు.ఇక మూడవ స్థానంలో తూర్పు గోదావరిజిల్లా నిలిచింది. నాల్గవ స్థానంలో విజయనగరం క్రీడాకారులు నిలిచారు. వారికి బహుమతుల్ని అందించారు.

# కొండపై కొనసాగుతున్న దసరా సెలవుల రద్దీ

**తిరుమల,అక్టోబర్ 2 ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకొండపై సాలకట్ల బ్రహ్మోత్సవాలు ముగింపుకు చేరుకున్న సమయంలో దసరా సెలవులు, పెరటాసిమాసం రద్దీతో భక్తులతో కిటకిటలాడుతోంది. శుక్రవారం నుంచే భక్తులరద్దీ విపరీతంగా పెరిగింది. దసరా సెలవులు కొనసాగుతుండటంతోబాటు బ్రహ్మోత్సవాల్లో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. వైకుంఠం-2లో 32కంపార్టుమెంట్లలో భక్తులు నిండిపోయి సర్వదర్శనానికి భక్తులు14గంటలు నిరీక్షిస్తున్నారు. క్యూలైన్లలో భక్తులకు నిరంతరాయంగా శ్రీవారిసేవకులు అన్నప్రసాదాలు, టీపంపిణీచేస్తున్నారు. ఆదివారం సాయంత్రంవరకు 48వేలమంది భక్తులు మహాలఘులో దర్శనం చేసుకున్నారు.

# శ్రీకాళహస్తిని క్రీడల హబ్‌గా తీర్చి దిద్దుతాం:మధుసూధన రెడ్డి

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 2 ప్రభాతవార్త:** క్రీడాకారులు, కళాకారుల, సంప్రదాయాలకు నిలయమైన పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తినీ క్రీడల హబ్‌గా తీర్చి దిద్దుతామని ఇక్కడ అద్భుతమైన స్టేడియంను నిర్మిస్తామని శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి అన్నారు. మూడు రోజుల పాటు ఇక్కడ జరిగిన రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం సాయంత్రం ముగిసాయి.

ఈ సందర్భంగా ఇక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభకు అతిధులను రాష్ట్ర బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు విజయశంకర్‌రెడ్డి స్వాగతం పలికారు. సభకు జిల్లా అధ్యక్షుడు న్యాయవాది వెంకటస్వామి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిధులుగా శాసన సభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి, శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శి వెంకటరావు, శాప్ డైరెక్టర్ వీరరాఘవరెడ్డి, జిల్లా కార్యదర్శి బాలాజి,తమిళనాడుకు చెందిన దేవనాథ్‌న్‌యాదవ్, ధర్మకర్తల మండలి సభ్యులు బుల్లెట్ శ్యాం రాయల్, మున్నారాయల్, అర్కాట్ శంకర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు వెంకటస్వామి మాట్లాడుతూ నేడు రాష్ట్ర స్థాయి పోటీల నిర్వహణకు శాసన సభ్యుని ప్రోత్సాహం ఎంతో ఉందన్నారు.ఆయన



ఆదివారం జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి

చొరవే లేకుంటే ఈ పోటీలు నిర్వహిం చలేమన్నారు. అంతేకాక నియోజకవర్గంలోని పలు పారిశ్రామిక నిర్వాహకులు సహాయం అందించారని వివరించారు.ఛాంపియన్ షిప్ పోటీల నిర్వహణకు సహాకరించిన వారికి ధన్యవాదాలు తెలిపారు.


**దేశ పేరు ప్రతిష్ఠల కొరకు పోటీ పడాలి:**

ముఖ్యఅతిధి దేవనాధన్ యాదవ్ మాట్లాడుతూ తాను పలు క్రీడల పోటీలకు సంబంధించి అధ్యయనం చేసానరి అయితే తల్లిదండ్రులు, క్రీడాకారులు చదువులతో పాటు ఉద్యోగవకాశాల కోసం మాత్రమే కృషి చేస్తున్నారన్నారు. క్రీడాకారుల్లో రాష్ట్ర జాతీయ స్థాయి ఖ్యాతి కోసం పాటు పడాలని పిలుపు నిచ్చారు. ఉద్యోగాల కోసం పోటీలకు స్వస్తి చెప్పాలని పిలుపు నిచ్చారు.అయితే ఇక్కడ పోటీలను తిలకించానని క్రీడాకారుల్లో గెలవాలనే కసి ఉందన్నారు.అయితే గెలుపు ఓటములు తాత్కాలికమన్నారు. నేడు ఓడిన వారు రేపు గెలవవచ్చునన్నారు.

**అద్భుతమైన స్టేడియం నిర్మిస్తాం:**

బాల్‌బ్యాడ్మింటన్ పోటీల నిర్వహణకు సంబందించి శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి మాట్లాడుతూ క్రీడలకు నిలయమైన శ్రీకాళహస్తి మంచి క్రీడా నిలయమని, దివ్యక్షేత్రమని, పుణ్యక్షేత్రమని ఇక్కడ అద్భుతమైన స్టేడియం నిర్మించుటకు ప్రభుత్వం నుంచి నిదులు సాధిస్తామన్నారు. ఇప్పటికే శాప్‌ను ఇక్కడస్టేడియం ఏర్పాటుకు ప్రతిపాదించామన్నారు. టెన్నిస్ పోటీలు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ఇక్కడనుంచి ప్రారంభమయ్యా యన్నారు. అలాంటి ఖ్యాతి గాంచిందన్నారు. ఇక్కడి పోటీల్లో అంతర్జాతీయ స్థాయి క్రీడా కారులు పాల్గొనటం విశేషం అన్నారు. శ్రీకాళహస్తికి ఇంటర్‌డిస్ట్రిక్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీల నిర్వహణకు రాష్ట్ర అసోసియేషన్ అవకాఃశం కల్పించటం అభినందనీయం అన్నారు. ఇక ఇక్కడ పోటీలు నిర్వహించటం క్రీడాకారులకు ఆరోగ్యంతో పాటు ఆధ్మాత్మిక చింతన అలవడుతుందని వివరించారు. పోటీలు అన్నది ప్రతిభకు గీటు రాయి అన్నారు. నేడు గెలిచినంత మాత్రాన శాశ్వతం కాదని ఓడిన వారు వెనుకబడదరని గుర్తించుకోవాలన్నారు. గెలుపు ఓటములు దైవాదీనాలన్నారు. మనం ఇతర రాష్ట్రాల మీద గెలవాలనే దృక్పథం ఉండాలని ఎంఎల్‌ఏ సూచించారు. శ్రీకాళహస్తీ శ్వరాలయానికి మంచి ఛైర్మెన్‌ను నియ మించాము.

మన రాష్ట్రంలోనే కాకుండా పొరుగున ఉన్న తమిళనాడు, కర్నా టకల్లో కూడా మంచి పేరు సంపాదించారన్నారు. శ్రీకాళహస్తిలో టెన్నిస్‌పోటీల నిర్వహణకు ప్రయత్నిస్తున్నామని వివరించారు.ఈ పోటీలకు గోపి,చంద్ర, చెంచు రత్నం, రవి,పురుషోత్తం, టీసు,నరేష్, పిఇటిలు కిషోర్, కుమార్, చెంగల్ రాయులు, వెంకటముని తదితరులు సహక రించారు.



# జంగారెడ్డిగూడెం రెవెన్యూ డివిజన్ వీఆర్వోల సంఘ అధ్యక్షుడిగా రాంబాబు

**జంగారెడ్డిగూడెం-ప్రభాతవార్త:** రాష్ట్రంలో వీఆర్వోల కారుణ్య నియామకాలకు జీవో 658 ఇవ్వడం పట్ల సీఎం జగన్మోహన్‌రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావులకు రాష్ట్ర రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు కృతజ్ఞతలు తెలిపారు. జంగారెడ్డిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో వీఆర్వోల సంఘం డివిజన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డివిజన్ స్థాయి సంఘ ఎన్నిక నిర్వహించారు. జంగారెడ్డిగూడెం డివిజన్ అధ్యక్షుడిగా అడపా రాంబాబు (కొయ్యలగూడెం), కార్యదర్శిగా ఎస్‌కె.బాజ్జీ (జంగారెడ్డిగూడెం), ఉపాధ్యక్షుడిగా ప్రవల్లిక (కామవరపుకోట) జి.పుల్లారావు (టి.నర్సాపురం), కోశాధికారిగా మడకం సురేష్ (బుట్టాయగూడెం), సంయుక్త కార్యదర్శిగా జి.జెన్నిఫర్ (పోలవరం), కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రాంబాబు, అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా ఏలూరు డివిజన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వరరావు వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి మిరియాల నారాయణ, నర్సాపురం డివిజన్ అధ్యక్షుడు సత్తిబాబు, ఏలూరు జిల్లా నాయకులు రవి, అజయ్, మాజీ డివిజన్ అధ్యక్షుడు ఎస్‌వి.సుబ్బారావు, జంగారెడ్డిగూడెం మండల అధ్యక్షుడు గెల్లా బాబూరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రరాజు అభినందిస్తూ వీఆర్వోలు తీవ్రమైన పని ఒత్తిడితో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించడానికి కృషి చేస్తానని, లేకుంటే రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు పిలుపునిస్తామని తెలిపారు. గ్రేడ్-2 వీఆర్వోలకు రెండేళ్ళు పూర్తి కావడంతో షరతులతో సంబధం లేకుండా వెంటనే ప్రొహిబిషన్ డిక్లేర్ చేసి, పే-స్కేలు ఇప్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశానికి డివిజన్‌లోని 10 మండలాలకు చెందిన వీఆర్వోలు పాల్గొన్నారు. జిల్లాల పునర్విభజన జరిగిన తర్వాత ఏలూరు జిల్లాలోని జంగారెడ్డిగూడెం డివిజన్‌కు ఎన్నికలు జరగడం ఇదే ప్రథమం. డివిజన్ అధ్యక్షుడు అడపా రాంబాబు, కార్యదర్శి బాజ్జీ, కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

# భార్యా దాసుడు కాదు.. భుజాలపై ఎక్కించుకుని అలిపిరి మెట్లపై

**తిరుమల,అక్టోబర్ 2ప్రభాతవార్తప్రతినిధి:** సహజంగా భక్తులు తమ మొక్కుల్లో భాగంగా కాలినడకన తిరుమల మెట్లెక్కి రావడం జరుగుతుంది. అయితే ఏకంగా ఓ వ్యక్తి తన భార్యను భుజాలపై మోసుకుని మెట్లదారిలో కొంతదూరం నడవడం విశేషం. ఆదివారం మధ్యాహ్నం ఈ ఆశ్చర్యకర సంఘటన చోటుచేసుకుంది. తూర్పుగోదావరిజిల్లా కడియం కడియపులంకకుచెందిన లారీ ట్రాన్స్‌పోర్టు యజమాని వీరవెంకటసత్యనారాయణ (సత్తిబాబు),తన భార్య లావణ్యను భుజాలపై ఎక్కించుకుని 70మెట్లు ఎక్కాడు.అయితే ఇదేదో మొక్కుబడి కాదు, సరదాగా తన భార్యకంటే వేగంగా మెట్లెక్కడంతో మాట కోసం ఇలా చేశాడు. తోటి నడకదారి భక్తులను ఆశ్చర్యపరిచాడు. వీరికి 24ఏళ్ళ క్రిందట వివాహమైంది. ఇద్దరు కుమార్తెలకు వివాహం చేసిపంపారు. వెంకన్న దర్శనానికి వస్తూ సరదా సవాల్‌తో ఇలా భుజాలపై ఎక్కించుకుని కొంతదూరం నడవడటం ప్రత్యేకతగా మారింది.

# ప్రజాస్వామ్యంలో శత్రువులు ఉండరు

## మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు ఘన స్వాగతం పలుకుతున్న బీజేపీ శ్రేణులు

**రేణిగుంట, అక్టోబరు 2 ప్రభాతవార్త:** ప్రజాస్వామ్యంలో ప్రత్యర్థులు ఉంటారే తప్ప శత్రువులు ఉండరని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. ఉప రాష్ట్రపతిగా పదవీ బాధ్యతలు పూర్తి చేసుకుని సొంత ఊరు వెళుతూ ఆదివారం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఆయనకు విమానాశ్రయంలో ఆయన అభిమానులు బీజేపీ నేతలు కార్యకర్తలు అపూర్వ స్వాగతం పలికారు. ఆయనపై పుష్పవర్షం కురిపించారు. అభిమానుల అభిమానానికి పరవశించిపోయిన వెంకయ్యనాయుడు వారికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం విమానాశ్రయం పోర్టికోలో విలేకరులతో మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను సంతృప్తికరంగా నిర్వర్తించామన్నారు. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం అన్నారు. ప్రతి ఒక్కరు క్రమశిక్షణ అంకితభావంతో పని చేస్తే ప్రజాస్వామ్యం విజయవంతమవుతుందన్నారు. తన 40 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ అనుభవంలో ఎన్నికైన ప్రజాప్రతినిధులు హుందాతనంగా, క్రమశిక్షణతో క్రమశిక్షణతో ప్రవర్తించి ప్రజా సమస్యల పట్లస్పందిస్తూ అర్థవంతమైన చర్చలు జరిపినప్పుడు ప్రజాస్వామ్యం మరింత గొప్పగా ఉంటుందన్నారు. ప్రభుత్వం తప్పు చేసేప్పుడు ప్రశ్నించవచ్చని, నిరసన తెలియ చేయవచ్చని అయితే అవి ప్రజాస్వామ్య బద్ధంగా ఉండాలన్నారు. రాజకీయ పార్టీలు తమ పార్టీ కార్యకరర్తలు క్రమశిక్షణతో ఉండేలా చూసుకోవాల్సి న బాధ్యత ఉందన్నారు. రాజకీయాల్లో నిజాయితీగా ఉండడం కోసం అందరూ సిద్ధాంతాలకు అనుగుణంగా ఉండాలన్నారు. రాజకీయాల్లో రుజువర్తన, నైతిక ప్రవర్తన కట్టుబడి ఉండాలన్నారు. ఈ బాధ్యతలు పూర్తిగా రాజకీయ పార్టీలపై ఉందన్నారు. రాజకీయాల్లో విలువలు తగ్గకుండా నిజాయితీగా వ్యవహరించాలన్నారు. దీని వల్ల ప్రజాస్వామ్యం మరింత బలపడుతుందన్నారు. ప్రపంచంలో అతి పెద్ద పార్లమెంటరీ ప్రజాస్వామ్య దేశం భారతదేశం అన్నారు. నియామ నిబద్ధతలకు కట్టుబడి ఉండాలని ప్రతి ఒక్కరిని కోరుతున్నానన్నారు. గెలిచిన ప్రజాప్రతినిధులు హుందాగా ఉండాలని ఓడినవారు ఓర్పుతో ఉండాలన్నారు. ప్రజాప్రతినిధులు గెలిచిన ఓడిన వారు శత్రువులు కారని ప్రజాస్వామ్యంలో వారంతా ప్రత్యర్థులుగా అభివర్ణించారు. అనంతరం ఆయన భారీ కాన్వాయ్ తో నెల్లూరు బయలుదేరి వెళ్లారు. విమానాశ్రయంలో ఆయనకు స్వాగతం పలికిన వారిలో బీజేపీ రాష్ట్ర మంత్రి కాకని గోవర్ధన్‌రెడ్డి, కోస్తా జిల్లాల ప్రతినిధి కోలా ఆనంద్‌కుమార్, బీజేపీ రాష్ట్ర నాయకులు భానుప్రకాష్‌రెడ్డి, సామంచి శ్రీనివాస్, జిల్లా ఓబీసీ మోర్చా నాయకులు బీడీ బాలాజీ, పలువురు బీజేపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

# వైఎస్సార్సీ కేంద్ర కార్యాలయంలో మహాత్మాగాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రీ జయంతి

**సచివాలయం. అక్టోబర్ 2. ప్రభాతవార్త:** మహాత్మాగాంధి, మాజీ ప్రధాని లాల్ బహుదూర్ శాస్త్రీ జయంతి వేడుకలను తాడేపల్లిలోని వైఎస్ఆర్ కాం గ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం మహాత్మాగాంధి, మాజి ప్రధాని లాల్ బహుదూర్ శాస్త్రీ చి త్రపటాలకు పూలమాలలు వేసి పార్టీ నేతలు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ అహింసే ఆయుధంగా బ్రిటీష్ ప్రభుత్వాన్ని గడగడలాడించి, దేశానికి స్వాతంత్ర్యం సంపాందించిన మహానీయులు మహాత్మాగాంధి అన్నారు. జైజవాన్, జైకిసాన్ అనే నినాదంతో దేశ అభివృద్ధిలో లాల్ బహుదూర్ శాస్త్రీ ప్రముఖపాత్ర వహించారన్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యాన్ని తీసుకువచ్చే దిశగా గ్రామసచివాలయాలు ఏర్పాటు చేసి పరిపాలనను ప్రజలకు చేరువ చేసిన నాయకుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మహానీయులు సూచించిన బాటలో నడుస్తూ, భవిష్యత్తు తరాల అభివృద్ధి కోసం సీఎం జగన్ నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. మాజి మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యాన్ని తీసుకువచ్చిన నాయకుడు సీఎం జగన్ అన్నారు. ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ అహింసను ఆయుధంగా చేసుకుని లక్ష్యాన్ని చేరుకోవచ్చునని నిరూపించిన మహానీయుడు మహాత్మాగాంధి అన్నారు. దేశ రాజకీయాలలో నిబద్ధతతో పని చేసిన వ్యక్తి లాల్ బహుదూర్ శాస్త్రీ అన్నారు. ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ జాతిపిత మహాత్మాగాంధి ఆశయబాటలో అందరూ పయనించాలన్నారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ మహాత్మాగాంధి అహింసతో దేశ స్వాతం త్ర్యాన్ని సముపార్జించారన్నారు. దేశానికి ప్రధానమం త్రిగా మంచి పరిపాలన అందించిన నిబద్దత గల నేత లాల్ బహుదూర్‌శా స్త్రీ అన్నారు. ఈ కార్య క్రమంలో ఎమ్మె ల్సీ, పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీత, ఎమ్మెల్యే మద్దాళి గిరి, వ్యవసాయ మిషన్ రాష్ట్ర వైస్ ఛైర్మన్ ఎంవిఎస్ నాగిరెడ్డి, నవరత్నాల ప్రోగ్రామ్ వైస్ ఛైర్మన్ నారాయణమూర్తిలతో పాటు పలువురు పార్టీ నేతలు, తదితరులు పాల్గొన్నారు.

వార్త


నిలకడ లేని మనసున్నవారు ధర్మమార్గాన్ని అనుసరించలేరు.

-రోజర్

# జాప్యానికి ఉక్రెయిన్ మూల్యం!

ప్రపంచదేశాధినేతల్లో సామ్రాజ్యవాదం, విస్తరణ కాంక్ష మరింతగా పెరుగుతోంది. నిన్నమొన్నటివరకూ చైనాను మాత్రమే ఈ కోణం నుంచి చూసాం. సరిహద్దుల్లో కొద్ది కొద్దిగా ముందుకువస్తూ ఆప్రాంతాలను చివరకు తమవిగా ప్రకటించుకుంటూ చైనా అక్కడే తిష్టవేసి శాశ్వత స్థావరాలను నిర్మించుకుంటున్న సంగతి తెలిసిందే. ఇపుడు అదే కోవలోకి తన చిరకాల మిత్రదేశం రష్యా చేరుతోంది. ఒకప్పుడు యుఎస్ఎస్ఆర్‌గా వెలుగొందిన సోవియట్ రష్యాను మళ్లీ పాతపద్ధతిలోనే పునర్నిర్మించేందుకు రష్యా అధ్యక్షుడు పుతిన్ శ్రీకారం చుట్టినట్లు కనిపిస్తోంది. 2014లోనే ఇందుకు సంబంధించి క్రిమియాపై దాడిచేసి ఆ ప్రాంతాన్ని సోవియట్ భూభాగంగా ప్రకటించిన రష్యా ఈ ప్రాంతానికి నేరుగా వెళ్లేమార్గం కూడా ఏర్పాటు చేసుకున్నారు. అందుకు అనుగుణంగానే గడచిన ఏడునెలలుగా చిన్న దేశం అయిన ఉక్రెయిన్‌పై నిర్వహిస్తున్న దండయాత్రలో తన పరిధిలోకి వచ్చిన నాలుగు కీలక నగరాలను సోవియట్ భూభాగంలో చేరినట్లు ప్రకటించారు. అంతేకాకుండా ఎవరు ఈ భూభాగంపై దాడులు చేసినా రష్యా భూభాగంపైనే దండయాత్ర చేసినట్లు పరిగణిస్తామని, ప్రతిగా కఠిన ప్రతిఘటన ఉంటుందని కూడా హెచ్చరించడం చూస్తే పుతిన్‌లో కూడా సామ్రాజ్యవిస్తరణ కాంక్ష రగులుతోంది. పాత రష్యా కూటమి దేశాలను మళ్లీ చేర్చుకుని అమెరికాకు ధీటుగా అత్యంతశక్తివంతమైన ప్రపంచదేశంగా తీర్చిదిద్దుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకు ఉక్రెయిన్‌నుంచే ఆయన శ్రీకారం చుట్టినా నాటో సైనిక కూటమి నుంచి అందుతున్న అప్రతిహత సహకారంతో ఉక్రెయిన్ అలుపెరగని పోరాటం చేస్తోంది. నాటోలో తమకు ఇప్పటికైనా నేరుగా సభ్యత్వం ఇవ్వాలని అప్పుడే రష్యా చర్యలను కట్టడి చేయగలుగుతామని ఉక్రెయిన్ దేశ అధ్యక్షుడు వోలోదిమిర్ జెలన్‌స్కీ మరోసారి నాటో కూటమికి ప్రతిపాదనలు చేసారు. జాప్యం జరిగేకొద్దీ ఉక్రెయిన్ భారీ మూల్యం చెల్లించే స్థితికి చేరుతుందని, అయినా ప్రాణాలకు సైతం తెగించి పోరాడి తమ భూభాగాన్ని రక్షించుకుంటామని ఆయన ప్రకటించారు. ఇవేమీ పట్టించుకోని పుతిన్‌మాత్రం నాలుగు ప్రధాన నగరాలు డోనెట్స్క్, లుహాన్స్క్, ఝపోరిఝిఝియా, ఖెర్సన్ ప్రాంతాలను తమ దేశంలో విలీనం చేసుకున్నారు. యూరోపియన్ కూటమిలోని 27 దేశాలు ఈ ఏకపక్ష దండయాత్రను నిష్కర్షగా ఖండించాయి. ఏడు దేశాల కూటమి జి7లోని బ్రిటన్, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, అమెరికా దేశాలు, యూరోపియన్ కూటమి ఉన్నతస్థాయి ప్రతినిధి కూడా ఈ దండయాత్రను, స్వాధీనాన్ని నిర్ద్వందంగా ఖండించాయి. అయినా కూడా పుతిన్ వెనక్కి తగ్గలేదు. తన ఏకపక్ష నిర్ణయంతోనే ఈ ప్రాంతాలపై సైనిక చర్యకు దిగితే రష్యా రక్షణ చర్యలు చేపడుతుందని స్పష్టంచేయడం చూస్తే ఉక్రెయిన్ మొత్తాన్ని ఆయన బలవంతంగా అదుపులోకి తెచ్చుకునే లక్ష్యంతో ఉన్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా ఇప్పటికైనా ఉక్రెయిన్ యుద్ధం మాని తమతో సంప్రదింపులకు రావాలని, లేనిపక్షంలో భారీ మూల్యం చెల్లించుకుంటుందని హెచ్చరికలు కూడా చేసారు. ఈ ఏకపక్ష నిర్ణయాలకు ప్రతిగా యూరోపియన్ కూటమి రష్యా నుంచి ఎగుమతులపై ఆంక్షలు ప్రకటించింది. ఏడు వందల కోట్ల డాలర్ల విలువైన ఎగుమతులను నిలిపివేస్తున్నట్లు ప్రకటించడంతోపాటు రష్యా చమురుపై ధరలపరిమితులు విధించింది. ఇప్పటికే అమెరికా రష్యాపై అనేక ఆంక్షలు ప్రకటించింది. రష్యా నుంచి ఆయుధ కొనుగోళ్లు చేయవద్దని కూడా ఇతర ప్రపంచదేశాలకు పిలుపునిచ్చింది. అసలు పుతిన్ ముందున్న లక్ష్యం ఏమిటి? ఉక్రెయిన్‌ను స్వాధీనం చేసుకోవడం ద్వారా ప్రపంచదేశాలకు ఇచ్చే సంకేతాలేమిటి? ఉక్రెయిన్‌ను పూర్తిగా వశపరుచుకునే ప్రక్రియను నాటో కూటమి ప్రతిఘటిస్తుందా? నాటో విస్తరణ లక్ష్యం ఎంత వరకూ వచ్చింది. నాటో సభ్యత్వం ఉక్రెయిన్‌కు ఇవ్వడంలో నాటో ఎందుకు తాత్సారం చేస్తోంది? ఇవన్నీ జవాబులేని ప్రశ్నలుగానే మిగిలిపోతున్నాయి. ఇపుడు నాటో చేస్తున్న జాప్యానికి ఉక్రెయిన్ మూల్యం చెల్లించుకుంటోంది. నాటో దేశాల్లో సభ్యత్వం ఇవ్వకూడదన్న ఆంక్షలతోనే పుతిన్ ఉక్రెయిన్‌పై దండయాత్రకు పూనుకున్నారు. ఇప్పటికి రెండుసార్లు దరఖాస్తు చేసుకున్నా ఉక్రెయిన్ నాటోలో చేరలేకపోయింది. పరోక్షంగా మద్దతును మాత్రమే పొందగలుగుతోంది. ఇప్పటికే యుద్ధం కారణంగా 2 లక్షల కోట్ల డాలర్లవరకూ ఉక్రెయిన్ ఆర్థిక వ్యవస్థ నష్టపోయిందని నిపుణులు తేల్చారు. ఉక్రెయిన్‌పై మరింత ప్రతీకార చర్యలకోసం రష్యా మిలిటరీ ప్రత్యేక టార్చర్ కేంద్రాలను కూడా ఏర్పాటు చేసాయి. వివిధ పద్ధతుల్లో యుద్ధనేరస్తులను భౌతికంగా నిర్వీర్యంచేసే ప్రక్రియను చేపట్టి ఆదేశ ప్రజలను మరింత భయపెట్టే చర్యలకు పాల్పడుతోంది. ఈ సంఘటనల నేపథ్యంలోనే ఇపుడు రష్యా భూభాగంలోకి చేరిన క్రిమియాకు నేరుగా వెళ్లేందుకు వీలుగా అక్కడ సరిహద్దుల్లో ఉన్న ప్రధాన నాలుగు నగరాలను తమ భూభాగంలో కలిపేసుకుంది. ఈ ప్రాంతాలు మళ్లీ ఉక్రెయిన్ అదుపులోకి రావాలంటే ఉక్రెయిన్ తన యుద్ధతంత్రాన్ని మరింత విస్తరించక తప్పదు. తద్వారా ఇప్పటికే స్మశానంగా మారిన ఆ దేశంలో మరింతగా రక్తపుటేరులు ప్రవహించక తప్పదు. ప్రపంచ శాంతి, సామరస్య వాతావరణం పెంపొందించాలని పాటుపడే అగ్రరాజ్యాలు తమ రక్షణరంగ వాణిజ్యాన్ని పక్కనపెట్టి ఉక్రెయిన్‌పై రష్యా సైనిక చర్యను ప్రత్యక్షంగా ఎదుర్కొంటే తప్ప ఈ సమస్యకు పరిష్కారం లభించదని చెప్పవచ్చు. ఈలోపు రష్యా మరిన్ని ప్రాంతాలను తమలో కలిపేసుకున్నా ఆశ్చర్యపోనవసరంలేదు.

> పదుగురు తలవంచే చోట మనమూ తలవంచటం వినయ లక్షణం.



పుల్లర్

> ప్రతి ఒక్కరికీ తనని గురించి బహుకొద్దిగా మాత్రమే తెలుస్తుంది. మనిషికి తనని తాను తెలుసుకోవడం చాలాకష్టమైన పని.



సిసిరో

## ప్రజావాక్కు



### గో సంరక్షణ చట్టం తీసుకురావాలి

గో సంరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం గుడికో గోమాత కార్యక్రమాన్ని ప్రారంభించడం ముదావహం. రాష్ట్రంలోని మఠాలు, వంశపారపర్యపర్యవేక్షణ ఆలయాలు, లేదా పాఠశాలలకుతితిది, రాష్ట్రప్రభుత్వం సంయుక్తంగా సదరు కార్యక్రమం ద్వారా దేశవాళీ ఆవుదూడలను ఉచితంగా అందించే సదరు బృహత్తర కార్యక్రమం గోవులసంతతి అభివృద్ధికి నిస్సందేహంగా తోడ్పడుతుంది. హైందవ ధర్మంలో ఆవుకు తల్లిస్థానం ఇచ్చారు. గోసంతతి సుభిక్షంగా ఉన్నప్రాంతాలలో అష్టఐశ్వర్యాలు అభివృద్ధిచెంది ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉంటారు. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మండలంలో గోసంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలి. ముసలి, అనారోగ్యంతో ఉన్న ఆవులకు ప్రత్యేక వైద్యసదుపాయం అందించాలి. కళేబరాలకు గోవులను తరలించడాన్ని నిషేధిస్తూ గోసంరక్షణ చట్టం తీసుకురావాలి.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ప్రభుత్వ ప్రతిష్టకు భంగం కాదా?

ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగులను, ఉపాధ్యాయులను జైళ్లలో పెడుతున్నారంటూ తెలంగాణా రాష్ట్రమంత్రి హరీష్‌రావు వ్యాఖ్యానించగా, అలాంటిదేమి లేదని మన విద్యాశాఖమంత్రి సెలవిచ్చారు. అయితే గతంలోకూడా తెలంగాణ మంత్రులు ఆంధ్రాలో కరెంటు లేదని, రోడ్ల పరిస్థితి దయనీయంగా ఉంది. రాజధానే లేదంటూ పలు వ్యంగ్య వ్యాఖ్యానాలు చేశారు. వాటిలో నిజం లేకపోలేదు. ఇలాఎవరైనా సామాన్యులు సోషల్ మీడియాలో పోస్టులుపెడితే వారిపై పోలీసు కేసులు పెట్టి చిత్రహింసలకు గురి చేయడం చూస్తున్నాం. మరి అవే చట్టాలు పక్క రాష్ట్రాల మంత్రులు చేస్తే వర్తించవా? ఇదెక్కడి ద్వంద్వ నీతి?

-జి.రామకృష్ణ, ముస్తాబాద, కృష్ణాజిల్లా

### కాంగ్రెస్ అవినీతి ఎక్కడ!

కాంగ్రెస్ పార్టీ నాయకులు అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని అధికారాన్ని అడ్డుపెట్టుకుని కోట్లరూపాయలు సంపాదించుకున్నారనిబిజెపినాయకులు అదేపనిగా విమర్శిస్తుంటారు. ప్రజల మనసులలో ఈ మాటలు నాటుకుపోయేలా చేస్తుంటారు. అధికారం కోసంప్రజలను మాయచేస్తుంటారు. ఇన్ని చేస్తున్నవారు కాంగ్రెస్ హయాంలో అవినీతికి పాల్పడినది ఎంత మంది? వారుఎవరు? ఎమ్‌పిలా, ఎమ్మెల్యేలా, మంత్రులా, అనేది తెలుసుకోలేకపోతున్నారు. అవినీతిఎక్కడ జరిగింది? ఎలా జరిగింది? ఎప్పుడు జరిగింది అనేదికూడా తెలుసుకోలేకపోతున్నారు. కాంగ్రెస్‌పట్ల ప్రజలలోఉన్న అనుమానాలను తీర్చలేకపోతున్నారు.

-బి.పెంటయ్య, హైదరాబాద్

### మహిళా హక్కుల్ని గౌరవించే సుప్రీం తీర్పు

వైవాహిక స్థితితో సంబంధంలేకుండా మహిళ చట్టబద్ధంగా అబార్షన్‌పై నిర్ణయం తీసుకోవచ్చంటూ సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుఅభినందనీయం. ఇంతవరకూ 20నుంచి 24 వారాల గర్భాన్ని విచ్ఛిత్తి చేసుకునే హక్కు అవివాహితులకు లేదు. ఒక్క వివాహితులకు, ఆరోగ్యపరమైన అవసరాలు ఉన్నవారికే పరిమితమైన హక్కు అని అందరికీ కల్పించడం ద్వారా మహిళకున్న నిర్ణయాధికారాన్ని సుప్రీంసమర్థించింది. చట్టపరమైన అడ్డంకుల్ని తొలగించింది. తద్వారా తన శరీరంపై, గర్భధారణ పట్ల తన స్వీయాధికారంపైమహిళ నిర్ణయం తీసుకోవచ్చు. దేశంలో జరిగే అబార్షన్లలో సగభాగందొంగచాటుగా, సరైన వైద్యనిపుణుల పర్యవేక్షణ లేకుండా జరుగుతున్నాయి. చట్టం ఒప్పుకోని సమయం లోవక్రమార్గంలో జరుగుతున్న వీటివల్ల తల్లిప్రాణాలకు ముప్పు ఎక్కువ కావడమే కాకుండా అవమానభారం, ఆర్థికభారం వారిపై పడుతుంది. ఇప్పుడీ తీర్పు ద్వారా అలాంటి సంఘటనలు కూడా తగ్గుతాయి. గర్భవిచ్ఛిత్తికై నిర్ణయించుకున్న వంచితులైన మైనర్ బాలికల పేర్లు, అవివాహితల పేర్లు బహిరంగపరిచే అవసరం వైద్యులకు లేనందున వారి వివరాలు గోప్యంగా ఉండివారి హక్కు పరిరక్షించబడుతుంది.

-డా.డి.వి.జి.శంకరరావు, పార్వతీపురం

### ఒక్కసారి ఆలోచించండి

తమ కోరికలు తీర్చినందుకు దేవుడికి మొక్కులు పేరిట ధనాన్ని హుండీలో వేస్తున్న వారు, అలా చేస్తే నిజంగా దేవుడు సంతోషిస్తాడా అని ఒక్కసారి ఆలోచించాలి. ఆ డబ్బులతో పేదవారికి అన్నంపెట్టి వారి కడుపు నింపితే అప్పుడు నిజంగా దేవుడు సంతోషిస్తాడు అని తెలుసుకోవాలి. అంతేకాదు దేవుడికి ఏ కానుకలు అవసరం లేదని ఆ ధనంతో ఏ జీవి ఆకలి తీర్చినా ఆ భగవంతుడు మిక్కిలి ఆనందించి వారిపై తన చల్లనిచూపు ప్రసరింపచేస్తాడు అని గ్రహించగలగాలి.

-నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### వైఫల్యాల బాటలో సంక్షేమ పథకాలు

పేదలకు లబ్ధి చేకూర్చే సంక్షేమ పథకాలు అనేకం వైఫల్యాల బాటలో ఉన్నాయి. ముఖ్యంగా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేద ప్రజలకు ఒకవ్యక్తికి నెలకుఆరుకిలోల చొప్పున దొడ్డు బియ్యం ఉచితంగా సరఫరా చేస్తున్నారు. రకరకాల కారణాలతో వీటిని నల్ల బజారులో కిలోకు పదినుండి ఇరవై రూపాయల వరకు విక్రయిస్తూ వారికినచ్చిన ఖరీదైన బియ్యంకొనుగోలు చేసి వినియోగించుకుంటున్నారు. అలాంటి పక్షంలో ప్రభుత్వం ఉచిత బియ్యం సరఫరా చేసి ప్రయోజనం ఏమిటి?

-జి.అశోక్, గోదూర్, జగిత్యాలజిల్లా

ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail : editpage@vaartha.com

# ఆహార భద్రతకు భరోసా ఏది?

**ఆహార ధాన్యాల ఉత్పత్తి చేసే వ్యవసాయరంగానికి తక్కువ నిధులు మంజూరు చేస్తూ, కమర్షియల్ లాభసాటి వ్యాపారానికి ఎక్కువనిధులు మంజూరు ఎంతవరకు సమంజసమో ఆలోచన చేయాలి. ఆహార భద్రతా చట్టం అందరికీ ఆహారం అందించడమేకాదు. అన్ని విష యాల్లో భాగస్వామ్యం అని గ్రహించాలి. ముఖ్యంగా భవిష్యత్‌లో భారత్‌లో ఆహార కొరత నివారించడానికి ప్రజలందరూ, ప్రభుత్వా లు పటిష్ట ప్రణాళికలు రూపొందించుకుని యుద్ధప్రాతిపదికన కదలాలి. ముఖ్యంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయరంగాన్ని అభివృద్ధివరచడానికి బడ్జెట్లో నిధులు మంజూరు చేయాలి. రైతు లకు అండగా నిలవాలి. రైతులే దేశానికి విధాతలు అని తెలియ చేయాలి. భారతదేశాన్ని అన్నపూర్ణగా తీర్చిదిద్దాలి.**

ఐ.పి.రావు

కరోనాతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కుదేలవటంతోపాటు ఆహార ద్రవ్యోల్బణాన్ని కూడా సృష్టించింది. దీనికితోడు ప్రస్తుతం కొనసాగుతున్న రష్యా, ఉక్రెయిన్ యుద్ధం పుండుమీద కారం చల్లినట్లు వ్యవసాయరంగాన్ని అతలాకుతలం చేసింది. ఆహార ధాన్యాల ఉత్పత్తి, మార్కెట్, సరఫరా గొలుసును గందరగోళంతో ముంచెత్తింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఆహార సమస్యలు పెరుగుతున్నాయి. అందరికీ ఆహారం అందని ద్రాక్షవలే ఉండబోతోంది. మానవుని మనుగడనే ప్రశ్నార్థకం చేయనుంది. చాలా అప్రమత్తంగా ఉంటూ, చాకచక్యంగా ఈ సమస్యల నుండి ఈ సమాజం బయటపడాలి. భవిష్యత్తు తరాలకు ఆహార నిల్వలు సమకూర్చాలి ఇదే ప్రపంచదేశాలకు, దేశాధినేతల భుజస్కంధాలపై ఉన్న తక్షణ కర్తవ్యం. ప్రస్తుతం 93శాతం పేద మధ్యతరగతి దేశాలు, 89 శాతం మధ్య ఉన్నతివర్గ దేశాలు ఆహార అభద్రతను ఎదుర్కొంటున్నారని పలు నివేదికలు చెబుతున్నాయి. ఈ 2022 ఏప్రిల్-జూన్ నెలల మధ్యకాలంలో ఐదు శాతం ఆహార ద్రవ్యోల్బణం చవి చూసాం. 2022 ఆగస్టు ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం సుమారు 23 దేశాలు ఆహార ధాన్యాల ఎగుమతులపై నిషేధం విధించారు. మరో ఏడు దేశాలవారు ఆహార ధాన్యాల ఎగుమతులపై ఆంక్షలు, నిబంధనలు విధించారు. వరల్డ్ ఫుడ్ ప్రోగ్రాం (డబ్ల్యూ.ఎఫ్.పి) నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 345 మిలియన్ల జనాభా 82 దేశాల్లో ఆహార లేమితో బాధపడుతున్నారు అని తెలిపారు. ఇది మరింత ముదిరి ఈ సంవత్సరం సెప్టెంబర్ నాటికి మరో 20 దేశాలు మరింతగా ఆహార సంక్షోభంలోకి నెట్టవేయబడతాయి అని తెలిపారు. నగరీకరణ పట్టణీకరణ పేరులో గ్రామాల్లో ప్రజలు అందరూ పట్టణాలకు వలస వెళ్లడం, వాతావరణ మార్పులు, వ్యవసాయరంగాన్ని సంక్షోభంలో పడేశాయి. అభివృద్ధి చెందుతున్న, అధిక జనాభా కలిగిన మనలాంటి దేశానికి ఈ ఆహార భద్రత విషయంలో భవిష్యత్తులో తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇప్పటికే 'ఫుడ్ అండ్ అగ్రికల్చర్' సంస్థ నివేదిక ప్రకారం భారతదేశంలో సుమారు 189 మిలియన్ల జనాభా పోషకాహారం లోపంతో బాధపడుతున్నారు అని తెలిపింది. ఇదే అభిప్రాయాన్ని ఇటీవల మన నేషనల్‌కుటుంబ ఆరోగ్య సర్వే కూడా పలు విషయాలు బహిర్గతం చేసింది. ప్రపంచంలోనే అతి ఎక్కువ మంది మనదేశంలోనే పోషకాహారం లోపంతో బాధపడుతున్నారు అని తెలిపింది. ఉత్పత్తి సరఫరా ప్రకారం నేటికీ మనదేశం వ్యవసాయరంగంలో అగ్రస్థానంలో ఉంది. అయినా 60 శాతం వంటనూనెలు, 35 శాతం పప్పుదినుసులు దిగుమతి చేసుకుంటున్నాం. ఇదే విచిత్రం. మిగులు ఉత్పత్తి లేకుండా దేశం అభివృద్ధి సాధించలేదు. ఆహార భద్రతకు భరోసా ఇవ్వలేదు అని పాలకులు గ్రహించాలి. అనగా ఎగుమతులు పెరిగి దిగుమతులు తగ్గాలి. భారత్‌లో సేద్యం చేయడం ఖరీదుగా మారింది. సన్నచిన్నకారు రైతులు ఆర్థికంగా చితికిపోవడం, పెట్టుబడులు పెరిగిపోవడం, వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు ఉప



యోగించలేకపోవడం, భూసారం తగ్గటం వలన వ్యవసాయం భారంగా మారింది. పంట దిగుబడి తక్కువగా ఉండుట గమనార్హం. 1991-2011 మధ్యకాలంలో సుమారు 14 మిలియన్ల మంది వ్యవసాయరంగాన్ని విడిచిపెట్టడం జరిగింది. కొందరు తమ భూములను కౌలు రైతులకు ఇవ్వడం జరిగింది. దీనికి కారణం ఆర్థిక ఇబ్బందులు, వలస కార్మికుల సమస్యలు. భవిష్యత్తులో ఆహార ధాన్యాల కొరత మనదేశానికి పెను సవాలుగా పరిణమిస్తున్నాయి. రాబోయే కాలంలో ఇండియా జనాభా 150 కోట్లు, 200 కోట్లు పెరిగే పరిస్థితుల్లో అందరికీ మూడు పూటలా ఆహార ధాన్యాలు సమకూర్చడం నిజంగా పెద్ద సవాల్. ఇకనుంచైనా ప్రభుత్వాలు వ్యవసాయరంగాన్ని బలోపేతం చేయడానికి పలు నిర్ణయాలు తీసుకోవాలి. కొవిడ్ నియంత్రణకు ఎంత శ్రమపడ్డారో అంతకంటే ఎక్కువగా ఆహార భద్రత అందరికీ కల్పించుటలో ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలి. అప్పుడే భారత్ 'అన్నపూర్ణ' అనే పేరు సార్థకం చేసుకుంటుంది. అమెరికా తరువాత ఇండియాకు 1.56 మిలియన్ల స్క్వేర్ కిలోమీటర్ల సాగు విస్తీర్ణం ఉంది. అయితే వసతులు కొరత వెంటాడుతూనే ఉంది. ముందుగా కనీస మద్దతు ధర ఇవ్వడం ద్వారానే వ్యవసాయం పరిపూర్ణ అభివృద్ధి సాధించదు అని గ్రహించాలి. నేటికీ 70 శాతం జనాభా వ్యవసాయరంగంలో ఉపాధి పొందేవారు ఉండగా వీరిలో 82 శాతం మంది సన్నచిన్నకారు రైతులు. వ్యవసాయం లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వాలు ముందుకు రావాలి. ఆర్థిక సహకారం రైతులకు ఇవ్వాలి. సబ్సిడీలు రాయితీలు ప్రోత్సాహకాలు ఇవ్వడం సమంజసం. నకిలీల బెడదలు తొలగించాలి. విత్తనాలు, ఎరువులు, విద్యుత్, వ్యవసాయ పనిముట్లు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తేవాలి. సకాలంలో అందరికీ అందివ్వాలి. పంటమార్పిడి విధానం ప్రోత్సహించాలి. భూసార పరీక్షలు నిర్వహించాలి. ఖరీఫ్‌తో సమానంగా రబీలోనూ సమానంగా పంటలు పండించే విధంగా లక్ష్యం నిర్దేశించాలి. రబీ కాలంలో నాలుగోవంతు భూమినే సాగు చేయుట గమనార్హం. వ్యవసాయంపైపెట్టే ఖర్చులు కూడా 2010-11లో 11 శాతం ఉండగా 2019-20 నాటికి 9.5శాతం తగ్గింది. ఇదే అమెరికాలో అయితే 33శాతం, ఇటలీలో 43శాతం ఉంది. ఆదాయం పెరుగుదలకు, అప్పులు ఇవ్వడానికి ప్రభుత్వాలు ముందుకు వస్తున్నాయి. కానీ ప్రొడక్షన్ విషయంలో డబ్బులు ఖర్చు చేయడం లేదు. అదే మత్స్యరంగం అభివృద్ధికి 73 శాతం, యానిమల్ అజబెండరికి 26 శాతం ఎక్కువగా నిధులు మంజూరు చేశారు. అనగా ఆహార ధాన్యాల ఉత్పత్తి చేసే వ్యవసాయరంగానికి తక్కువ నిధులు మంజూరు చేస్తూ, కమర్షియల్ లాభసాటి వ్యాపారానికి ఎక్కువనిధులు మంజూరు ఎంతవరకు సమంజసమో ఆలోచన చేయాలి. ఆహార భద్రతా చట్టం అందరికీ ఆహారం అందించడమేకాదు. అన్ని విషయాల్లో భాగస్వామ్యం అని గ్రహించాలి. ముఖ్యంగా భవిష్యత్‌లో భారత్‌లో ఆహార కొరత నివారించడానికి ప్రజలందరూ, ప్రభుత్వాలు పటిష్ట ప్రణాళికలు రూపొందించుకుని యుద్ధప్రాతిపదికన కదలాలి. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయరంగాన్ని అభివృద్ధిపరచడానికి బడ్జెట్లో నిధులు మంజూరు చేయాలి. రైతులకు అండగా నిలవాలి. రైతులే దేశానికి విధాతలు అని తెలియ చేయాలి. భారతదేశాన్ని అన్నపూర్ణగా తీర్చిదిద్దాలి. ●

# పొంచి ఉన్న ఆర్థిక మాంద్యం

మేకిరి దామోదర్

భారతదేశం అభివృద్ధి చెందుతున్న దేశాల జాబితాలో ఉండేది. కానీ నేడు ద్రవ్యోల్బణం పెరిగి రూపాయి మారక విలువ డాలర్‌తో పోల్చితే గణనీయంగా పతనమవుతుంది. సుమారుమూడు దశాబ్దాల కాలం నాడు ఒక డాలర్ రూ. 21 పలికేది. 2014 ఎన్డీయే ప్రభుత్వం కేంద్రంలో అధికారం చేపట్టిన నాటికి అది కాస్త 63 రూపాయలకు చేరింది. నేడు ఒక్కో డాలర్ 81 రూపాయల స్థాయి తాకుతుండడం గగ్గోలు పుట్టిస్తుంది. ఇలా రూపాయి విలువ ఇదివరకు ఎప్పుడూ లేని స్థాయికి క్షీణించింది. దీనితో దేశీయంగా స్టాక్ మార్కెట్లో భారీ పతనం, ఎఫ్ఐఐలు తరలిపోవడం, విదేశీ మారకం విలువల్లో తగ్గుదల, వాణిజ్యలోటు పెరుగుదల మొదలగు పరిణామాలు రూపాయి విలువను పతనానికి దారితీస్తున్నాయి. ఇది రూపాయి చరిత్రలోనే ఆల్‌టైం కనిష్టం కావడం గమనార్హం. ఇలానే పాలకులు ఉదాసీనంగా వ్యవహరిస్తే మహామాంద్యానికి చేరువ అవుతున్నామా అనిపిస్తుంది. భారత ప్రభుత్వం తీసుకున్న కొన్ని నిర్ణయాలతో మందగమనం ప్రారంభమైంది. పెద్ద నోట్ల రద్దు, జిఎస్టీ అమలు వంటి చర్యలు ఆర్థికరంగం జోరుకు కళ్లెం వేశాయి. అదే సమయంలో కరోనా విజృంభించి దేశ ఆర్థికాన్ని పాతాళానికి నెట్టింది. ఆ తర్వాత రష్యా, ఉక్రెయిన్ యుద్ధం మరింత కుంగదీసింది. దీనితో ధరలు పెరిగి సామాన్యుని జీవనం పెనుభారంగా మారింది. కారణంగా అధిక ద్రవ్యోల్బణంతో ఏం కొందామన్నా, ఏం తిందామా అన్న భరించలేని భారమైంది. అన్ని రకాల వస్తువులు, సేవలు, ధరలు పెరిగి చుక్కలు నడుతున్నాయి. దీనితోపాటు తినుబండారాలు, కూరగాయలు, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు పెరిగినాయి. అంతేకాదు మూడేళ్లలో స్టీల్, సిమెంట్, ఇసుక ధరలు 50 శాతం పెరిగినాయి. స్కూల్, కాలేజీల ఫీజులు, పాలు, పండ్లు, పప్పు, ఉప్పు బియ్యం నూనెలు కూరగాయలు నిత్యవసరాల అన్నింటి ధరలు ఆకాశానంటుతున్నాయి. ధరల నియంత్రణను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గాలికి వదిలేయడంతో ప్రజల బతుకులు గాలిలో దీపంగా మారింది. మరోవైపు స్టాక్ మార్కెట్లో ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నాయి. ధరల భారంతో పేద, మధ్య తరగతి వారి కష్టాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. పేద, గొప్ప వ్యత్యాసం లేకుండా అందరి ఆకలి తీర్చేది అన్నం. కానీ నేడు ఆ బియ్యం ధరలు అమాంతంగా పెరుగుతున్నాయి. గత



రెండునెలల కింద క్వింటాల్ ధర 4200గా బియ్యం ధర రూ. 5200వరకు చేరింది. ఈ పరిస్థితిని ఆసరా చేసుకొని బియ్యం వ్యాపారులు సిండికేట్‌గా మారి మార్కెట్‌ను శాసిస్తున్నారు. నూనెల ధరలు మార్చిలో లీటరు ధర 133 దాకా ఉండేది. మే నెల వచ్చేసరికి వాటికి రూ. 195 నుండి 200వందలవరకు చేరింది. నేడు కొంత తగ్గినప్పటికీ ఇంకా తగ్గాల్సి ఉంది. అలాగే కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్ 2014లో సిలిండర్‌ధర రూ.399 ఉండేది. ప్రస్తుతం అది 1130 చేరింది. గ్యాస్ సిలిండర్ ధర కొన్నాళ్లుగా అసాధారణ స్థాయిలో పెరుగుతూ వస్తుంది. ఇది చాలదన్నట్లు కేంద్ర ప్రభుత్వం 'మూల్గే నక్కపై తాటిపండు'లా గ్యాస్ రాయితీని వెనక్కి తీసుకుంది. నామమాత్రంగా రూ.40 రూపాయలు మాత్రమే రాయితీ ఇస్తుంది. రాష్ట్రంలో కరెంటు ఛార్జీలు కూడా పెరిగాయి. ఇంతకుముందు 50 యూనిట్లలోపు కరెంటు వాడి 87రూపాయల వరకు చెల్లించేవారు. ఇప్పుడు 150 రూపాయల వరకు కట్టాల్సి వస్తుంది. స్కూల్ ఫీజులు 50 శాతం వరకు పెంచారు. ప్రైవేట్‌పాఠశాలలు, కళాశాలలో కరోనా కాలంలో కుదేలై వారు ఫీజులను గణనీయంగా పెంచారు. ఈ కట్టలేని వారు ప్రభుత్వపాఠశాలలో వాళ్ల పిల్లలను చేర్పిస్తున్నారు. దీనికితోడు పుస్తకాలు, ఆటో, బస్సు ఛార్జీలు కూడా గణనీయంగా పెరిగినాయి. అలాగే నిర్మాణ భారం కూడా పెరిగిపోయింది. మూడు ఏళ్ల కిందట ప్రతి చదరపు అడుగుకు రూపాయలు వెయ్యి ఉండగా, అది ఇప్పుడు 1600 రూపాయలకు చేరింది. అలాగే స్టీల్, సిమెంట్, ఇసుక ధరలు 50 శాతం పెరగడంతో ఆ మేరకు పెంచక తప్పలేదని నిర్మాణదారులు అంటున్నారు. రిజిస్ట్రేషన్ విలువ కూడా ప్రభుత్వాలు గణనీయంగా పెంచాయి. కొత్త ఇల్లు కట్టలేరు, ఇంటి జాగలు కొనలేరు. ఇంటి అద్దె రేట్లు కూడా పెరిగినాయి. వీటికితోడు సర్కారి దోపిడీ అంతే లేదు. టాక్సీలు, సెస్సులు, సర్చార్జీల రూపంలో అన్నింటిపై వసూలు చేస్తున్నారు. మద్యం ధరలు పెంచారు. ట్రాఫిక్ నిబంధన పేరుతో బాదుడు శృతిమించుతుంది. ఇలాధరల విజృంభణతో బతుకుబండి అమాంతం తలకిందులై సాధారణ జనం అల్లాడిపోతున్నారు. ధరల స్థిరత్వంపై ఆర్‌బిఐ ద్రవ్యక్రమశిక్షణపై ప్రభుత్వం దృష్టికేంద్రీకరించాలి. రూపాయి బలపడాలంటే వస్తు ఉత్పత్తి, సేవలరంగాల్లో మనదేశం అంతర్జాతీయస్థాయి అందుకోవాలి. విదేశీ చెల్లింపులకు సంబంధించి మిగులు స్థాయిలోనే దిగుమతులు జాబితాను కనిష్టస్థాయికి కుదించాలి. ఈ ద్రవ్యోల్బణాన్ని, నిరుద్యోగాన్ని, ఉపాధి లేమిని సాధ్యమైనంత మేరకు నియంత్రించాలి. రూపాయి క్షీణతతో పెరిగే రుణభారం మనదేశానికి ఎంత మాత్రం ఆర్థికపరంగా క్షేమంకాదు. రూపాయి విలువబలపడితేనే మన దేశ ఆర్థిక రంగం కోలుకుంటుందనే ఆర్థిక నిపుణల సూచలన మేరకు ప్రతికూలతలు, ప్రతిబంధకాలను అధిగమిస్తూ ప్రభుత్వం వెంటనే శాస్త్రీయ, ప్రణాళిక బద్ధ కార్యాచరణతో నిపుణులు సూచన మేరకు దిద్దుబాటు చర్యలకు పూనుకోవాలి. ●

# నేతల వరాలు ప్రజలకు శాపం కారాదు!

బి. లలితానంద ప్రసాద్

ఏ ప్రాంత సర్వతోముఖాభివృద్ధికి అయినా సమిష్టికృషి అవసరం. సాంఘిక చైతన్యం తప్పనిసరి. తద్వారానే సమస్త వనరుల సంపూర్ణ సద్వినియోగం జరిగేది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, కొనుగోలుశక్తి, జీవన ప్రమాణాలు పెరిగేది. ఇందుకు మన పొరుగు రాష్ట్రం తమిళనాడు ప్రత్యక్ష సాక్ష్యం అన్నది జగమెరిగినది. అందుకు పూర్తి భిన్నంగా ఉండుటవిభక్తి, అవిభక్త మనరాష్ట్రం ఉండటం సర్వజన విదితం. ఇది మరోసారి తాజాగా నిరూపితమవుతుంది. ఎంతో గట్టిపోటీలో సొంత ప్రభుత్వం ఉన్న కర్ణాటక రాష్ట్రాన్నికాదని, ఎన్నో సదుపాయాలు ఉన్న ఇతర దక్షిణాది రాష్ట్రాలనీకాదని కేంద్రం మన రాష్ట్రానికి 'బల్క్ డ్రగ్ పార్క్' కేటాయించడం హర్షనీయం. అయితే కొందరు రాజకీయ జీవులు, ఆర్థిక జీవులు, సాంకేతిక జీవులు కలగలిసి, విడివిడిగా, పరస్పరం మమేకమై పలు రూపాల శంకల లేవనెత్తడం, అనుమాన బీజాలు నాటడం, సందేహాలు గుప్పించడం వారి సహజ నైజానికి నిలువెత్తు నిదర్శనం. వారు ఎల్లవేళలా మానవతా హృదయంతో అందరి శ్రేయస్సును మనసారా కోరే సాంస్కృత్ జీవులకు అతీతంగా అన్నింటా వక్రంగా, క్రూరంగా ఆలోచిస్తుంటారు. అంతా అలాగే ఉండాలని, ఉంటారని ఆశిస్తారు. పైగా కొంతకాలంగా రకరకాల సంకుచితత్వంలతో నిండిన ఊబిలో కొందరి మేధస్సు కూరుకుపోయి ఏకపక్షంగా కోరిన వారి సేవలో తరిస్తోంది. 'మేక వన్నె పులి' లాగ వీరు ప్రజల పేరుతో స్వీయ రాగద్వేషాల విషాన్ని విరజిమ్ముటకు నిరంతరం ప్రయత్నిస్తుంటారు. వీరి కారణంగా ఆయా ప్రాంతాల ప్రజల సామాజిక, ఆర్థిక, ఆరోగ్య, దీర్ఘకాల, బహుళ ప్రయోజనాలకు తీవ్రంగా ఎప్పటికీ కోలుకోలేనంతగా విఘాతం కలుగుతుంటుంది. వీరిని ప్రభుత్వం, ప్రజలు ఎంతో అప్రమత్తంగా ఉండి ఎల్లవేళలా గమనిస్తుండాలి. స్వీయరక్షణతో కార్యాచరణకు పూనుకోవాలి. తమతమ రక్షణ, శాశ్వత ప్రయోజనాలు ప్రస్తుత రాబోవు తరాల కోసం కాపాడుకోవాలి. కేవలం ప్రత్యర్థులనే కారణంతో వారి వాదనను పూర్తిగా కొట్టిపారేయకూడదు. ఎంత పాక్షికమైనా వారి వాదనలో అభిప్రాయాలలో వాస్తవాలు ఉంటే వాటిని తప్పక పరిగణనలోకి తీసుకోవాలి. ప్రజా ప్రయోజనాల పరిరక్షణ ఏ ఒక్కరి గుత్తసొత్తుకాదని గ్రహించాలి. వాస్తవాల్ని అంగీకరించాలి. వారు చెప్పే ప్రమాదాలకు నిజంగా అవకాశం ఉంటే వాటి నివారణకు, నిరోధానికి తొలి నుండి సంపూర్ణంగా జాగ్రత్తలు గైకొనాలి. వారు ఎవరుఅన్నది కాదు ముఖ్యం. చెప్పేదానిలో నిజాయతీ వాస్తవం ఎంత అనేది కీలకం. ప్రజల ప్రాణాల కన్నా మించినది ఏదీలేదు. ఉండదు, ఉండకూడదు. దీనికి సంబంధించి అనేక భయాలు కాలుష్యాలకు సంబంధించినవిగా ఉన్నాయి. వాటిని సంబంధితులు తప్పనిసరిగా నివృత్తి చేయాలి. విజ్ఞతతో కూడిన నిర్ణీత కాలప్రణాళిక, కార్యాచరణ, సమీక్ష, నిరంతరం పర్యవేక్షణతో, పారదర్శకతతో మెరుగుదల ఉండాలి. విశ్వస్థాయిలోప్రపంచ అనుభవాన్ని, పరిణామాల్ని, పర్యవసానలను తప్పక పరిగణనలోకి తీసుకోవాలి. ఎక్కడ ఎలాంటి రాజీలకు సర్దుబాటుకు తావివ్వరాదు. ఈ సందర్భంలో విమర్శకులను అంతా గుర్తు చేసుకోవాల్సింది. గతంలో చెర్నోబిల్ అణుప్రమాదం అనంతరం ఘోరాతిఘోరదారుణాలు అన్నీ తెలిసి ఉండి మన దేశం అమెరికాతో అణు ఒప్పందం ఏర్పర్చుకోవడం జగద్వితం. అలాగే భోపాల్ గ్యాస్ దుర్ఘటనలో తరతరాలుగా బహురూపాల పీడనకు గురవుతున్న అక్కడి ప్రజల గోడు మన ఉన్నత న్యాయస్థానాల ఉక్కుగోడల ఉపరితలాన్ని స్పృశించలేకపోవడం, దశాబ్దాలుగా గడుస్తున్నా సభ్యసమాజం జనులంతా అప్పటి హృదయవిదారక దారుణాలు ఇప్పటికీ జీర్ణించుకోలేకపోతున్నారు. విలువల బేరీజులకు సామాన్య ప్రజల ప్రాణాల కన్నా మానవతా రహిత సంపన్నుల లాభార్జనలే మిన్నగా రూపుదాల్చడం అత్యంత విచారకరం. రాష్ట్రానికి సంబంధించి ఇటీవల కేంద్రం కేటాయించిన బల్క్‌డ్రగ్ పార్క్ విషయంలో ప్రముఖంగా వెల్లడవుతున్న ఆందోళన కాలుష్యానికి సంబంధించినది. ప్రజల ప్రాణాలను కాటువేయగల కాలుష్య విషయంలో ఎలాంటి రాజీ లేకుండా సమస్త ముందు జాగ్రత్తలు గైకొనాలి. లేకుంటే ఇప్పుడు 'వరం' అనుకుంటున్న ఈ బల్క్‌డ్రగ్ పార్క్ రాబోయే రోజుల్లో శాపం కాగలదు. అలా కాకుండాచూడాల్సిన సంపూర్ణ బాధ్యత ప్రభుత్వానిది. అందులోను సంబంధిత యంత్రాంగంది. ఇక్కడ డ్రగ్ కర్మాగారాల్లో నిర్మాణం నుండి అత్యాధునిక ప్రపంచస్థాయి సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి అన్ని రకాల కాలుష్యం నివారణకు, లేక వీలైనంతగా తగ్గింపునకు ప్రయత్నించాలి. మిగతా ఫ్యాక్టరీలకు మించి వీటిలో ముడిపదార్థం నుండి తుది పదార్థం వచ్చేలోపు కాలుష్యం కలిగించే విసర్జకాలు అనేకం ఉంటాయి. అవి అవిభాజ్యం. వీటి కారణంగా తయారీ నిలిపివేస్తే ప్రపంచమంతా వాటి తయారీ నిలిచిపోతుందనే కనీసఅవగాహన అవసరం. ఈ అత్యవసరాలు లేకుంటే మానవాళి అస్తిత్వమే ప్రశ్నార్థకం అవుతుంది. కొవిడ్ కాలంలో ప్రపంచ ప్రజానీకం అందరికీ ఈ విషయం బాగా అవగతమైంది. కాలుష్య కారణంగా పరిశ్రమలు అందునా ప్రాణావసర మందులవి వద్దనడం, జీర్ణం కాదని తినరాదనడం, ఉపద్రవాలతో పంటలు పండవని విత్తులు నాటొద్దనడం లాంటిదే. వీటన్నింటి రీత్యా మందుల తయారీలో వీలైనంతగా పలురకాల కాలుష్యాల తగ్గింపు, నిల్వ, విడుదల, వగైరా ప్రక్రియల్లో అన్నివిధాల తటస్థీకరణ జరిపి జనావాసాలకు సుదూరంగా విడుదల చేయాలి. భూగర్భజలాలు ఏమాత్రం కలుషితం కాకుండా చూడాలి. నదులు, సముద్రంలోకి విడుదల చేసే వాటి వలన అక్కడ జలచరాలకు హాని కలగరాదు. పారిశ్రామిక కాలుష్యం నుండి ప్రజల ప్రాణాలను కాపాడటంలో తమ కర్తవ్య నిర్వహణ, విద్యుక్తధర్మం నెరవేర్చడంలో ప్రలోభాలకు అతీతంగా ఉండాలి. అన్నివిధాలా తమ అస్తిత్వలక్ష్యాన్ని అకింతభావంతో నిర్వర్తించాలి. పారిశ్రామికవేత్తల కాసుల పంటల కన్నా, వారి ద్వారా పొందే నిధుల గుట్టల కన్నా ఈ పార్కు తీరప్రాంతంలో రావడంతో కొన్ని సౌలభ్యాలు ఉంటాయి. మరికొన్ని ఇబ్బందులు ఉంటాయి. మొదటి వాటిని సంపూర్ణంగా వినియోగించుకోవాలి. రెండో వాటిని అధిగమించడానికి అన్నివిధాలా ప్రయత్నించాలి. ఎలాంటి పరిస్థితుల్లోనూ అక్కడిప్రజల ప్రాణాలకు, అందరికీ తిండి పెట్టే పొలాలకు, పంటలకు ఏ రూపంలోనూ ఏమాత్రం హానిజరగనివ్వరాదు. వ్యతిరేకులు, ప్రత్యర్థులు అనే పేరుతో ప్రతిదీ తిరస్కరించనవసరం లేదు. వాటిల్లో నిజాయితీతో కూడిన వాస్తవిక ప్రాతిపదికపై ప్రజాశ్రేయస్సు రీత్యా నిష్కల్మషంగా వచ్చిన వాటిని అన్ని విధాలా పరిగణనలోకి తీసుకొని అవసరమైనచోట తగురీతిలో సవరించుకోవాలి. దీర్ఘకాలంలో అవి అందరికీ మేలు చేస్తాయి. బహుళ ప్రయోజనాలనిస్తాయి. నిజమైన విలువైన సలహాలు పాటించగలిగితే అవి ఇచ్చిన వారికన్నా పాటించిన వారే ప్రయోజనం పొందుతారు. ఈ విజ్ఞత పాలకులలో ఏ మేరకు ఉంటే ఆ సమాజం అంతగా సర్వతోముఖాభివృద్ధి చెందుటకు ఎక్కువఅవకాశాలు ఉంటాయి. ●

# అధికారకంగానే బీపీ మండల్ విగ్రహ ప్రతిష్ఠ

**- ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, మేయర్ కావటి - సమసిన వివాదం**

**గుంటూరు, అక్టోబరు 2, ప్రభాతవార్త:** బీసీ రిజర్వేషన్ పితామహుడు బీపీ మండల్ విగ్రహాన్ని ప్రభుత్వ అనుమతితో అధికారకంగా ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి,నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు స్పష్టం చేశారు. ఇటీవల గోరంట్ల ఇన్నర్ రింగురోడ్డులో బీపీ మండల్ విగ్రహం ఏర్పాటుకు ఏర్పాటుచేసిన దిమ్మెను



నగరపాలకసంస్థఅధికారులు కూల్చివేసిన విషయం విదితమే. అనంతరం ఈ విషయంపై బీసీ సంఘాలు, రాజకీయ పార్టీలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఆదివారం ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిక్యాంపు కార్యాలయంలో బీపీ మండల్ విగ్రహ కమిటీ కన్వీనర్ జంగా కృష్ణమూర్తి, కో కన్వీనర్ ఆలా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విగ్రహ కమిటీ సభ్యులు బోనబోయిన శ్రీనివాసయాదవ్, క్రాంతికుమార్‌తో పాటుగా పలువురితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా అప్పిరెడ్డి మాట్లాడుతూ దిమ్మె కూల్చిన ప్రాంతాన్ని సోమవారం ఉదయం పరిశీలిస్తామన్నారు. సీఎం జగన్‌మోహనరెడ్డి బీసీల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషిచేస్తున్నారని అన్నారు. సమావేశంలో జిడిసిసి బ్యాంకు ఛైర్మన్ లాలుపురం రాము తదితరులు పాల్గొన్నారు. అనంతరం జాతిపిత మహాత్మాగాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహుదూర్‌శాస్త్రిల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటాలకు ఎమ్మెల్సీ అప్పిరెడ్డితో పాటుగా పలువురు పూల మాలలువేసి ఘనంగా నివాళి అర్పించారు. ఎమ్మెల్సీ అప్పిరెడ్డి పుట్టిన రోజు వారోత్సవాల సందర్భంగా ఆదివారం పట్టాభిపురంలోని మాతృశ్రీ పిల్లల ఆశ్రమంలో పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు.

# లాలుపురంలో అమ్మవార్లకు విశేష పూజలు





**గుంటూరు, అక్టోబరు 2, ప్రభాతవార్త:** గుంటూరు మండలం లాలుపురంలోని పలు ఆలయాల్లో దసరా శరన్నవరాత్రుల వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. శ్రీశాంకరీమాత ఆలయం, శివాలయం, శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయాల్లో మహిళా భక్తులచే సామూహిక కుంకుమ పూజలు కొనసాగిస్తున్నారు. ఆలయాలు మొత్తం రంగురంగు విద్యుత్తు దీపాలతో సుందరంగా అలంకరించారు. రాత్రి సమయంలో భజన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. శాంకరీమాత ఆలయంలో ప్రతి రోజు దంపతులచే సామూహిక పూజలు జరుపుతున్నారు. శ్రీశాంకరీమాత ఆలయంలో జరిగే పూజా కార్యక్రమంలో శింకా మల్లికార్జునరావు, శృంగారపు ఏసుబాబు, మేడా రామారావు, తోట సురేష్‌బాబు, గోలి శ్రీనివాసరావు దంపతులు వరుసగా పాల్గొన్నారు. ఆదివారం మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవారు సరస్వతిదేవిగా దర్శనమిచ్చారు. సోమవారం పూజా కార్యక్రమంలో గనిమిశెట్టి సురేష్‌బాబు దంపతులు పాల్గొంటారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అంకిరెడ్డిపాలెం శివాలయంలో జరిగిన వేడుకల్లో అమ్మవారికి సరస్వతిదేవి అలంకారం ఏర్పాటు చేశారు.ఆలయం ప్రధాన అర్చకులు భవనగిరి కాంతయ్య సిద్దాంతి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

# నేడు పోలీసు స్పందన కార్యక్రమం రద్దు

**గుంటూరు, అక్టోబరు 2, ప్రభాతవార్త:** ప్రతి సోమవారం జిల్లా పోలీసు కారా ్యలయంలో నిర్వహించే పోలీసు స్పందన కార్యక్రమాన్ని దసరా పర్వదినం సందర్భంగా తాత్కాలికంగా రద్దుచేసినట్లు జిల్లా అడ్మిన్ ఏఎస్పీ సుప్రజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి సహకరించాల్సిందిగా ఆమె ఈ సందర్భంగా కోరారు.

# శ్రీసరస్వతీదేవి అలంకారంలో శ్రీ భ్రమరాంబ అమ్మవారు

**పెదకాకాని,అక్టోబర్.2.ప్రభతావార్త:** శ్రీ మల్లేశ్వరస్వామి దేవస్థానములో శ్రీదేవి నవరాత్రుల మహోత్సవంలు7వ రోజు నిర్వహించారు.ఆదివారంశ్రీభ్రమరాంబ అమ్మ వారిని శ్రీసరస్వతీదేవిగా స్టేజి అలంకారముగా రావణాబ్రహ్మకైలాసపర్వతమెత్తుటతో భక్తులు దర్శించుకున్నట్లు అలయం సహాయకమీషనర్ యస్.శ్రీనివాస రెడ్డి తెలిపారు. అమ్మవారికి అత్యంతప్రీతికరమైన చండీమరియురుద్రహోమములను శరన్నవరాత్రోత్సవముల పర్వదినములలో భక్తులు చండీ హోమము జరిపించుకున్నరు. సాంస్కతిక కార్యక్రమాలు భాగముగా శ్రీమతి రామరాజులక్ష్మి వీణావాద్యము ఆరాధ్యుల తేజస్విప్రక్య కూచిపూడినృత్యం, ఆర్గనైజర్. ఎ.ఆదినారయణ తెనాలి వారిచే శ్రీకృష్ణతులాబారము, శ్రీకొమ్మూరిసాంబశివరావు గుంటూరువారిచే శ్రీకృష్ణరాయబారము కార్యక్రమములు భక్తులను రంజింపజేశాయి.



# మహనీయుల త్యాగాలు మరువలేనివి

**గుంటూరు నగరపాలక సంస్థ, అక్టోబర్ 2, ప్రభాతవార్త :** సత్యాగ్రహమే ఆయుధంగా అహింసామార్గంలో పోరాడి భారతావనికి స్వాతంత్ర్యం అందించిన మహనీయులు మహాత్మాగాంధీ అని జైకిసాన్ జై జవాన్ నినాదంతో రైతులు,సైనికుల త్యాగాన్ని ఎలుగెత్తి చాటిన ప్రజానేత లాల్‌బహదూర్ శాస్త్రి అని ఎమ్మెల్సీ



మహాత్మున విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కమీషనర్ కీర్తి చేకూరి తదితరులు

కె.ఎస్.లక్ష్మణరావు,ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్,నగర కమీషనర్ కీర్తి చేకూరిలు అన్నారు.ఆదివారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో మహాత్మాగాంధీ,లాల్ బహదూర్ శాస్త్రిల జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర ్భంగా వారు మాట్లాడుతూ నాటి నాయకుల దేశభక్తి,త్యాగనిరతిని నేటితరం యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు.కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజిలా,నగరపాలక సంస్థ అదనపు కమీషనర్ బి.శ్రీనివాసరావు,డిప్యూటీ కమీషనర్ టి.వెంకటకృష్ణయ్య,ప్రజాప్రతినిధులు,అధికారులు పాల్గొన్నారు.

# అవగాహన...లో మహాత్మాగాంధీ,లాల్ బహదూర్ శాస్త్రిల జయంతి

**గుంటూరు కల్చరల్, అక్టోబర్ 2, ప్రభాతవార్త :** ప్రతి తరానికి చెందిన దేశప్రజలను కర్తవ్య పథంలో సాగేలా పూజ్య బాపూజీ జీవితం,ఆదరా ్శలు స్ఫూర్తినిస్తుంటాయని అలాగే విలువలతో లాల్ బహదూర్ శాస్త్రి జీవితం దేశప్రజలకు సదాస్ఫూర్తిదాయకమని అవగాహన సంస్థ సభ్యులు నివాళులర్పించారు.సంస్థ కార్యాలయంలో మహాత్మాగాంధీ,లాల్ బహదూర్ శాస్త్రిల జయంతి కార్యక్రమాన్ని సంస్థ సభ్యులు ఘనంగా నిర్వహించారు. రఘుపతి రాఘవ రాజారాం గేయంతో మహాత్మాగాంధీ,శాస్త్రిల చిత్రపటాల కు పూలమాలలు వేసి ప్రముఖ గాంధేయవాది చాగంటి సుబ్బారెడ్డి ప్రారంభించారు.కార్యక్రమంలో చాగంటి మాటా ్లడుతూ గాంధీజి సిద్ధాంతాలు,శాస్త్రీ పాటించిన విలువలు నేటి పాలకులకు ప్రజలకు స్ఫూర్తిదాయకమన్నారు. తెలుగు పండితులు రాజన్న మాస్టారు మాట్లాడుతూ గాంధీమార్గం అనేది నాలుగు అక్షరాల పదంకాదని,అక్షరాల అగ్నిపథమని సత్యసంధత,నమ్మిన సిద్ధాంతాల పట్ల నిబద్ధత గాంధీని మహాత్ముడ్ని చేశాయన్నారు.కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త రత్నారావు,రచయిత జొన్నలగడ్డ రామారావు తదితరులు ప్రసంగించారు.



# గుంటూరు వార్త

# వైభోవేపేతంగా దేవి శరన్నవరాత్రుల వేడుకలు

**గుంటూరు కల్చరల్, అక్టోబర్ 2, ప్రభాతవార్త :**

దేవీ శరన్నవరాత్రుల వేడుకలు శ్రీ దుర్గామాతా శక్తిపీఠంలో అత్యంత వైభవోపేతంగా జరుగుతున్నాయి.స్థానిక పాతగుంటూరు లక్ష్మీనగర్ లోని దుర్గామాత శక్తిపీఠం లో ఆదివారం అమ్మవారి జన్మనక్షత్రమైన మూలానక్షత్రం సందర్భంగా అమ్మవారు సరస్వతీ దేవిగా భక్తులకు దర ్శనమిచ్చారు.ప్రాత:కాలం నుండి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.పీఠం నిర్వాహకులు భవానీస్వామీ సరస ్వతీ దేవిగా కొలువై ఉన్న అమ్మవారిని ప్రత్యేక అలంకరణ నిర్వహించి చిన్నారులు విద్యలో రాణించాలని ఆకాంక్షిస్తూ స్థానిక పిల్లలకు పలకలు,పుస్తకాలు వితరణ గావించారు.అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.పూజా కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# 8కోట్ల ఆంధ్రుల ప్రయోజనం కోసంమే ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ

**చిలకలూరిపేట, అక్టోబరు2,ప్రభాతవార్త:**

తెలుగు ప్రజల ఆరాధ్యదైవం నందమూరి తారకరామారావు ఆనాడు 8కోట్ల మంది ఆంధ్రుల ప్రయోజనం కోసం దేశంలో ఎక్కడా లేని విధంగా హెల్త్ యూనివర్సిటిని స్థాపించారని రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు, మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఆమహనీయుడి సేవలకు గుర్తింపుగా ఆయన స్థాపించిన హెల్త్ యూనివర్సిటికి యన్‌టిఆర్ మరణానంతరం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు యన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటి గా నామకరణం చేశారని తెలియచేశారు. నేడు పాలనపై ఎలాంటి అవగాహన లేని ముఖ్యమ ంత్రి, చరిత్ర గురించి తెలియని ఈ ముఖ్యమంత్రి యన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటి పేరును వైయస్ఆర్ హెల్త్ యూనివర్సిటిగా మార్చాలనే ఆలోచన రావటం ఒక దుర్మార్గమైన చర్య అని ప్రత్తిపాటి విమర్శించారు. ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో ఆయన చేస్తున్న దుర్మార్గమైన ఆలోచనలతో ముఖ్యమంత్రి చరిత్రహీనుడిగా మిగిలిపోతాడని ప్రత్తిపాటి అన్నారు. దీనికి నిరసనగా టిడిపి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో ఆదివారం చేపట్టిన దీక్షా శిబిరంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. అన్నగారి కుటుంబంపైన, చంద్రబాబు కుటుంబంపైన, టిడిపి కార్యకర్తలపైన సోషల్ మీడియాలో అసభ్యపదజాలంతో పోస్టులు పెడితే ఎలాంటి చర్యలు తీసుకోరా అని ప్రత్తిపాటి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు పెట్టిన పోస్టింగులపై అక్రమంగా కేసులు బనాయించి అక్రమ అరెస్టులు చేస్తున్నారని ప్రత్తిపాటి దుయ్యబట్టారు. టిడిపి సీనియర్ నాయకుడు చింతకాయల అయ్యన్నపాత్రుడు కుమార్ చి ంతకాయల విజయ్‌పై అక్రమంగా సిఐడి వారు కేసులు బనాయించి ఇంటికి వెళ్లి దౌర ్జన్యం చేయటాన్ని ఆయన ఖండించారు. మూడున్నర సంవత్సరాల కాలంలో ముఖ్యమంత్రి ప్రజాభిప్రాయం కోల్పోయాడన్నాడు. ప్రశాంత్‌కిషోర్ టీం ఇచ్చిన సర్వే రిపోర్ట్‌తో జగన్‌మోహన్‌రెడ్డి ఫీజుల ఎగిరిపోయి ఎం చేయాలో తెలియన స్థితిలో పోలీసువారిని అడ్డం పెట్టుకోని సమాజంలో భయభ్రాంతులు సృష్టిస్తున్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డికి టైం దగ్గరపడిందని, పోలీసులు కూడా కాపాడలేని స్దితికి వచ్చారని, ప్రజాగ్రహానికి గురికాక తప్పదని ప్రత్తిపాటి అన్నారు. యూనివర్సిటి యన్‌టిఆర్ పేరు మార్పుకు నిరసనగా 3రోజులు రిలే నిరహరదీక్షలు పార్టీ కార్యాలయంలో చేస్తున్నట్లు పట్టణ పార్టీ కార్యదర్శి పఠాన్ సమద్‌ఖాన్ తెలిపారు. తొలుత యన్‌టిఆర్ విగ్రహానికి ప్రత్తిపాటి, పార్టీ నాయకులు, కౌన్సిలర్లు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మొదటిరోజు శిబిరంలో పార్టీ నాయకులు మద్దిబోయిన సాంబశివరావు, మద్దుమాల రవిబాబు, గు ర్రం నాగపూర్ణచంద్రరావు, జరీనా సుల్తానా, పోపూరి లక్ష్మీ, నజీరున్నీసాబెగం, లక్ష్మీ, పద్మ, బసీరున్నీసా, గొట్టిపాటి చైతన్య, యస్ శ్రీనివాసరావు, ఆర్ కోటేశ్వరరావు, సంజీవ్‌కుమార్, ఆరె మల్లిఖార్జునరావు, నాగేశ్వరరావు, గోపినాయక్, మేకపోతుల అశోక్, టిడిపి కౌన్సిలర్లు గంగా శ్రీనివాసరావు, కొత్తకుమారి, కె లక్ష్మీతిరుమల, కూనల ప్రమీల, కంచర్ల కరుణ, రాయని హరిత, పాములపాటి శివకుమారి, జంగా సుజాత, టిడిపి సీనియర్ నాయకులు షేక్ జమాల్‌భాష, భీమవరపు సుబ్బారావు, ఐటిడిపి సభ్యులు, వివిధ హోదాలలో ఉన్న పార్టీ నాయకులు పాల్గొన్నారు.



టిడిపి కార్యాలయంలో జరుగుచున్న దీక్షా శిబిరంలో పాల్గొన్న మాజీమంత్రి ప్రత్తిపాటి, పార్టీ నాయకులు

# జాతిపితకు జనసైనికుల ఘన నివాళులు

**గుంటూరు కల్చరల్, అక్టోబర్ 2, ప్రభాతవార్త :**

అహింసామార్గం ద్వారా స్వాతంత్ర్యాన్ని సాధించిన జాతిపితా మహాత్మాగాంధీ కి జనసైనికులు ఘనంగా నివాళులర్పించారు.ఆదివారం గాంధీ జయంతిని పురస్కరించుకొని స్థానిక మార్కెట్ సెంటర్లో జనసేన నగర అధ్యక్షులు నేరెళ్ళ సురేష్ ఆద్వర్యంలో గాంధీ



జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ గాంధీజీ జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు.ఈ కార్యక్రమంలో జనసేన నగర కార్యవర్గ నేతలు చింతా రేణుకా రాజు,ఎడ్లమల్లి ఆనంద్‌సాగర్,పుల్లంశెట్టి ఉదయ్‌కుమార్,తోట కార్తిక్,పాముూలూరి కోటి,సుధా నాగరాజు,బండారు రవీంద్ర,సుంకే శ్రీనివాస్,సింగ్,పులిగడ్డ గోపి,బందెల నవీన్,జనసైనికులు పాల్గొన్నారు.

# జిఎంసీ స్పందన రద్దు

**గుంటూరు నగరపాలక సంస్థ, అక్టోబర్ 2, ప్రభాతవార్త :**

సోమవారం దుర్గాష్టమి పర్వదినం పబ్లిక్ హాలిడే సందర్భంగా గుంటూరు నగరపాలక సంస్థలో జరిగే స్పందనను రద్దుచేస్తున్నట్లు నగర కమీషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.స్థానిక సమస్యలపై నగర ప్రజలు కంట్రోల్ రూమ్ 0863-2345103 లేదా 9849908391కు వాటా ్సప్ చేయవచ్చని తెలిపారు.

# గాంధీ అడుగుజాడల్లో నడవాలి

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, అక్టోబర్ 2, ప్రభాతవార్త :** ప్రపంచ మానవాళికి ఆదర్శప్రాయునిగా నిలిచిన మహాత్మాగాంధీ అడుగుజాడల్లో నేటి యువత నడవాలని రెక్టార్ ప్రొఫెసర్ పి.వరప్రసాదమూర్తి సూచించారు.గాంధీ జయింతిని పురస్కరించుకొని ఆదివారం వర్సిటీలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా రెక్టార్ మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చేందకు సత్యం,అహింసా అనే నినాదాలతో ఉద్యమాన్ని నడిపి అందర్ని ఏకతాటిపైకి తెచ్చిన గాంధీ గొప్పనేత అని పేర్కొన్నారు.ఆయన జీవితమే ఒక సందేశంగా భావించి యువత [illegible] సాగాలని పిలుపునిచ్చారు.డాక్టర్ సోమశేఖర్ మాట్లాడుతూ వర్సిటీలో గాంధీ అధ్యాయన కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థుల సౌకర్యార్థం సర్టిఫికేట్ కోర్సు,డిప్లోమా కోర్సులను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.గాంధీకి సంబంధించిన పుస్తకాలను,రచనలను,ఆయనపై ముద్రించిన జర్నల్సులను ఈ కేంద్రంలోని లైబ్రరీలో అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు.విద్యార్థులు వాటిని చదివి గాంధీని అధ్యాయనం చేయాలని సూచించారు.కేంద్రం అభివృద్ధికి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పట్టేటి రాజశేఖర్ కృతనిశ ్చయంతో సహకారం అందిస్తున్నారని ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంలో అధ్యాపకులు డాక్టర్ సుధాకర్,డాక్టర్ ప్రశాంత్,ఉద్యోగులు విష్ణువర్ధన్‌రెడ్డి,ఎన్‌సిసి క్యాడెట్లు,వాలంటీర్లు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# ఉచిత ఎముకల,కీళ్ళ వైద్య శిబిరం

**పెదనందిపాడు, అక్టోబర్ 2, ప్రభాతవార్త :** కనుమూరి హాస్పటల్‌కు చెందిన ప్రముఖ కీళ్ళ వైద్య నిపుణులు డాక్టర్ బోయపాటి గిరిధర్ ఆదివారం పెదనందిపాడు గ్రామంలోని అశోక హైస్కూల్‌లో ఉచిత ఎముకలు,కీళ్ళ వైద్య శిబిరం నిర్వహించారు.ఈ వైద్య శిబిరానికి 180మందికి పైగా ప్రజలు ఎముకల సాంద్రత పరీక్ష బి.ఎం.డి మరియు రక్త పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ గిరిధర్ మాట్లాడుతూ 45సంవత్సరాల పైబడిన వారికి మరియు తీవ్ర నడుము నొప్పితో బాధపడుతున్న వారికి శరీరంలో అన్నిచోట్ల ఎముకలు నొప్పిగా అనిపించిన ఈ ఎముకల సాందత్ర పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు.ఎముకల సాంద్రత విలువ తక్కువగా ఉన్నవారికి ఎముకల సాంద్రత పెంచుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు,మందులు గురించి వివరించారు.అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు.

# సూట్స్ కేర్ నెట్‌వర్క్‌కి ఉత్తమ సోషల్ ఎంటర్‌ప్రైజ్ అవార్డు

**గుంటూరు, అక్టోబర్ 2, ప్రభాతవార్త :** వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చూడుతూ అందరికీ నాణ్యమైన వైద్య అందుబాటులోని తెచ్చేందుకు కృషిచేస్తున్న సూట్స్ కేర్ నెట్‌వర్క్ కు బెస్ట్ సోషల్ ఎంటర్‌ప్రైస్ 2022అవార్డు రావడం అభినందనీయమని తెలంగాణా ఇన్ఫర్‌మెషన్ టెక్నాలజీ అసోసియేషన్ గ్లోబల ప్రెసిడెంట సందీప్‌కుమార్



అవార్డు అందుకుంటున్న డాక్టర్ కంకర సోమశేఖరరెడ్డి

మక్తాలా పేర్కొన్నారు.తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ 10వ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాదులో జరిగిన వార్షికోత్సవ కార్యక్రమంలో టిటా గ్లోబల్ ప్రెసిడెంట్ సందీప్‌కుమార్ మక్తాలా ,సూట్ ్స కేర్ నెట్‌వర్క్ సీఈఓ గుంటూరు తులసీ హాస్పటల్ నిర్వాహకులు డాక్టర్ కంకర సోమశేఖరరెడ్డి ఎంఒయు కుదుర్చుకున్నారు.అనంతరం డాక్టర్ సోమశేఖరరెడ్డి మాట్లాడుతూ సూట్స్ కేర్ నెట్‌వర్క్ అందించే వైద్యసేవలను రెండు తెలుగు రాష్ట్రాల్లో విస ్తరించడానికి ఎంఒయు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.తెలంగాణా రాష్ట్రంలోనీ టీటా సభ్యులందరూ వినియోగించుకునే విధంగా మరియు తెలంగాణలో ఎఫర్డబుల్ హెల్త్‌కేర్‌ని తీసుకొచ్చేలా రెండు సంస్థలు కలిసి పనిచేస్తాయన్నారు.ఈ కార్యక్రమంలో సంస్థ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రిన్స్ అభిషేక్,ప్రతినిధులు మహబూబ్ బాషా,లలిత్,వెంకట్,ఎస్‌జిఎస్ డైరెక్టర్ డాక్టర్ చంద్రప్రకాష్ మరియు సావెయో డైరెక్టర్ కార్తీ ్క్ తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ నజీరుద్దీన్‌కు ఘన సన్మానం



**గుంటూరు, అక్టోబర్ 2, ప్రభాతవార్త :** ఎన్నో క్లిష్టమైన సర్జరీలు విజయవంతం చేసి మూడువేల సర్జరీలు పూర్తిచేసిన సీనియర్ లా ్యప్రోస్కొపిక్ సర్జన్ డాక్ ్టర్ నజీరుద్దీన్‌ను డాక్టర్ షమా సులా ్తనా ఘనంగా సత్కరించారు.స్థానిక ఓల్డ్‌క్లబ్ రోడ్డులోని హోప్ విన్ హాస్పటల్లో జరిగిన కార్యక్రమంలో నగరంలోని పలువురు వైద్యులు హాజరై డాక్టర్ నజీరుద్దీన్‌ను ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా డాక్టర్ నజీరుద్దీన్ మాట్లాడుతూ కార్పొరేట్ వైద్యం సామాన్యులకు అందుబాటులో తెచ్చామన్నారు.రానున్న పదిరోజులపాటు ఆపరేషన్లు,ల్యాబ్ పరీక్షలు,వైద్యసేవల్లో 30శాతం రాయితీ కల్పిస్తున్నట్లు వెల్లడించారు.

# జాతిపిత స్ఫూర్తితో ముందుకు సాగాలి

**గుంటూరు కల్చరల్, అక్టోబర్ 2, ప్రభాతవార్త :**

జాతిపిత మహాత్మాగాంధీ స్ఫూర్తితో నేటి యువత ముందుకు సాగాలని జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.ఆదివారం స్థానిక లాడ్జి సెంటర్‌లోని జనసేన




గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె తదితరులు

కార్యాలయంలో గాంధీ,లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర ్భంగా గాదే మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య సాధన కోసం అలుపెరగని పోరాటం చేసిన గాంధీ,లాల్ బహదూర్ శాస్త్రి త్యాగాలు దేశప్రజల ఎన్నటికీ మరువలేరన్నారు.తొలుత నేతలు గాంధీ,శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు అడపా మాణిక్యాలరావు,బిట్రగుంట మల్లికా,జిల్లా ప్రధాన కార్యదర్శి నారదాసు రామచంద్రప్రసాద్,నేతలు కొర్రపాటి నాగేశ్వరరావు,మధులాల్,దాసరి వెంకటేశ్వరరావు,కొత్తకోట ప్రసాద్,జానీభాష తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పాలన వైఎస్ కుటుంబానిదే

### - ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

**పొన్నూరు, అక్టోబరు 2,ప్రభాతవార్త:** పేద, బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమ ఫలాలను అందించిన, అందిస్తున్న ఘనత వైఎస్ కుటుంబానికే చెల్లుతుందని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. పట్టణంలోని మూడవ వార్డులో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య గడప గడపకు తిరుగుతూ ఆయా కుటుంబాలకు జగన్మోహనరెడ్డి ప్రభుత్వంలో చేకూరిన లబ్ధి గురించి వివరించారు. నాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సంక్షేమ పాలన అందిస్తే, నేడు ఆయన తనయుడు వైఎస్ జగన్మోహనరెడ్డి సంక్షేమ విప్లవాన్ని తీసుకొచ్చి అమలు చేస్తూ ముందుకు సాగుతున్నారన్నారు. జగన్మోహనరెడ్డి ప్రవేశపెట్టిన సంస్కరణలు, పథకాలు నేడు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. సీఎం తెచ్చిన వార్డు, గ్రామ సచివాలయాలు, వాలంటీర్ వ్యవస్థ దేశంలోని అనేక రాష్ట్రాల్లో అమలు చేసేందుకు ఆయా ప్రభుత్వాలు చర్చించుకొంటున్నాయన్నారు. గత పాలకులు సంపన్న వర్గాలకు లబ్ధి చేకూర్చే విధంగా పథకాలను రూపకల్పన చేస్తే మన ముఖ్యమంత్రి జగన్ మాత్రం 85శాతం పేద ప్రజలకు లబ్ది చేకూర్చేందుకు నవరత్నాలను తీసుకురావడమే కాకుండా ఇంకేమైనా పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ఆలోచన చేస్తున్నారన్నారు. ప్రజలకు మేలు చేసే ప్రభుత్వానికి ప్రజలు అండదండలు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జగనన్న సంక్షేమ పాలనను చూసిన ప్రజానీకం ఈరోజు మళ్ళీ జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసుకొనేందుకు కూడా సిద్ద పడుతున్నారన్నారు. ప్రజలు కూడా మేలు చేసే జగన్‌ను ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కిలారి రోశయ్య కోరారు. కార్యక్రమంలో దేగల శ్రీరామమూర్తి, ఆకుల వెంకటేశ్వరరావు, అమిరినేని సాంబశివరావు, యర్రంశెట్టి రామకృష్ణ, అంబటి వెంకటేశ్వరరావు, వట్టిప్రోలు రంగారావు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య నాయకులు

# పెన్షనర్స్ సేవలు మరువలేనివి

### - మునిసిపల్ కమిషనర్ డాక్టర్ నలమలపు రాధ

**పొన్నూరు, అక్టోబరు 2,ప్రభాతవార్త:** పెన్షనర్ల సేవలు మరువలేనివని మునిసిపల్ కమిషనర్ డాక్టర్ నలమలపు రాధ అన్నారు. స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో ఆదివారం పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న పారిశుధ్య కార్మికులను సత్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ రాధ మాట్లాడుతూ పెన్షనర్లు విధులు నిర్వహించే సమయంలో ప్రభుత్వ



కార్యకలాపాలను విజయంతంగా నిర్వహించి, విశ్రాంతి సమయంలో కూడా సమాజాన్ని జాగృతం చేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం శుభపరిణామమన్నారు. కార్మికులను గుర్తించడం అసోసియేషన్ సభ్యుల యొక్క విలువలకు, సుగుణాలకు నిదర్శనమన్నారు. కార్మికులను సత్కరించడం అంటే కార్మికుల యొక్క బాధ్యతను గుర్తుచేయడమేనన్నారు. కార్మికులు కూడా విధులను సక్రమంగా నిర్వహించాలని, ఇలాంటి సన్మానాలు, సత్కారాలు మరిన్ని పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సక్కుర్తి ప్రసాద్, మర్రెడ్డి సాంబిరెడ్డి, కోశాధికారి పి.సాంబిరెడ్డి, జాయింట్ సెక్రటరీ సూరా రామారావు పాల్గొన్నారు.

## బాపట్ల జిల్లా వార్త



• వేమూరు • రేపల్లె • బాపట్ల • పర్చూరు • అద్దంకి • చీరాల

# మహా సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు

**బాపట్లరూరల్,,అక్టోబర్2,ప్రభాతవార్త:**బాపట్ల పట్టణంల వేంచేసియున్న శ్రీ సువర్చలా సమేతా ప్రపత్యాంజనేయ స్వామి దేవాలయంలో లలితా త్రిపురసుందరీ పీఠం అధ్వర్యంలో అమ్మవారు మహాసరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు అధివారం దర్శనమిచ్చారు.ఈ సందర్భంగా అలయ అర్చకులు నెమలికంటి హనుమంతరావు మాట్లాడుతూ నవరాత్రుల్లో అత్యంత ప్రధానమైనది అమ్మవారి జన్మనక్షత్రమైన మూలానక్షత్రం సంరద్భంగా అమ్మవారు మహాసరస్వతీ దేవి గా దర్శనమిచ్చారనానఉ. ఉదయం సరస్వతీ అమ్మవారికి ప్రతికరమైన తెల్లకలువలపూలు,పద్మములతో విశేష పూజ నిర్వహించారు.లలితాసహస్రనామార్చన,త్రిశతి ఖడ్గమాలా సహితంగా కుంకుమార్చన,చిన్నారులకు అశ్రీరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించామన్నారు. విద్యకొసం సరస్వతీ లేహ్యా ప్రసాదాన్ని భక్తులకుఅందిచారు.అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు.ప్రత్యేకనైవేద్యాలు జరిపి భక్తులకు తీర్థప్రసాదాలుఅందజేయటం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో పంగులూరి కౌండిన్య,కృష్ణసాయి,ప్రశాంత్,బాలాజి,తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గాంధీజీ 153 జయంతి వేడుకలు

**బాపట్ల,ఆగస్టు02,ప్రభాతవార్త:**గాంధీ జీ సిద్ధాంతాలు నేటి పాలకులకు,ప్రజలకు ఎంతో స్ఫూర్తిదాయకం అని తెలుగుదేశంపార్టీ బాపట్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ వేగేశన నరేంద్రవర్మ అన్నారు.గాంధీజీ జయంతి సందర్భంగా స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద గల గాందీ విగ్రహానికి అదివారం టిడిపి అధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ యావత్ భారతాన్ని ఎకతాటిపైకి తెచ్చి స్వాంత్ర్యం సిద్దించడంలో గాంధీ కీలక పాత్ర పోషించి దేశం పై చెరగని ముద్ర వేశారన్నారు.సామాన్య కుటుంబంలో జన్మించిన బాపూజీ తాను నమ్మిన సిద్ధాంతాల కోసం పట్టుదలగా నిలబడి అచరించి భారత్ దేశంలోనే కాకుండా ప్రపంచ చరిత్రలో తనదైన ముద్రవేశారన్నారు.ప్రపంచానికి సత్యాగ్రహం,అహింస అనే పదునైన అయుదాలను పరిచయం చేసిన మాహనుబావుడన్నారు.గాందీజీ కలలు కన్నగ్రామ స్వరాజ్యం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణపార్టీఅధ్యక్షులు వడ్లమూడి వెంకటేశ్వర్లు,విన్నకోట వీరయ్యానాయుడు,నాయకులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

**వైసిపి అధ్వర్యంలో** :గాంధీ ఆశయాలను నేటి యువత అదర్శంగా తీసుకోవాల్సి అవసరం ఏంతైనా ఉందని వైసిపి పట్టణ అధ్యక్షులు నరాలశెట్టి ప్రకాషరావు అన్నారు.గాంధీ153 జయంతి కార్యక్రమాన్ని పురస్కరించుకుని భావన్నారాయణ స్వామి దేవాలయం వద్దగల వైసిపి పట్టణపార్టీ కార్యాలయం వద్ద గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి అర్పించారు. ఈ సందర్భంగా ప్రకాషరావు మాట్లాడుతూ భారత స్వాతంత్ర కొసం తన జీవితాన్ని త్యాగం చేసిన నేత గాంధీ అని అన్నారు.ఆయన చూపించిన అహింసా మార్గం నేటి సమాజానికి ఎంతో ఉపయోగకం అన్నారు.ఆయన ఆశయాలను సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అహింసే ఆయుధంగా, సత్యాగ్రహమే సాయుధంగా రవి అస్తమించిన బ్రిటీష్ సామ్రాజ్యంలో పోరాడి ధీరుడు, మహోజ్వల స్వాతంత్ర్య ఉద్యమానికి శాంతియుతంగా నడిపించిన వ్యక్తి మహాత్మగాంధీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల పార్టీఅధ్యక్షులు కోకి రాఘవరెడ్డి,చేజర్ల నారాయణరెడ్డి, జాల్‌రెడ్డి, రాజశేఖర్,శ్రీధర్‌రెడ్డి,పిల్లి శేఖర్,కె.లక్ష్మీనారాయణ,చల్లా రామయ్య, కాగిత సుధీర్‌బాబు, సుందరరావు,వెంకటేశ్వర్లు, చేజర్ల సతీష్, అంజనేయులు,పాల్గొన్నారు.

**తహశీల్దార్ కార్యాలయంలో** :గాంధీ ఆశయసాదనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆర్ఐ సురేష్ అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వదద ఉన్న గాంధీ విగ్రహానికి గాంధీ జయంతి సందర్భంగా ఆర్ఐ సురేష్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆర్ఐ మాట్లాడుతూ భారతమాత విముక్తి కోస ం అహింసా మార్గం ద్వారా పోరాటం చేసిన గొప్ప వ్యక్తి గాంధీ అని అన్నారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కార్యాలయ సిబ్బ ంది, విఆర్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

**వ్యవసాయ కళాశాల అధ్వర్యంలో:**దేశస్వాతంత్ర్యం కోసం అహింసామార్గాన్ని ఆయుదంగా చేసుకుని బ్రిటీష్‌వారిని గడగడలాడించిన వ్యక్తి గాంధీజి అద్యాపకులు రత్నకుమారి అన్నారు. గాంధీజి 153వ జయంతి సందర్భంగా స్థానిక వ్యవసాయ కళాశాల అవరణలో ఆయన చి త్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ 20వ శతాబ ్దంలోని రాజకీయ నాయకులలో అత్యధికంగా మానవాళిని ప్రభావితంచేసిన వ్యక్తి గాంధీ అని అన్నారు. భారతదేశానికి స్వాతంత్ర ్యం తెచ్చిపెట్టిన నాయకుల్లో గాంధీజి అగ్రగణ్యుడన్నారు. అందుకే దేశప్రజలు ఆయనను జాతిపిత గా గౌరవిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రాధిక,మధుమతి,సుశీల,ప్రతిభశ్రీ, జ్యోతి,శ్రీనివాసరావు,మోహన్‌రావు,విజయ్‌కుమార్,విజయ్‌గోపాల్,శ్రీనివాసులు,తదితరులు పాల్గొన్నారు.

**ఫోరంఫర్ బెటర్ అధ్వర్యంలో** :20వ శతాబ్ధంలోనే అత్యుత్తమ వ్యక్తి గాంధీజి అని అయన జీవితం ప్రపంచానికే అధర్శమని ఫోర ంకార్యదర్శి పిసి సాయిబాబు అన్నారు.గాంధీజి 153 జయంతి సందర్భంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజి జీవన విధానాన్నిఎవ్వరూ అచరించటటం లేదన్నారు.గాంధీజి భారత దేశాన్ని ప్రపంచం ముందు గొప్ప నైతికత కల్గినదేశంగా నిలిపారన్నారు.ప్రస్తుతం ప్రపంచ ఎందుర్కొంటున్న సమస్యలకు గాంధీజీ అనాడే పరిష్కారం చూపారన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ టి సురేష్,తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది వినయ్,నవీన్,రాంప్రసాద్ ,తదిరులు పాల్గొన్నారు.







గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ వేగేశన నరేంద్రవర్మ,వైసిపి పట్టణ అధ్యక్షులు నరాలశెట్టి ప్రకాషరావు, పిసి సాయిబాబు

# భక్తిశ్రద్ధలతో గోపూజా మహోత్సవం

**పొన్నూరు, అక్టోబరు 2,ప్రభాతవార్త:** పట్టణంలోని సాక్షి శ్రీ భావనారాయణస్వామి దేవాలయ ప్రాంగణంలో వున్న గోశాల వద్ద ఆదివారం అమ్మవారి మూలా నక్షత్రాన్ని పురస్కరించుకొని గోవులకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. పలు గోవులకు శ్రీమంతాలు నిర్వహించారు. దేవీ శరన్నవరాత్రుల్లో గోపూజ చేస్తే విశేషమైన ఫలితాన్నిస్తుందని భక్తుల విశ్వాసం. దీంతో భావదేవుని ఆలయ ప్రాంగణంలోని గోశాలకు భక్తులు బారులు తీరారు. దేవాలయం వద్ద పండుగ వాతావరణం నెలకొంది. గోవులకు పూజలు చేసి కథలీఫలాలను సమర్పించారు. గోశాల నిర్వాహకులు డొక్కు వెంకటేశ్వర్లు, శ్రీను ఏర్పాట్లు చేశారు.

# యావత్ దేశాన్ని ఏకతాటిపైకి తెచ్చిన ఘనత గాంధీజీదే

**పొన్నూరు, అక్టోబరు 2,ప్రభాతవార్త:** జాతిపిత మహాత్మాగాంధీ 150వ జయంతి వేడుకలను ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, వివిధ అసోసియేషన్లు, వివిధ క్లబ్‌ల ఆధ్వర్యంలోనూ, వాడ వాడలా, గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాడు గాంధీ మహాత్ముడు స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న విషయాలు, అందరినీ ఏకతాటిపైకి తెచ్చిన పద్ధతిని వివరించారు. ప్రస్తుతం ప్రభుత్వాలు చేస్తున్న విషయాలను కూడా విశదీకరించారు.

**ఎంపిడిఓ కార్యాలయంలో....**

గాంధీ మహాత్ముని జయంతి సందర్భంగా ఎంపిడిఓ కార్యాలయంలో గాంధీ మహాత్ముని చి త్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపిడి బిఎం శేషమాంబ గాంధీజీ చెప్పిన శాంతి, సత్యం, త్యాగం వంటి విషయాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ సుధీర్, కార్యదర్శులు పాల్గొన్నారు.











**లయన్స్‌క్లబ్ స్వర్ణపురి మహిళ ఆధ్వర్యంలో....**

స్వర్ణపురి మహిళలల ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో క్లబ్ అధ్యక్షురాలు పరాశరం రంగవల్లి పాల్గొని మహనీయునికి ఘనంగా నివాళులర్పించారు. గాంధీజీవిత చరిత్రను వివరించారు. ఈ కార్యక్రమంలో మాధవి, కృష్ణకుమారి,శబలాదేవి తదితరులు పాల్గొన్నారు.

**లయన్స్ వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో.....**

వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో క్లబ్ అధ్యక్షుడు సిఎస్ఆర్కే శర్మ పాల్గొని గాంధీ మహాత్ముని జీవిత చరిత్రను వివరించారు. స్వాతంత్ర్యము నాటి పరిస్థితులను తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆకుల సాంబశివరావు, నన్నపనేని రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో.....**

మండల పరిధి కసుకర్రు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన గాంధీజయంతి వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జక్కా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మహనీయుని ఆశయ సాధన కోసమే నాటి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు మహాత్ముని విస్మరిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

**బిజెపి ఆధ్వర్యంలో.....**పట్టణంలోని తెలగపాలెం రామమందిరం వద్ద ఉన్న గాంధీమహాత్ముని విగ్రహానికి ఆ పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కలపాల శ్రీనివాసరావు, తోట జనార్ధనరావు, మొగిలిపువ్వు సాంబశివరావు, తోట ఆదినారాయణ, గోవాడ వెంకటకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

**తహశీల్దార్ కార్యాలయంలో....**తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన గాంధీజయంతి వేడుకల్లో డిప్యూటీ తహశీల్దార్ సివియల్ ఫణికుమార్ గాంధీజీచిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆనందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

**మునిసిపల్ కార్యాలయంలో....**పురపాలక సంఘ కార్యాలయంలో జరిగిన గాంధీజయంతి వేడుకల్లో కమిషనర్ డాక్టర్ నలమలపు రాధ ముఖ్య అతిథిగా పాల్గొని గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాంధీ మహాత్ముడు జాతికి చేసిన సేవలను గుర్తు చేసుకొన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మేనేజర్ తిరుమలశెట్టి వెంకట్రావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ యక్కటి హనుమాన్‌ప్రసాద్, పర్యావరణ ఇంజనీర్ గౌతమి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో**

స్వాతంత్రోద్యమంలో యావత్ భారతదేశాన్ని ఏకతాటిపైకి తీసుకువచ్చిన ఘనత మహాత్మాగాంధీజీకే దక్కుతుందని విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య అన్నారు. చేబ్రోలు మండల పరిధి వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో ఆదివారం మహాత్మాగాంధీ 153వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ రత్తయ్య మాట్లాడుతూ గాంధీజీ తాను నమ్మిన సిద్ధాంతాల కోసం ఎంతటిదాకైనా పోరాటం చేసే వ్యక్తిత్వం ఆయన సొంతమన్నారు. సాటి మనుషులతో కఠినంగా కాకుండా...మృదువుగా, సూటిగా అర్థమయ్యేటట్లు మాట్లాడడం వల్లే స్వాతంత్ర్యకాంక్ష సాధ్యమైందన్నారు. మహాత్ముడి ఆశయ సాధనకు విద్యార్థులు కృషి చేయాలన్నారు. అహింసా మార్గం ద్వారా దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన జాతిపిత మహాత్మాగాంధీ భారతదేశానికి మాత్రమే కాకుండా, అంతర్జాతీయ మార్గదర్శకుడిగా, దార్శనికుడిగా నిలిచారన్నారు. ప్రతి విద్యార్థి బాపూజీని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే దేశం ఆరోగ్యంగా ఉంటుందనే విషయాన్ని ఆనాడే చెప్పిన ఘనుడని తెలియజేశారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ వీసీ, ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ మాట్లాడారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకొన్నాయి. ఈ కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

**స్థానిక వైకాపా కార్యాలయంలో :-** జాతిపిత మహాత్మాగాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. స్థానిక వైకాపా కార్యాలయంలో ఆదివారం గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి గాంధీజీ కన్న కలలను సాకారం చేసేందుకు కృషి చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే పరిపాలనను గ్రామస్థాయి, వార్డుస్థాయికి తీసుకెళ్ళేందుకు వార్డు, గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. దీని ద్వారా ప్రజలు ప్రతి పనికి మండల కేంద్రానికి రాకుండా సరిపోయిందన్నారు. గ్రామం, వార్డులోని ప్రజలకు ఏది అవసరమైన ముందుగా వెళ్ళాల్సింది సచివాలయానికేనన్నారు. సచివాలయంలో అన్ని శాఖలకు సంబంధించిన ప్రతినిధులు ఉంటారని, ప్రజలకు అవసరమైన వాటిని వారే నేరుగా చేస్తారన్నారు. పేద ప్రజలు అభివృద్ధి చెందాలన్న గాంధీజీ ఆకాంక్షలను మన ప్రియతమ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి నిజం చేస్తూ నవరాత్నాలను ప్రవేశపెట్టి ఎందరికో పథకాల లబ్ధిని చేకూర్చే విధంగా చేస్తున్నారన్నారు. పథకాలలో అవినీతికి తావులేకుండా నేరుగా బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో నగదు పడే విధంగా చూస్తున్నారన్నారు. గతంలో పథకాలన్నీ అవినీతి మయం అయ్యాయన్నారు. కానీ సీఎం జగన్ మాత్రం ఎక్కడా అవినీతికి తావులేకుండా పాదర్శకంగా పథకాలను అమలు చేస్తున్నారన్నారు. మన యువ ముఖ్యమంత్రి ప్రస్తుతం దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. తొలుత మహాత్ముని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైకాపా జిల్లా కార్యదర్శి ఆకుల వెంకటేశ్వరరావు, అంజుమన్ కమిటివ అధ్యక్షుడు షేక్ మహమ్మద్(మామ), శ్రీ సహస్రలింగేశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి ఛైర్మన్ నాగసూరి ప్రతాప్‌కుమార్, వైకాపా ట్రేడ్ యూనియన్ పట్టణాధ్యక్షుడు వట్టిప్రోలు రంగారావు, ఆకిశెట్టి గాంధీ,మంద్రు అనిత, మోపర్తి ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

**ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో :-** దేశానికి స్వాతంత్ర్యం తేవడంలో ప్రధానభూమిక పోషించి మహనీయుడు మహాత్మాగాంధీ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని ఆర్యవైశ్య సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు బాపనపల్లి ప్రభాకర లక్ష్మీ ప్రసాదరావు అన్నారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరిగిన గాంధీమహాత్ముని జయంతి వేడుకల్లో ఆయన ప్రసంగించారు. గాంధీ మహాత్ముని జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. దేశానికి గాంధీజీ చూపించిన మార్గాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో అవ్వారు వెంకటేశ్వరరావు, ఆర్యవైశ్య సంఘం నాయకులు, వాసవిక్లబ్ నాయకులు పాల్గొన్నారు.

# మూలా నక్షత్రంతో విద్యార్థులు శ్రీసరస్వతీదేవి పూజలు

**కొల్లిపర,అక్టోబరు 2 ప్రభాతవార్త:** మండలంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.ఆదివారం మూలా నక్షత్రం కావటంతో మండలంలోని శివాలయాల్లో అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు.చదువుల తల్లికి విద్యార్థులు,మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విశేష పూజలు నిర్వహించారు.కొల్లిపరలో శ్రీగంగా పార్వతీ సమేత శ్రీముక్త్యేశ్వరస్వామి దేవాలయంలో అర్చకులు సోమరాజుపల్లి నాగరాజు శర్మ శ్రీసరస్వతీదేవిగా అలంకరణలో ఉన్న అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు.శ్రీదేవి భూదేవి సమేత శ్రీజనార్ధనస్వామి ఆలయంలో అర్చకులు పరాశరం జగన్నాధాచార్యులు అమ్మవారిని శ్రీసరస్వతీదేవిగా అలంకరించి అర్చనలు చేసి పూలతో పూజలు చేసారు.శ్రీషిర్డి సాయిబాబా మందిరంలో అర్చకులు కొల్లిపర కుమారస్వామి అమ్మవారిని శ్రీసరస్వతీదేవిగా అలంకరించి పసుపు కుంకుమలతో పూజలు నిర్వహించారు.ఆర్యవైశ్యకళ్యాణ మండపంలో శ్రీసరస్వతీదేవి అలంకరణలలో అమ్మవారు భక్తులకు దర్శన మిచ్చారు.దీంతో విద్యార్థులు,మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి విద్యార్థుల చేత అక్షరాభ్యాసం చేయించారు.అదేవిధంగా మండలంలోని వల్లభాపురం,కుంచవరం,మున్నంగి,పిడపర్రు తూములూరు,దావులూరు, హనుమాన్‌పాలెం,అత్తోట,అన్నవరం,చివలూరు గ్రామాల్లోని శివాలయాల్లో అమ్మవారిని శ్రీసరస్వతీదేవిగా అలంకరించటంతో విద్యార్థులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.పండితులు విద్యార్థుల చేత అక్షరాభ్యాసం చేయించారు.



కొల్లిపరలో శ్రీసరస్వతీదేవి అలంకరణలో అమ్మవారు

# పూర్వవిద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం

### 41 ఏళ్ళ క్రితం ఒకే పాఠశాలలో చదువున్నకున్న విద్యార్థులు


**కొల్లిపర,అక్టోబరు 2 ప్రభాతవార్త:** వారు 41 ఏళ్ళ క్రితం ఒకే పాఠశాలలో చదువున్నకున్న విద్యార్థులు..గాంధీ జయంతి రోజున అందరం ఒక చోట కలవాలను కున్నారు.ఇంతలో ఆ సమయం ఆదివారం రానే వచ్చింది.మండల కేంద్రం కొల్లిపర పాల ఉత్పత్తిదారుల కళ్యాణ



మండపంలో వేదిక వద్దకు చేరుకున్నారు.వారంతా శ్రీగాంధీజీ పాఠశాలలో (గుల్ఫోబడి) 1980 నుండి 81 వ విద్యాసంవత్సరంలో ఐదవ తరగతి చదువుకున్న విద్యార్థులు..ఒక్కొక్కరూ వస్తూనే నాటి స్నేహితులు కొందరిని గుర్తు పట్టీ పట్టలేక గుర్తుకు తెచ్చుకున్నారు.నాడు చదువుకున్న రోజుల్లో జ్ఞాపకాలు,అల్లరి చేష్టలు గుర్తుకు తెచ్చుకున్నారు.తొలుత నాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన దివంగతుడైన ప్రధానోపాధ్యాయుడు కోమటి జనార్ధనరావును స్మరించుకున్నారు.ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.తదనంతరం జరిగిన సమావేశంలో పూర్వవిద్యార్థులు తీయగూర రాజశేఖర్‌రెడ్డి,భీమిరెడ్డి పురుషోత్తమరెడ్డి,ప్యాన్సీ షాపు రవి మాట్లాడుతూ నాడు శ్రీగాంధీజీ పాఠశాలలో తమతో పాటు చదువుకున్న విద్యార్థులు ఈనాడు ఉన్నత స్థాయిలో ఉన్నట్లు చెప్పారు.శ్రీగాంధీజీ పాఠశాలలో చదువుకోవటం అందులో గాంధీ జయంతి రోజు కలవటం ఆనందాన్ని ఇచ్చిందన్నారు.కార్యక్రమంలో కంచర్ల అమృతరాజు,ఉయ్యూరు నాగిరెడ్డి,ఆరిమండ వసుంధర ,చుండూరు సావిత్రి,పుచ్చకాయల సుజాత,కూసం పద్మ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామసభలో వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తాం

**కొల్లిపర,అక్టోబరు 2 ప్రభాతవార్త:** గ్రామసభలో ప్రజలు చెప్పిన ప్రతి సమస్యను తప్పనిసరిగా పరిష్కరించటం జరుగుతుందని గ్రామ సర్పంచ్ పిల్లి రాధిక పేర్కొన్నారు.ఆదివారం మండల కేంద్రం కొల్లిపర గ్రామ పంచాయతీలో అధికారులు,ప్రజా ప్రతినిధులు గ్రామసభ నిర్వహించారు.ముందుగా ప్రజా సమస్యలు అడిగి తెలుకుని నమోదు చేసుకున్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ పిల్లి రాధిక మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగించుకోవాలన్నారు.సమస్యలు పరిష్కరించటమే గ్రామసభ యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు.కార్యక్రమంలో ఉప సర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి,పరిపాలనా అధికారి చంద్రమోహన్,ఎపిఎం ప్రియదర్శిని,సీనియర్ అసిస్టెంట్ భీమవరపు మధుసూధనరెడ్డి,గ్రామ కార్యదర్శి భార్గవ్,సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా గాంధీజి జయంతి

**మాచర్ల టౌన్, అక్టోబర్ 2, ప్రభాతవార్త :** వందల సంవత్సరాలు భారతదేశం బ్రిటీషు వారి పాలనలో ఉండి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్న నేపథ్యంలో ఎంతో మంది స్వాతంత్ర్య సమరయోధులు బ్రిటీషు వారితో ఎన్నో విధాలుగా పోరాటాలు చేశారు. మహాత్మాగాంధీజి శాంతి, సహనం ఆయుధంగా చేసుకొని ప్రజలందరినీ ఏకతాటి పైకి తీసుకొచ్చి బ్రిటీషు వారిని దేశం నుంచి వెళ్ళగొట్టారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మహాత్మాగాంధీజి 153వ జయంతి సందర్భంగా పట్టణంలోని లాడ్జిల సెంటర్‌లో, కోదండ రామాలయం వద్ద మహాత్మాగాంధీజి విగ్రహానికి పిఆర్కే పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీజి జాతిపిత అని, ప్రతి ఒక్కరూ గాంధీజిని స్మరించుకొనవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ గాంధీజి బాటలో నడవాలన్నారు. రాష్ట్రంలో ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేసిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. గాంధీజి బాటలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నడుస్తూ గ్రామ స్వరాజ్యం, సచివాలయాలను తీసుకొచ్చారన్నారు. రాష్ట్రంలో కుల, మత, రాజకీయాలకతీతంగా ప్రజలందరి సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. పాత మాచర్లలోని శ్రీవాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారి దేవాలయం వద్ద గల లక్ష్మీదేవి మిద్దెల ప్రాంతంలోని గాంధీజి విగ్రహానికి వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ అధ్యక్షులు మేడం నాగేశ్వరరావు, రీజనల్ సెక్రెటరీ తిరివీధి వెంకట నాగేశ్వరరావు, ఓరుగంటి చెన్నకేశవరావు, మహిళ అధ్యక్షురాలు మేడ వెంకట లక్ష్మి, అమ్మవారి ఆలయ అధ్యక్షులు చందోలు నాగేశ్వరరావు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పోలా శ్రీను, చిల్లంచర్ల సత్యం, యువజన సంఘం అధ్యక్షులు కంభంపాటి అమర్, వాసవి సేవా దల్, ఆటప అధ్యక్షులు జెవికెఎస్ ప్రసాద్, రాచమడుగు ప్రసాద్, ఫర్టిలైజర్ అసోసియేషన్ అధ్యక్షులు చుండూరు శ్రీను, మారం వాసు, గోపవరపు నాగేశ్వరరావు, రంగా చెన్నయ్య, కొత్తమాసు వెంకటేశ్వర్లు తదితరులున్నారు.



గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిఆర్కే

# అన్నపూర్ణేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు

**మాచర్ల టౌన్, అక్టోబర్ 2, ప్రభాతవార్త :** పట్టణంలోని సొసైటీ కాలనీలోని అన్నపూర్ణేశ్వరి అమ్మవారి ఆలయంలో న్యూటన్స్ విద్యా సంస్థల కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో ప్రతి ఏటా సరస్వతి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం అన్నపూర్ణేశ్వరి ఆలయంలో సరస్వతి అలంకరణలోని అమ్మవారికి పూజలు అనంతరం ఆలయానికి వచ్చిన వేలాది మంది భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సరస్వతిదేవిగా భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు



**కారంపూడి, అక్టోబర్ 2, ప్రభాతవార్త :** దసరా నవరాత్రి మహోత్సవాలు మండలంలో ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం అమ్మవారు సరస్వతిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కారంపూడిలోని శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారి దేవాలయం, వీర్లంకమ్మ దేవాలయం, శ్రీలక్ష్మి చెన్నకేశవ స్వామి దేవాలయం, శ్రీ షిరిడి సాయి మందిరం, సత్యసాయి మందిరాలలో నవరాత్రుల మహోత్సవాలు జరుగుతున్నాయి. నవరాత్రుల మహోత్సవాల సందర్భంగా దేవాలయాలలో మహిళలు కుంకుమ పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థాన అర్చకులు దిలీప్‌కుమార్ ఆచార్యులు, సత్యనారాయణాచార్యులు, సంజీవశర్మ, మణికంఠ, యలమంద శర్మలు దేవాలయానికి వచ్చినభక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయా దేవాలయాల కమిటీ సభ్యులు చీతిరాల వెంకట కోటేశ్వరరావు, మిత్తింటి సాంబశివరావు,ఆతుకూరి సురేష్, యేచూరి శంకర్‌రావు, వెచ్చా వరలక్ష్మణరావు, తుమ్మేపల్లి నాగేశ్వరరావు, గణితి అమరయ్య దేవాలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు. దేవాలయాలను విద్యుత్ కాంతులతో అలంకరించారు. సాయి మందిరంలో నవరాత్రుల సందర్భంగా లక్కీడీప్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. సరస్వతి ఆలంకారంలో ఆయా దేవాలయాలలో చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు, బలపాలు, పలకలు అందజేశారు.

# ఘనంగా గాంధీ జయంతి

**కారంపూడి, అక్టోబర్ 2, ప్రభాతవార్త :** జాతిపిత మహాత్మాగాంధీ 153వ జయంతి వేడుకలు మండలంలో ఘనంగా జరిగాయి. గాంధీబొమ్మసెంటర్‌లో జాతిపిత మహాత్మాగాంధీ , పొట్టి శ్రీరాముల విగ్రహాలకు ఆర్యవైశ్య సంఘం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు చీతిరాల వెంకట కోటేశ్వరరావు, వెలుగూరి శ్రీనివాసరావు, సూరె ఆంజనేయులు, గోపి తదితరులు పాల్గొనగా, మండల పరిషత్ కార్యాలయం వద్ద మహాత్మాగాంధీ విగ్రహానికి ఎంపీపీ మేకల శారద శ్రీనివాసరెడ్డిపూలమాలలు వేసి నివాళులర్పించారు. మహత్మాగాంధీజి మన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటీసి షేక్ షఫి, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, ఈఓపిఆర్‌డి సత్యప్రకాష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ వెంకటేష్, పంచాయితీ రాజ్ ఎఈ శ్రీలత తదితరులున్నారు.

**దుర్గి లో.....** మహాత్మాగాంధీ 153వ జయంతి వేడుకలు ఆదివారం దుర్గి మండలంలో ఘనంగా జరిగాయి. సచివాల యాలు, పంచాయితీ కార్యాల యాల వద్ద గాంధీ విగ్రహానికి పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయన భారత జాతికి అందించిన సేవలను కొనియాడారు. దుర్గి సచివాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ జరిగింది. ఉపాధిహామి పనులపై గ్రామసభలు నిర్వహించి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను ఆమోదించారు. కార్యక్రమంలో ఎంపిపి ఏచూరి సునీతాసాయిశంకర్, మార్కెట్‌యార్డు చైర్మన్ వెలిదండి గోపాల్, దుర్గి సర్పంచ్ చాట్ల శాంతరమేష్, ముటుకూరు సర్పంచ్ తోటకూర వెంకటనర్సమ్మ నాగేవ్వరరావు, ఎగటీల బుచ్చిబాబు, చెన్నుపాటి సీతారామయ్య, విఆర్వో కోటేశ్వరరావు, పంచాయితీ సెక్రటరీ వెంకటేష్, సైదులు, ఉపాధిహామి ఎపివో వెంకటేశ్వర్లు, సచివాలయ, పంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న మార్కెట్‌యార్డు చైర్మన్

# పౌర్ణమి సందర్భంగా అరుణాచలానికి ఆర్టీసీ సర్వీసులు

**నరసరావుపేట, అక్టోబర్ 2 ప్రభాతవార్త :** నరసరావుపేట డిపో నుండి పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక బస్ సర్వీసులు ఏర్పాటు చేస్తున్నట్లు డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి ఆదివారం తెలిపారు. పట్టణ, పరిసర గ్రామాల నుండి భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. అరుణాలయం గిరి ప్రదక్షిణ కొరకు స్పెషల్ హైటెక్ బస్సును ఏర్పాటు చేశామన్నారు. ఈ బస్సు 7వతేదీ రాత్రి 10 గంటలకు నరసరావుపేట డిపో నుండి బయలుదేరుతుందన్నారు. శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం, గోల్డెన్ టెంపుల్ చూసుకుంటూ అరుణాచలం వెళ్తుందన్నారు. తిరిగి 9వతేదీ సాయంత్రం బయల్దేరి నరసరావుపేటకు 10వతేదీ ఉదయం 4 గంటలకు చేరుకుంటుందన్నారు. ఒక్కొక్కరికి రూ.2750లు టిక్కెట్ ధర ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇతర వివరాలకు : 9959225428 నెంబర్‌ను సంప్రదించాలని డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి విజ్ఞప్తి చేశారు.

# జాతిపిత గాంధీజీకి పాలాభిషేకం



**నకరికల్లు, అక్టోబర్ 2 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన నకరికల్లులో ఆదివారం జాతిపిత గాంధీజీకి మాజీ ఎంపిపి, జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు నాగోతు శౌరయ్య పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా శౌరయ్య మాట్లాడుతూ దేశానికి గాంధీజీ, లాల్‌బహదూర్‌శాస్త్రీలు అందించిన సేవలు, వారి జీవితాల్లో చేసిన త్యాగాలు దేశం ఎప్పటికీ మరువవదన్నారు. వారు చూపిన అడుగుజాడల్లో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్ర పాలన చేశారని గుర్తు చేశారు. అదే విధంగా గాంధీజీ ధ్యేయమైన గ్రామ స్వరాజ్యం లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ ముందుకు వెళ్తుందన్నారు. గడిచిన మూడేళ్ళ కాలంలో అధికారపార్టీ గ్రామాలలో ఎటువంటి అభివృద్ధి చేయలేదన్నారు. గ్రామ పంచాయితీ నిధులను తమ సొంత పథకాలకు వినియోగించడం వలన గ్రామాలలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. గ్రామాలు తిరిగి సస్యశ్యామలంగా ఉండేందుకు, అభివృద్ధి పథంలో నడిచేందుకు చంద్రబాబునాయుడును తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాలని నాగోతు శౌరయ్య పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఆలీబాషా, మహానంది, గోపి, శ్రీహరి, నాసరయ్య, కాశీ పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లా వార్త



పెదకూరపాడు, గురజాల , మాచర్ల , చిలకలూరిపేట , నరసరావుపేట, వినుకొండ, సత్తెనపల్లి,

# కొండవీడు ఇ.యన్.టి.వైద్యశాలలో ఉచిత వైద్య శిబిరం

**నరసరావుపేట, అక్టోబర్ 2 ప్రభాతవార్త :** గాంధీజయంతి సందర్భంగా కొండవీడు ఇ.యన్.టి.వైద్యశాలలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వైద్య శిబిరాన్ని ప్రారంభించి గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ గాంధీజయంతిని పురస్కరించుకొని గత 22 సంవత్సరాలుగా ఉచిత వైద్యసేవలు అందించడం అభినందనీయమన్నారు. జనవరి 26, అక్టోబర్ 2, ఆగస్టు 15 తేదీలలో డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాలను చేపట్టడం సంతోషమని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. వైద్యశాల ఛైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ అత్యాధునిక పరికరాలతో తమ వైద్యశాలలో ఉచిత వైద్యసేవలను అందిస్తున్నామని, ప్రతి ఏడాది జాతీయ పర్వదినాలలో ప్రజలకు ఈ అవకాశాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. వైద్య శిబిరంలో 170 మంది రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించామన్నారు. 30 మందిని ఎంపిక చేసి వారికి ఉచితంగా శస్త్ర చికిత్స చేస్తామన్నారు. రూ.1.50 లక్షల ఖరీదు మందులను ఉచితంగా అందించామని డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ శ్రీవర్షిణి, రవికుమార్, మణికంఠ, భూలక్ష్మి, మేనేజర్ మహేష్, అశోక్, ఫార్మసిస్ట్ స్వామి తదితరులు పాల్గొన్నారు.



ఉచిత వైద్యశిబిరం ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

# తెదేపా మినీమహానాడుకు స్థల పరిశీలన

**నరసరావుపేట, అక్టోబర్ 2 ప్రభాతవార్త :** తెలుగుదేశంపార్టీ పల్నాడు జిల్లా మినీమహానాడును ఈ నెల 12న ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, జిల్లా అధ్యక్షులు జి.వి.ఆంజనేయులు, నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు, జిల్లా నాయకులు నాగోతు శౌరయ్య, నల్లపాటి రాము, కొల్లి బ్రహ్మయ్యలు తెలియజేశారు. మినీమహానాడుకు సంబంధించిన సభా స్థలిని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా వచ్చే అవకాశం ఉన్నందున సత్తెనపల్లిరోడ్డులో మినీమహానాడును ఏర్పాటు చేసేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. ఇస్సపాలెం గ్రామ పరిధిలోని రోడ్డు ప్రక్కనే ఉన్న 30 ఎకరాలకు పైగా ఉన్న వ్యవసాయ క్షేత్రంలో ఈ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు నిర్ణయించామన్నారు. మహానాడును విజయవంతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. 12న బహిరంగ సభ, 13న పల్నాడు జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల టిడిపి నాయకులతో పార్టీ అధినేత చంద్రబాబునాయుడు సమావేశమవుతారని తెలిపారు. పల్నాడులో మినీమహానాడు సందర్భంగా జరిగే నారా చంద్రబాబునాయుడు పర్యటనకు ప్రజల నుండి మంచి స్పందన కనిపిస్తుందన్నారు. పల్నాడు జిల్లా ఏర్పడిన తర్వాత తొలిసారిగా జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ నేతలు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణరాజు, కొట్టా కిరణ్, కుమ్మెత కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మినీమహానాడుకు స్థల పరిశీలన కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు


# ఎమ్మార్పీయస్ ఆమరణ దీక్షకు పలువురు మద్దతు

**నరసరావుపేట, అక్టోబర్ 2 ప్రభాతవార్త :** ఆంధ్రా ఎమ్మార్పీయస్ అధ్యక్షులు కాల్వ రవి ఆధ్వర్యంలో ఆదివారం మూడవ రోజు నిర్వహించిన ఆమరణ దీక్షకు పలువురు నాయకులు మద్దతు తెలిపారు. అంబేద్కర్ చిత్రపటాన్ని ఇండియన్ కరెన్సీపై ముద్రించాలని డిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న పోరాటం న్యాయమైందని మద్దతు తెలియజేసిన ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్, ఎంఐఎం నాయకులు మౌలాలి, కరిముల్లా, బిజెపి నాయకులు రంగిశెట్టి రామకృష్ణ, ఇత్తడి కిరణ్, మాజీ కౌన్సిలర్ మురళి, పాలపర్తి వెంకటేశ్వరరావు తదితరులు సంఘీభావం తెలియజేశారు. తొలుత పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొని సంఘీభావం తెలిపిన వారికి కాల్వ రవి కృతజ్ఞతలు తెలియజేశారు.

# గ్రామ స్వరాజ్యమే గాంధీజీ లక్ష్యం

**నరసరావుపేట, అక్టోబర్ 2 ప్రభాతవార్త :**

**గ్రామ స్వరాజ్యమే గాంధీజీ లక్ష్యం : టిడిపి**



టిడిపి ఆధ్వర్యంలో గాంధీజీ జయంతి వేడుకలను పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు, నల్లపాటి రాము, డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, గొట్టిపాటి జనార్ధన్‌బాబు తదితరులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ సిఎం చంద్రబాబు పాదయాత్రను గాంధీజీ జయంతి రోజున నిర్వహించారని, ఆ పాదయాత్ర ప్రారంభించి పది సంవత్సరాలు గడిచిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం పంచాయితీ నిధులను వేరే పథకాలకు దారి మళ్ళిస్తున్నాయని తెలిపారు. గ్రామ స్వరాజ్యం రావాలంటే చంద్రబాబునాయుడు తిరిగి సిఎం కావాలని డాక్టర్ అరవింద్‌బాబు, నల్లపాటి రాము తదితరులు అన్నారు.

**జనసేన పార్టీ కార్యాలయంలో...**

జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సయ్యద్ జిలానీ, నాయకులు జి.వి.ఎస్.ప్రసాద్, అద్దేపల్లి ఆనంద్, గుప్తా శ్రీకాంత్, షేక్.అష్రూఫ్, మిరియాల సోము తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిలానీ మాట్లాడుతూ విదేశీ వద్దు స్వదేశీ ముద్దు అనే చేనేతలకు ప్రాచుర్యాన్ని గాంధీజీ కల్పించారని తెలిపారు. శాంతి సమానత్వం గాంధీజీ ఇచ్చిన సందేశమని ఈ సందర్భంగా వివరించారు.



**బిజెపి ఆధ్వర్యంలో...**

బిజెపి అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ రంగిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో గాంధీజీ, లాల్‌బహదూర్‌శాస్త్రీ జయంతి వేడుకలను నిర్వహించారు. గాంధీజీ కలలు కన్న పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన భారత్‌ను ప్రధాని నరేంద్రమోడీ తీసుకువచ్చారని తెలిపారు. లాల్‌బహదూర్‌శాస్త్రీ జై జవాన్ జై కిసాన్ అనే నినాదంతో వ్యవసాయ, రక్షణ రంగంలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకువచ్చారని తెలిపారు. ఆ మహనీయుల జీవితాన్ని దేశానికి, ప్రపంచానికి ఆచరణీయమని రంగిశెట్టి రామకృష్ణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇత్తడి కిరణ్, జిలానీ, చంద్రశేఖర్, గుప్తా తదితరులు పాల్గొన్నారు.



# స్వాతంత్ర్య పోరాటంలో మహాత్ముని సేవలు మరువలేనివి

**వినుకొండ, అక్టోబర్2, ప్రభాతవార్త:** దేశ స్వాతంత్ర్య పోరాట చరిత్రలో జాతిపిత మహాత్మాగాంధీజీ అనుసరించిన అహింసా మార్గం, అందించిన సేవలు ఎంతో గొప్పవని గాంధీజీ స్ఫూర్తిగా పౌరులు, పాలకులు సమాజాభివృద్ధికి పాటుపడాలని మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లిఖార్జునరావు అన్నారు. ఆదివారం మహాత్మాగాంధీజీ 153వ జయంతి సందర్భంగా పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద గాంధీజీ కాంస్య విగ్రహానికి మక్కెన పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మక్కెన మాట్లాడుతూ సత్యం, అహింసా మార్గాల్లో గాంధీజీ సాధించిన విజయాలు నేటికి ప్రపంచానికి ఆదర్శవంతంగా నిలుస్తున్నాయని అన్నారు. ఉప్పుసత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాలతో ప్రతి భారతీయుడిలో స్వాతంత్ర్య కాంక్ష ప్రేరేపించి ఆనాటి బ్రిటిషర్లను దేశం విడిచిపెట్టిపోయేలా చేయడంలో గాంధీజీ ముఖ్య భూమిక పోషించారని కొనియాడారు. గాంధీజీ కలలు కన్న సమాజం కోసం ప్రతి భారతీయుడు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘం నాయకులు గుడివాడ గురునాథం, రెడ్డి వెంకటరత్నం, ముత్తినేని గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.



# అంగరంగ వైభవంగా దేవీ శరన్నవరాత్రులు

**వినుకొండ, అక్టోబర్2, ప్రభాతవార్త:** శాంతి ఆశ్రమ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని విఠంరాజుపల్లి గ్రామంలోని సాయి బృందావనం వద్ద దేవీ శరన్నవరాత్రులు ఘనంగా జరుగుతున్నాయి. లోక కళ్యాణార్ధం పూజ్య శ్రీ హిమాలయ గురుదేవులు ఆధ్వర్యంలో 9 రోజుల పాటు మహా చండీయాగం కొనసాగుతుంది. ఆదివారం అమ్మవారు సరస్వతీదేవిగా భక్తుల పూజలు అందుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. జిల్లా తెదేపా అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు జీ.వీ ఆంజనేయులు ఆయన సతీమణి శివశక్తి ఫౌండేషన్ ఛైర్మన్ గోనుగుంట్ల లీలావతి దంపతులు మహాచండీయాగంలో పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని కోరుకున్నారు. రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలని ప్రజల కష్టాలు తొలగిపోవాలని, అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని అన్నారు.



# వైకాపా పాలనలో గాంధీజీ గ్రామ స్వరాజ్యానికి తూట్లు

**వినుకొండ, అక్టోబర్2, ప్రభాతవార్త:**

మహాత్మాగాంధీజీ జయంతి పురస్కరించుకొని పట్టణంలోని ఎంపిడివో కార్యాలయం వద్ద గల జాతిపిత విగ్రహానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు టీడీపీ సీనియర్ నాయకులు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంలో గాంధీజీ పోషించిన పాత్ర ఎంతో కీలకమన్నారు. గ్రామాలు సంపూర్ణంగా అభివృద్ధి చెందితేనే దేశం అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడుస్తుందనే గాంధీజీ భావనలకు నేడు వైకాపా ప్రభుత్వం తూట్లు పొడుతుందని చెప్పారు. గ్రామ పంచాయతీ పాలనను పూర్తిగా నిర్వీర్యం చేసి గ్రామాల అభివృద్ధి కుంటుపడేలా చేశారని పేర్కొన్నారు. పంచాయతీ నిధులను, గ్రామాల అభివృద్ధికి కేంద్రం నుంచి వచ్చే నిధులను వైకాపా దారిమళ్ళిస్తుందని ఇది రాజ్యాంగవిరుద్ధమని తెలిపారు. సర్పంచ్‌ల అధికారులను పునరుద్ధరించాలనే 11 డిమాండ్లతో కూడిన వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి షమీమ్‌ఖాన్, వినుకొండ పట్టణ అధ్యక్షులు పి.వి సురేష్‌బాబు, నాయకులు మోటుమర్రి నరసింహారావు, రోడ్డా వీరాంజనేయరెడ్డి, సర్పంచ్‌లు గోనుగుంట్ల శ్రీనివాసరావు, మల్లిఖార్జునరావు, వెనిగంట్ల రమాదేవి ఆంజనేయులు, గోనుగుంట్ల వెంకటేశ్వర్లు, నడింపల్లి శ్రీనివాసరావు, బత్తుల గోవిందరాజులు, పువ్వాడ కృష్ణ, పువ్వాడ నాగేశ్వరరావు, వీరగంధం ప్రశాంత్, నాగార్జున, ప్రసాద్, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ పేరు తీసేయ్యడం హేయమైన చర్య

**వినుకొండ, అక్టోబర్2, ప్రభాతవార్త:** హెల్త్ యూనివర్శిటికి ఎన్టీఆర్ పేరు కొనసాగించాలని డిమాండ్ చేస్తూ టీడీపీ ఆధ్వర్యంలో పట్టణంలోని స్థూపం సెంటర్ వద్ద చేపట్టిన నిరాహార నిరసన దీక్షలు ఆదివారం కొనసాగాయి. బొల్లాపల్లి మండల టీడీపీ అధ్యక్షులు జరపాల గోవిందునాయక్, టీడీపీ తెలుగు రైతు సంఘం నాయకులు, సీనియర్ నాయకులు పెమ్మసాని నాగేశ్వరారవు, పెసల వెంకటనారాయణ, మేరా జ్యోతి హనుమాన్ నాయక్, బారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, అర్ధలపూడి శ్రీనివాసరావు, సక్రు నాయక్, రావూరి నారాయణ, రాచమల్ల కొండలు, గోవింరాజులు, యలిశెట్టి రంగయ్య, బొమ్మనబోయిన వెంకటకోటయ్య, షేక్ ఖాసిం, హనుమాన్‌నాయక్, కనకరాజు, నాసరయ్య, రమణయ్య తదితరులు ఈ దీక్షల్లో పాల్గొన్నారు. జిల్లా తెదేపా అధ్యక్షులు జీ.వీ ఆంజనేయులు దీక్షల్లో పాల్గొన్న బొల్లాపల్లి మండల నాయకులకు పూలదండలు వేసి సంఘీభావం తెలిపారు. జీ.వీ మాట్లాడుతూ రాష్ట్రంలో వైకాపా దుష్ట పరిపాలన చేస్తుందని, ప్రభుత్వం పూర్తిగా ప్రజా సమస్యలను, అభివృద్ధిని గాలికొదిలేశారన్నారు. హెల్త్ యూనివర్శిటికి ఎన్టీఆర్ పేరు తీసేయడం హేయమైన చర్య అని అన్నారు. శివశక్తి ఫౌండేషన్ ఛైర్మన్, జీ.వీ ఆంజనేయులు సతీమణి, గోనుగుంట్ల లీలావతి దీక్షల్లో పాల్గొన్న వారికి సాయంత్రం వేళ నిమ్మరసం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్టీఆర్ అంటే పేరు మాత్రమే కాదని కోట్లమంది ఆరాధించే దైవం అని అన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఎన్టీఆర్‌ను ప్రజలను కించపరిచేలా ఉందని తక్షణమే ప్రభుత్వ నిర్ణయం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# సామూహిక అక్షరాభ్యాసం

**దుర్గి, అక్టోబర్ 2, ప్రభాతవార్త :**

అడిగొప్పల శ్రీనిదానంపాటి శ్రీలక్ష్మీఅమ్మవారి సన్నిధిలో ఆదివారం సామూహిక అక్షరాభ్యాసం జరిగింది. శ్రీదేవి శరన్నవరాత్రుల్లో భాగంగా 7వ రోజు ఆదివారం అమ్మవారిని సరస్వతి అలంకరణలో భక్తులకు దర్శనం ఇప్పించారు. చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేశారు. వేద పండితులతో సరస్వతి హోమం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి పల్లకిసేవ జరిగింది. అమ్మవారి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీగిరిరాజు నరసింహబాబు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.



# ప్రజలందరికీ అదర్శప్రాయుడు మహాత్మాగాంధీ

**వెల్దుర్తి, అక్టోబర్ 2, ప్రభాతవార్త :** మహాత్మా గాంధీజి జాతిపిత అని, ప్రతి ఒక్కరూ గాంధీజిని స్మరించుకోవాలని, ప్రతి ఒక్కరూ గాంధీజి బాటలో నడవాలని టిడిపి రాష్ట్ర నాయకులు కుర్రి శివారెడ్డి అన్నారు. ఆదివారం గాంధీజి 153వ జయంతి సందర్భంగా మండలంలో గాంధీజి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ వారిని తరిమికొట్టి భారతదేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చారన్నారు. రాష్ట్రంలో ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం టీడీపి అధినేత చంద్రబాబునాయుడు ఎంతగానో కృషి చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఎపిని ప్రపంచ స్థాయిలో పేరు తీసుకొచ్చి విద్యార్ధులకు కంప్యూటర్ ఉద్యోగాలు తీసుకొచ్చిన ఘనత ఆయనదేనన్నారు. దేశంలో ఆంధ్రాకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారన్నారు. రాష్ట్రంలో అనేక ప్రాజెక్టులు, సాఫ్ట్‌వేర్ రంగంలో అభివృద్ధి తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## గాంధీ శాంతియుత మార్గం భవిష్యత్తు తరాలకు మార్గదర్శకం

**నరసరావుపేట, అక్టోబర్ 2 ప్రభాతవార్త :** గాంధీ చూపిన శాంతియుత మార్గం నేటి తరాలకు, భవిష్యత్తు తరాలకు ఆచరణీయమని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రీ జయంతి కార్య క్రమాల్లో ఎమ్మెల్యే గోపిరెడ్డితో పాటు జాయింట్



కార్యక్రమంలో ఎమ్మెల్యే గోపిరెడ్డి, అధికారులు, పట్టణ ప్రముఖులు

కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోపిరెడ్డి, అధికారులు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇరువురు మహనీయులు దేశానికి కుడి, ఎడమ భుజాలని తెలిపారు. వారి జీవితాలే సమాజానికి పాఠ్యాంశాలు అని తెలిపారు. క్రమశిక్షణ, గాంధేయవాదంతో స్వాతంత్ర్యం కోసం నిర్వహించిన ఉప్పు సత్యాగ్రహం, విదేశీ వస్తు బహిష్కరణ, సహాయ నిరాకరణ వంటి ఎన్నో ఉద్యమాలు ఆంగ్లేయుల ఆధిపత్యాన్ని తగ్గించాయని తెలిపారు. ఇప్పటికీ అనేక ప్రపంచ విశ్వ విద్యాలయాల్లో గాంధీజీ ఐడియాలజీని అనుసరిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లు అన్నారు. ఈ కార్య క్రమంలో ప్రముఖులు మిట్టపల్లి రమేష్, మద్ది రామబ్రహ్మానందరావు, మాగులూరి రమణారెడ్డి, బత్తుల మురళి, కమిషనర్ డి.రవీంద్ర, అధికారులు పాల్గొన్నారు.

## టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహావిష్కరణ విజయవంతం

**నరసరావుపేట, అక్టోబర్ 2 ప్రభాతవార్త :** టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహావిష్కరణ కార్యక్రమం విజయవంతమైందని బ్రాహ్మణ సేవా సంఘం కార్యదర్శి కె.వెంకట పురుషోత్తమరావు, ముత్తనపల్లి శివకృష్ణప్రసాద్‌లు ఆదివారం కృతజ్ఞతలు తెలిపారు. విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి, మాజీమంత్రి కాసు వెంకట కృష్ణారెడ్డికి, టంగుటూరి గోపాలకృష్ణకు, కె.బలరామకృష్ణమూర్తికి, పిన్నెల్లి వెంకట రామిరెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. అదే విధంగా ఉమ్మడి గుంటూరు జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన బ్రాహ్మణ సోదర సోదరీమణులకు సంఘం కార్యదర్శి కె.వి.పురుషోత్తమరావు కృతజ్ఞతలు తెలిపారు.

## కృష్ణానదిలో కర్రె హర్షవర్ధన్ గల్లంతు



**కొల్లిపర,అక్టోబరు 2 ప్రభాతవార్త:** ప్రమాదవశాత్తు కృష్ణానదిలో ఓ యువకుడు గల్లంతైన సంఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది.వివరాల్లో వెళితే తెనాలికి చెందిన కర్రె హర్షవర్ధన్ (21) తన తోటి స్నేహితులతో కలసి కొల్లిపర సమీపంలోని కృష్ణానదికి చూడటానికి వెళ్ళాడు..హర్షవర్ధన్ ప్రమాదవశాత్తు కాలుజారి నదిలో కొట్టుకు పోయాడు..ఈ విషయాన్ని తోటి స్నేహితులు కొల్లిపర పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఎస్ఐ కి పిర్యాదు చేసారు.వెంటనే ఎస్ఐ రవీంద్రరెడ్డి సంఘటనా స్థలానికి వెళ్ళి హర్షవర్ధన్ కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

## కొల్లిపరలో ఘనంగా గాంధీ జయంతి

**కొల్లిపర,అక్టోబరు 2 ప్రభాతవార్త:** మహాత్మాగాంధీ 153 వ జయంతిని మండల గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు.గాంధీ చిత్ర పటాలకు,నాయకులు,ప్రజా ప్రతినిధులు,అధికారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.మండల కేంద్రం కొల్లిపర మండల రెవిన్యూ కార్యాలయం అవరణలో ఉన్న గాంధీజీ విగ్రహానికి ఎంపిపి భీమవరపు పద్మావతి,పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చిత్ర పటాలను సర్పంచ్ పిల్లి రాధిక పూలమాలలు వేషి ఘన నివాళులు అర్పించారు.అదేవిధంగా ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి




సంఘ అధ్యక్షుడు అన్నవరపు రమేష్‌తో పాటు పలువురు నాయకులు పూలమాలలు వేశారు.ఆయా కార్యక్రమంలో ఉప సర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి,పరిపాలనా అధికారి చంద్రమోహన్,వైసీపి నేత భీమవరపు సంజీవరెడ్డి,పిల్లి గంగాధరరావు,ఎపిఎం ప్రియదర్శిని,సీనియర్ అసిస్టెంట్ భీమవరపు మధుసూధనరెడ్డి,కార్యదర్శులు భార్గవ్,మాధురి,ఉషా సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు

**యడ్లపాడు, అక్టోబర్ 2, ప్రభాతవార్త :** శరన్నవరాత్రులలో భాగంగా అరవ ఏడవ రోజు చదువుల తల్లి సరస్వతీ దేవి రూపంలో అమ్మవారు అదివారం భక్తులకు దర్శనమిచ్చారు. బుద్ధిప్రదాయిని అయిన సరస్వతీ రూపంలో అమ్మవారిని దర్శించుకొని అరాధిస్తే బుద్ధి వికాసం, విద్యాలాభం కలుగుతాయని భక్తుల విశ్వాసం. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా





మండల పరిధిలోని బోయపాలెం, తిమ్మాపురం, యడ్లపాడు, కొత్తపాలెం, లింగారావుపాలెం గ్రామాలలోని పార్వతీదేవి అమ్మవార్ల దేవాలయాలలో ఉదయం నుండే భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## సర్వమత సమానత్వం గాంధీమార్గం

### --ప్రభుత్వ విప్,ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్

**గుంటూరు కల్చరల్, అక్టోబర్ 2, ప్రభాతవార్త :** సర్వమత సమానత్వమే మహాత్మాగాంధీ మార్గమని ప్రభుత్వ ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ పేర్కొన్నారు.మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా స్థానిక కాటన్ అసోసియేషన్ హాల్లో ఆదివారం తెలుగునాట గాంధీ బాట,గాంధీ సిద్దాంతాలు నేటి అవశ్యకతపై సదస్సు జరిగింది.ఈ సదస్సుకు ప్రొఫెసర్ ఏ.సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ప్రొఫెసర్ రఘురామ రాజు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య




వరప్రసాద్ మాట్లాడుతూ అన్ని మతాలను గౌరవించడం మహాత్మాగాంధీ దృష్టిలో నిజమైన జాతీయవాదమని కానీ ఇప్పుడు మైనార్టీ మతస్తులను చంపడమే జాతీయవాదం గా పరిగణించబడుతుందని ఆవేదన వ్యక్తంచేశారు.గాంధీ కోరుకున్న గ్రామ స్వరాజ్యం ఆదర్శవంతమైందన్నారు.కానీ ఇప్పుడు ప్రపంచంలోనే అపర కుబేరులుగా పిలవబడుతున్న ఒకరిద్దరు భారతీయులు ఎటువంటి శ్రమ చేయకుండా,ఏ సరుకు ఉత్పత్తి చేయకుండా ప్రపంచంలోనే అత్యంత ధనవంతులుగా మారారని వివరించారు.మహాత్మాగాంధీ ఇటువంటి ఆర్థిక అసమానతలను కోరుకోలేదని పైగా వ్యతిరేకించారని తెలిపారు.మహాత్మాగాంధీపై అనేక దేశాల్లో విస్తృత అధ్యయనం జరుగుతుందని తెలిపారు.మహాత్మాగాంధీ సిద్దాంతాలను ప్రచారం చేయడమే తమ అమరావతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషన్ సైన్సెస్ ముఖ్య లక్ష్యమన్నారు.దేశప్రజలంతా మహాత్మాగాంధీ మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు.ప్రొఫెసర్ అట్లూరి రఘురామరాజు మాట్లాడుతూ మహాత్మా గాంధీ తన గురువుగా నోబెల్ బహుమతి గ్రహీత,విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్‌ను స్వీకరించారని తెలిపారు.ప్రొఫెసర్ ఎన్.సతీష్ వందన సమర్పణ చేశారు.కార్యక్రమంలో ప్రొఫెసర్‌లు ఎన్.అంజయ్య,జగన్నాధరావు,కర్ణం మురళీ,కట్టప్ప ఉదయభాస్కర్,దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకులు కొరివి వినయ్‌కుమార్,బి.విజయ భాస్కర్,బి.శ్యాంబాబు,బత్తుల కోటేశ్వరరావు,ఎంజెజెఎస్ నాయకులు పరంగి సత్తిరాజు పాల్గొన్నారు.

# పలుపార్టీల ఆధ్వర్యంలో జాతీపిత మహాత్మాగాంధీ 153వ జయంతి

**చిలకలూరిపేట, ఆక్టోబరు2,ప్రభాతవార్త:** ఎంతోమంది త్యాగధనుల త్యాగఫలాలు నేడు మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్య ఫలాలు అని మాజీమంత్రి రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి అన్నారు. పూజ్యబాపూజీ, లాల్ బహదూర్ శాస్త్రి దేశానికి చేసిన త్యాగాలను స్మరించుకుంటూ వారి జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ప్రత్తిపాటి టిడిపి కార్యాలయంలో ఆదివారం వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, నెల్లూరి సదాశివరావు, షేక్ కరిముల్లా, జవా వ్రజి మదన్‌మోహన్, బండారుపల్లి సత్యనారాయణ,ముద్దన నాగేశ్వరరావు, షేక్ అజారుద్దిన్, ఇనగంటి జగదీష్‌బాబు, కొండా వీరయ్య, గంగా శ్రీనివాస రావు,కె వీరారెడ్డి, మద్దిబోయిన శివ, తుపాకుల అప్పారావు, షేక్ జమాల్‌భాష, పఠాన్ సమద్‌ఖాన్, షేక్ జరీనా సుల్తానా, షేక్ నజీరున్నీసాబేగం, గుర్రం నాగపూర్ణచంద్రరావు, పోపూరి లక్ష్మీ, చేవూరి కృష్ణమూర్తి, కొత్త కోటేశ్వరరావు, భీమవరపు సుబ్బారావు, మారెళ్ల అప్పారావు, యస్ శ్రీనివాసరావు, ఆరె మల్లిఖార్జునరావు, టిడిపి కౌన్సిలర్లు, అన్ని హోదాలలోఉన్న పార్టీనాయకులు పాల్గొని గాంధీజీ, లాల్ బహుదూర్ శాస్త్రి చిత్రపటాలకు నివాళులు అర్పించారు. వైసిపి కార్యాలయంలో గాంధీజీ, లాల్‌బహుదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పార్టీనాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ షేక్ రఫాని, వైస్ ఛైర్మన్ వలేటి వెంకటేశ్వర్లు, పార్టీనాయకులు విడదల గోపి, కాట్రగడ్డ మస్తాన్‌రావు, పఠాన్ తలహాఖాన్, కోటానాయక్, షేక్ దరియావలి, షేక్ అలీమియా, తోట బ్రహ్మస్వాములు, బాలకోటినాయక్, గుంజి వీరాంజనేయులు, కొప్పురావూరి నాగేశ్వరరావు, బేరింగ్ మౌలాలి, పెన్నా సాంబశివరావు, పోలిశెట్టి మస్తాన్, మణిదీప్, వివిధ హోదాలలో ఉన్న పార్టీనాయకులు పాల్గొని నివాళులు అర్పించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో పూజ్యబాపూజీ, లాల్‌బహుదూర్ శాస్త్రి చిత్రపటాల కు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి యం రాధాకృష్ణ, పార్టీ నాయకులు కె కోటేశ్వరరావు, షేక్ కరిమూన్, అమర్, ఉమర్‌అలి, వెంకటరత్నం, తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు. మున్సిపల్ కార్యాలయంలో గాంధీజీ, లాల్ బహుదూర్ శాస్త్రి చిత్రపటాలకు మున్సిపల్ ఛైర్మన్ షేక్ రఫాని, మున్సిపల్







కమీషనర్ చుక్కల గోవిందరావు, మున్సిపల్ సిబ్బంది పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జనసేన ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీజీ విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన జిలా్ల కార్యదర్శి తోట రాజారమేష్, పార్టీనాయకులు ఖాదర్‌భాష, మల్లా కోటి, మునీర్‌హసన్, స్టీల్ అంజి, కొటేశ్వరమ్మ, పార్టీనాయకులు పాల్గొని నివాళులు అర్పించారు. లోక్‌సత్తా ఆధ్వర్యంలో పట్టణంలోని బాపూజీ వృద్దాశ్రమంలో మహాత్మాగాంధీ చిత్రపటానికి లోక్‌సత్తా నాయకుడు





మాదాసు భానుప్రసాద్, మురకొండ వెంకట్రావులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీ విగ్రహనికి సంఘ నాయకులు కొప్పురావూరి నాగేశ్వరరావు, నాగేంద్రరావు, పొత్తూరి బ్రహ్మానందం, గుర్రం సాంబశివరావు, యస్ రామారావు,కొత్త కోటేశ్వరరావు, కోట కృష్ణుడు, పేలూరి రామారావు, మాజేటి నరేంద్ర, చిలకల రామలింగేశ్వరరావు, గ్రంధి వీరయ్య తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో గాంధీజి విగ్రహనికి మండప కమిటి సభ్యులు, ఆలపాటి వెంకట్రావు, కొలిశెట్టి సతీష్ తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు. వాసవిక్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీజీ విగ్రహనికి క్లబ్ సభ్యులు నాగమల్లేశ్వరరావు, చేవూరి కృష్ణమూర్తి, రాజేష్, శ్రీనివాసరావు, మణి, నాగేంద్రం, పుల్లారావు, కోటేశ్వరరావు, సత్యనారాయణ, సుధాకర్, వేణు, రామారావు, మురళి, వంకాయల శ్రీహరి, రాచుమల్లు సుబ్బారావు, నున్నా సుధీర్, రాచుమల్లు అనిల్, ప్రసన్న, రంగారావు తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

## ముక్తార్ అహ్మద్‌కు మహాత్మాగాంధీ జాతీయ పురస్కారం అందజేత

**చిలకలూరిపేట, ఆక్టోబరు2,ప్రభాతవార్త:**

చిలకలూరిపేట రోటరిక్లబ్ డైరక్టర్ పఠాన్ ముక్తార్ అహ్మద్‌కు ఆదివారం హైదరాబాద్ లోని తెలంగాణా సారస్వత పరిషత్ భవనంలో ఆదర్శ కళానిలయం ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకొని వివిధ సేవా, కళా, సాహిత్య రంగాలలో విశిష్ట సేవలు అందించిన




వారికి మహాత్మాగాంధీ జాతీయ పురస్కారాలను అందచేశారు. దీనిలో భాగంగా ముక్తార్ అహ్మద్‌కు సేవా రంగంలో ఈ అవార్డును అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ కళానిలయం వ్యవస్థాపక అధ్యక్షులు చేరాల ప్రకాష్, తెలంగాణా టూరిజం డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, రాజ్యసభ సభ్యులు జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య, ప్రముఖ సినినటి సనా, సంధ్యజనక్ జానపద గాయని డాక్టర్ అరుణా సుబ్బారావు, గుజ్జ కృష్ణ,గుజ్జ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ అవార్డు ముక్తార్ అందుకోవటం పట్ల చిలకలూరిపేట రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు తాళ్ల అంజిరెడ్డి, హరిదాసుల శ్రీనివాసరావు, రోటరీ డైరక్టర్లు అభినందనలు తెలియచేశారు.

## సమస్యలతో సతమతమవుతున్న అన్నదాత..

### ..కురుస్తున్న వర్షానికి చేజారిపోతున్న ప్రత్తి

**యడ్లపాడు, అక్టోబర్ 2, ప్రభాతవార్త :** ప్రకృతి వైపరీత్యాల వల్ల ఎప్పుడు పడితే అప్పుడు కురుస్తున్న వర్షాలకు రైతన్నలు సతమతమవుతున్నారు. గత నాలుగైదు సంవత్సరాల నుండి పంటలు నష్టాలనే చూపుతున్నా, దానికి భిన్నంగా ఈ ఏడాది ఒకింత అశాజనకంగా సంవత్సరం ప్రారంభమైనది. దానికి అనుగుణంగా అప్పుడప్పుడు క్రమం తప్పకుండా కురిసిన వర్షాలకు ప్రత్తి పంట రైతులకు అశాజనకంగా గత ఎన్నడూ లేనివిధంగా భారీగా మొక్కల ఎదుగుదల ఉన్నదని, కాని ఏఇతర అపరాల పంటలు పెట్టుబడులు కూడా రాకుండా నష్టాలను చూపాయి అంటున్నారు. వాటికి ఒకి ంత రైతులు నిరాశ వెలుబుచ్చినా ప్రత్తి ఉందిగా అన్ని నష్టాలను పూడుస్తుందిలే అన్న ధీమాగా ఉన్న రైతన్నలకు ఇది కూడా అవే పంటల జాబితాలోకి చేరక



తప్పటంలేదు. అల్పపీడన ప్రభావం వల్ల కురుసు_్తన్న వర్షాలకు రైతులు రెండు,మూడు దశలలో పైరుకు అందించవలసిన ఎరువులను సకాలంలో అందజేసారు. కాని అప్పటి నుండి వర్షం వల్ల పైరు ఎదుగుదల అశాజనకంగానే ఉందని, అయితే పైరుకు తగ్గవిధంగా కాపు లేదని, వచ్చిన పూత, పిందె సగానికి సగంపైన రాలిపోతుందని అంటున్నారు. అయితే వర్షాలకు పూత పిందె వర్షాలకు పాడైయిపొతున్నాయని, దీనికారణంగా దిగుబడులు తగ్గే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. ఒకటి అర పగిలిన కాయలలోని పత్తి నాణ్యత ఉన్నా లేకున్నా తియ్యక తప్పని పరిస్థితి ఉన్నదని పలువురు రైతులు తెలుపుతున్నారు. అకాల వర్షాలకు పెట్టుకున్న అశలు అడియాశలుగా మిగిలుస్తుందని, తొలికాపు ఎక్కడి ప్రత్తి అక్కడ పొలంలో తడిచి పోవటం వల్ల అదిదేనికి పనికిరాకుండా పోతుందని, చివరికి అదితీయాలన్నా అర్ధిక సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, ఇప్పటి వరకు ఉన్న డబ్బులు పెట్టుబడుల రూపంలో పెట్టామని, ఇప్పుడు చేతికందిన పంట కళ్ళము ఒదే పాడైపోతున్నదని వారంటున్నారు. ప్రకృతి సమస్యలు అన్నీ రైతుల చుట్టూతిరుగుతున్నాయని చివరికి అవికూడా ఇబ్బందులు పెడుతూ పూర్తిగా నష్టాలను చూపి ఇరుకునపెట్టడంవల్ల చివరికి పండుగల అనందంకూడా అవిరిగా మారిపోతున్నదని, పండుగలు నిర్వహించుకొనే స్దితిలో నేడు లేకున్నామని వారి అవేదన వ్యక్తంచేస్తున్నారు.

## గాంధీజీ కన్నకలలు నెరవేరిన నాడే దేశం సురక్షితం

**యడ్లపాడు, అక్టోబర్ 2, ప్రభాతవార్త :** ఎన్నో వ్యయప్రయాసలకువోడి శాంతి యుత మార్గంలో స ్వరాజ్యాన్ని తీసుకువచ్చిన మహనీయుడు గాంధీజీ, అయన కన్న కలలు నెరవేర్చిన నాడే దేశం సురక్షితంగా ఉంటుందని, దానికి అందరూ తమవంతు ప్రయత్నం చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని తహశీల్దార్ కె నాగమల్లేశ్వరరావుపేర్కొన్నారు. మండల కేంద్రం యడ్లపాడు తహశీల్దార్ కార్యాలయంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి మరియు లాల్ బహుదూర్ శాస్త్రి



గార్ల జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వకాయలపాడు గ్రామంలోని స్వచ్చా కేంద్రం వద ఒద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అదివారం గాంధీజీ 153వ జయంతి వేడుకల సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండల పరిధిలోని అన్ని గ్రామాలలోని పంచాయితీ కార్యాలయాలలో గాంధీజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

## ప్రత్తిపాటి సమక్షంలో నెల్లూరి సదాశివరావు జన్మదిన వేడుకలు

**చిలకలూరిపేట, ఆక్టోబరు2,ప్రభాతవార్త:** నియోజకవర్గ టిడిపి సమన్వయకర్త, మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ నెల్లూరి సదాశివరావు పుట్టినరోజు వేడుకలు ఆదివారం మాజీమంత్రి ప్రత్తిపాటి



నివాసంలో ప్రత్తిపాటి సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి ప్రత్తిపాటి సదాశివరావుకు తినిపించి శుభాకాంక్షలు తెలియచేశారు. ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని మనసారా కోరుకుంటున్నట్లు ప్రత్తి_పాటి తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గానికి చెందిన రాష్ట్ర,జిల్లా, నియోజకవర్గ పార్టీ నాయకులు సదాశివరావకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియచేశారు.

## కొండా శ్రీనివాసరావుకు ఘన సత్కారం

**చిలకలూరిపేట, ఆక్టోబరు2,ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికలలో భాగంగా రాష్ట్ర బిసి సాధికారకసమితి సభ్యునిగా కొండా శ్రీనివాసరావు నియమితుల య్యారు. ఈ



సందర్భాన్ని పురస్కరించుకొని ఆదివారం ప్రత్తిపాటి తన నివాసంలో శ్రీనివాసరావును సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు తనను ఈ పదవిలో నియమింపచేసినందుకు ప్రత్తిపాటికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 18వ వార్డు టిడిపి అధ్యక్షుడు ఆరికట్ల కోటేశ్వరరావు, పార్టీ నాయకులు సయ్యద్ వహబ్, షేక్ రసూల్, తుపాకుల అప్పారావు, మల్నేని రమేష్, తంగెళ్ల రాంమోహన్, కొండా కృష్ణా, హుస్సేన్, జిలాని, వెంకట్రావు, ఎడుకొండలు,రామకోటే శ్వరరావు, గోపికృష్ణ, శరత్, ఆంజనేయులు, వివిధ హోదాలలో ఉన్న పార్టీనాయకులు అభినందించారు.

## యంబిటి సుభాని మేస్త్రిని పరామర్శించిన మాజీమంత్రి ప్రత్తిపాటి

**చిలకలూరిపేట, ఆక్టోబరు2,ప్రభాతవార్త:**

తెలుగుదేశం పార్టీ సీనియర్‌నాయకుడు యంబిటి సుభాని మేస్త్రి ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకున్నారు. కాగా వారి నివాసా నికి ఆదివారం మాజీమంత్రి, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు వెళ్లి ఆయనను పరామర్శించారు. ఆరోగ్యవిషయాలు తెలుసుకొని ధైర్యం చెప్పారు. ప్రత్తిపాటితోపాటు టిడిపి నాయకులు నెల్లూరి సదాశివరావు, షేక్ కరిముల్లా, వీరారెడ్డి, ఆరికట్ల కోటేశ్వరరావు, వార్డు టిడిపి నాయకులు సుభాని మేస్త్రిని పరామర్శించారు.

## ఘనంగా ఈవూరి బ్రహ్మానందం జన్మదిన వేడుకలు

**చిలకలూరిపేట, ఆక్టోబరు2,ప్రభాతవార్త:**

ప్రముఖ న్యాయవాది, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, టిడిపి నాయకులు ఈవూరి బ్రహ్మానందం పుట్టినరోజు వేడుకలు ఆదివారం ప్రత్తిపాటి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి కేక్ కట్‌చేసి ఈవూరి బ్రహ్మానందానికి తినిపించారు. ప్రత్తిపాటి మాట్లాడుతూ నిండు నూరేళ్ల సుఖ సంతోషాలతో ఇలాంటి పుట్టినరోజులు ఎన్నో జరుపుకోవాలని ఆశిర్వదించారు. న్యాయవాది వృత్తిలో ఉంటూ ఎవరు అడిగినా సహయం అందిస్తున్న బ్రహ్మానందాన్ని ప్రత్తిపాటితోపాటు పార్టీనాయకులు అభినందించి శుభాకాంక్షలు తెలియచేశారు.

## గ్రామాభివృద్దే ప్రధానంగా పనులు నిర్వహిద్దాం

**యడ్లపాడు, అక్టోబర్ 2, ప్రభాతవార్త :** గ్రామాభివృద్ది చెందేవిధంగా పనుల గుర్తింపు చేసి తదనుగుణంగా ముందుకు వెల్దామని సర్పంచ్ వడ్డేపల్లి నరసింహారావు పేర్కొన్నారు. మండల పరిధిలోని వంకాయలపాడు గ్రామంలో అదివారం నిర్వహించిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పధకము మండల ప్రజా పరిషత్ అధ్వర్యంలో నిర్వహించిన గ్రామ సభలో అర్ధిక సంవత్సరం 2023-24గాను కొత్త పనుల



గుర్తింపు తదితర అంశాలపై గ్రామ సభలో అయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. పంచాయితీలలో నిర్వహించుతున్న కార్యక్రమాలు పధకాలు వాటిపై గ్రామ సభలో అధికారులు, గ్రామస్తులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పంచాయితీ కార్యదర్శి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

# గాంధీజీ ఆదర్శాలకు పునరంకితం

## ●153వ జయంతి సందర్భంగా ఘన నివాళి ● రాజ్‌ఘాట్‌ను సందర్శించిన రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోడీ, కాంగ్రెస్ అధినేత్రి సోనియా

**న్యూఢిల్లీ:** మహాత్మాగాంధీ జీవితాదర్శాలైన శాంతి, సమానత్వం, మత సామరస్యానికి మనమందరం పునరంకితమవుదామని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు. మహాత్ముడి 153వ జయంతి సందర్భంగా ఢిల్లీలోని రాజ్‌ఘాట్ వద్ద ఆమె ఘన నివాళులర్పించారు. స్వాతంత్ర్య అమృత్ మహోత్సవాల వేళ జరుపుకుంటున్న ఈ జయంతికి ఎంతో ప్రాధాన్యత ఉన్నదని ముర్ము అన్నారు. గాంధీజీ కలలుకన్న ఆదర్శాలు సాకారం కావడం కోసం మనమంతా కృషి చేయాలని ఆమె సూచించారు. అక్టోబర్ 2న జన్మించిన మరో ప్రముఖ నేత, మాజీ ప్రధాని లాల్‌బహదూర్‌శాస్త్రికి కూడా రాష్ట్రపతి నివాళులర్పించారు. విజయ్‌ఘాట్‌లోని శాస్త్రి సమాధి వద్ద పుష్పగుచ్ఛాలుంచి నివాళులర్పించారు. జైజవాన్, జైకిసాన్ నినాదాలిచ్చిన శాస్త్రీజీ హరిత విప్లవం, శ్వేత విప్లవంలో కీలక పాత్ర పోషించారని ముర్ము గుర్తు చేశారు.



**గాంధీజీకి నివాళిగా దేశీయ ఉత్పత్తులు కొనాలి : ప్రధాని మోడీ :** ప్రధాని మోడీ కూడా రాజ్‌ఘాట్‌కు వెళ్లి మహాత్ముడికి నివాళులర్పించారు. గాంధీజీకి నివాళిగా ఖాదీ, దేశీయ ఉత్పత్తులనే కొనుగోలు చేయాలని ప్రధాని పిలుపునిచ్చారు. మహాత్ముడి ఆదర్శాలకు అనుగుణంగా జీవించాలన్నారు. లాల్ బహదూర్‌శాస్త్రికి కూడా ప్రధాని నివాళులర్పించారు. నిరాడంబరతకు శాస్త్రీజీ పెట్టింది పేరని, దేశ చరిత్రలో కీలక సమయంలో ఆయన పటిష్ట నాయకత్వం అందించారని ప్రధాని గుర్తు చేశారు.

గాంధీజీ, లాల్‌బహదూర్‌శాస్త్రీజీలకు నివాళులర్పించినవారిలో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ, కాంగ్రెస్ సీనియర్ నేత మల్లికార్జునఖర్గే, కేంద్రమంత్రులు, ఇతర పార్టీల నేతలున్నారు. భారత్ జోడో యాత్రలో భాగంగా ప్రస్తుతం కర్నాటకలో ఉన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మైసూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొని మహాత్ముడికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాహుల్ వెంట సీనియర్ నేత డికె శివకుమార్‌సహా ఆ రాష్ట్ర కాంగ్రెస్ నేతలున్నారు.

**నేటి ప్రపంచ సవాళ్లకు ఆయన మార్గమే పరిష్కారం : ఐరాస ప్రధాన కార్యదర్శి గుటెర్రస్**

మరోవైపు గాంధీ జయంతిని ఏటా అంతర్జాతీయ అహింసా దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి గుటెర్రస్ మహాత్ముడి ఆదర్శాలను గుర్తు చేసుకున్నారు.

గాంధీ బాటలో అహింసా మార్గాన్ని అనుసరిస్తూ ప్రపంచవ్యాప్తంగా శాంతిసాధనకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అప్పుడే యావత్ ప్రపంచం ఇప్పుడు ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగ మించగలదని ఆయన అన్నారు.

## ఒక్కరోజులో కరోనా కేసులు 3364, మృతులు 7 దేశంలో మొత్తం బాధితులు 4,45,94,487

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,అక్టోబర్2:** భారత్‌లో కరోనా వైరస్ వ్యాప్తి కొనసాగుతోంది. గడిచిన 24 గంటల్లో దేశవ్యాప్తంగా 3364 కేసులు నమోదయ్యాయి. 7 మంది మరణించారు. ఇప్పటివరకు దేశంలో కరోనా బారిన పడిన మొత్తం బాధితుల సంఖ్య 4,45,94,487కి చేరిందని కేంద్ర ఆరోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ వెల్లడించింది. మొత్తం బాధితుల్లో ఇప్పటి వరకు 4,40,28,370 మంది కోలుకోగా 39,293 మంది దేశంలోని వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇప్పటి వరకు దేశంలో కరోనా కారణంగా మృతి చెందినవారి సంఖ్య 5,28,673కు చేరినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం దేశంలో కరోనా వైరస్ బారినపడి కోలుకుంటున్న వారి(రికవరీ రేటు) 98.73 శాతంగా ఉంది. దేశంలో కరోనా కారణంగా మరణాల రేటు 1.19శాతంగా ఉంది. మహారాష్ట్రలో కరోనా పాజిటీవ్ కేసుల సంఖ్య 81,21,873కి చేరగా, 79,70,493మంది వరకు కోలుకున్నారు. 1,48,346 మంది ప్రాణాలు కోల్పోయారు. కేరళలో కరోనా పాజిటీవ్ కేసులసంఖ్య 68,05,661కి చేరింది. అందులో 67,22,898మంది కోలుకున్నారు. 71,158 మంది మరణించారు. కర్ణాటకలో కరోనా పాజిటీవ్ కేసుల సంఖ్య 40,64,979కిచేరింది. అందులో40,21,860మంది కోలుకున్నారు. 40,284 మంది మరణించారు. తమిళనాడులో కరోనా బాధితుల సంఖ్య 35,83,613కి చేరింది. అందులో35,40,100మందికోలుకున్నారు. 38,047మంది మరణించారు.



## ముంబయిలో 1476 కోట్ల డ్రగ్స్ పట్టివేత

**ముంబయి,అక్టోబరు 2:** భారత్‌లోమరోసారి భారీ ఎత్తున డ్రగ్స్ పట్టుకున్నారు. నవీ ముంబయిలో 198 కిలోల హైప్యూరిటీక్రిస్టల్ మెథాంపెటమైన్ తొమ్మిదికిలోల హైప్యూరిటీ కొకైన్‌ను డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మాదకద్రవ్యాల విలువ 1476 కోట్లరూపాయలుంటుందని అంచనా వేసారు. ఈ మత్తు ఉత్పత్తులను వాలెన్షియారకం విదేశీ కమలా ఫలాల బాక్సుల్లో ఉంచి అక్రమ రవాణాచేస్తున్నారు. ఈ హైప్యూరిటీ డ్రగ్స్ తీసుకున్నవారికి ఆమత్తు 12 గంటలవరకూ ఉంటుందని నిపుణులు చెపుతున్నారు. దక్షిణాఫ్రికానుంచి భారత్‌కు ఈ మత్తు ఉత్పత్తుల అక్రమ రవాణాచేస్తున్నట్లు అధికారుల అనుమానం. ఈ డ్రగ్స్‌ను దిగుమతిచేసుకున్న వ్యక్తిని డిఆర్ఐ అధికారులు అరెస్టుచేసారు. ఆతడికి సహకరించిన కస్టమ్స్ హౌస్ ఏజెంట్‌కోసం స్థానిక నార్కోటిక్స్ నెట్‌వర్క్ సభ్యుల కోసం అధికారులు, దర్యాప్తు ఏజెన్సీలు విస్తృత గాలింపు చేపట్టాయి.

## సమస్యలు,సవాళ్లు అధిగమించేందుకు కేడర్ సిద్ధం కావాలి

### చైనా కమ్యూనిస్టు మహాసభలకోసం అధ్యక్షుడు జిన్‌పింగ్ దిశానిర్దేశం

**బీజింగ్, అక్టోబరు 2:** భవిష్యత్తులో భారీ సవాళ్లు, మరింత సంక్లిష్ట పరిస్థితులనుఅధిగమించేందుకు చైనా కమ్యూనిస్టు పార్టీ కేడర్ సిద్ధం కావాలని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. పార్టీ సభ్యులు తమ ప్రయాణంలో సంయమనం, సమైక్యతను పాటించి పట్టుదలతో ముందుకు పోవాలని కోరారు. ఈనెలలోనే చైనా కమ్యూనిస్టుపార్టీ మహాసభలను జరుగనున్నందున పార్టీకేడర్‌ను సమాయత్తం చేసేందుకు జిన్‌పింగ్ ఇప్పటినుంచే సిద్ధం అయ్యారు. చైనా నేషనల్‌డే సందర్భంగా పార్టీ జర్నల్ క్విషిలో ప్రచురితం అయిన వ్యాసం ప్రకారంచూస్తే మన ప్రయాణంలో చివరి మైలువరకూ కూడా సవాళ్లు సమస్యలే ఎక్కువ ఉన్నాయని జిన్‌పింగ్‌చెప్పినట్లు తెలుస్తోంది. మన ప్రయాణంలో ఎదురయ్యే భారీ అడ్డంకులన్నింటినీ అధిగమించి వివాదాలనుపరిష్కరించుకోవాల్సిన తరుణం ఆసన్నం అయిందని, కొత్త చరిత్రాత్మక నిర్ణయాలతో మరిన్ని భారీ సంఘర్షణలకు సిద్ధం కావాల్సి ఉందని అన్నారు. ఐదేళ్లకోసారి చైనాలో జరిగే అధికార చైనా కమ్యూనిస్టుపార్టీ మహాసభల నిమిత్తం జిన్‌పింగ్ సౌత్‌చైనా మార్నింగ్‌పోస్టులో సంపాదకీయం కూడా రాసారు. 96 మిలియన్ల సభ్యత్వం ఉన్న కమ్యూనిస్టుపార్టీ మహాసభలు ఈ అక్టోబరులోనే జరగనున్నాయి. ఇదే సమావేశాల్లో జిన్‌పింగ్ మూడోసారి అధ్యక్షుడిగా ఎన్నికవడం లేదా చైనాకమ్యూనిస్టుపార్టీకి శాశ్వత అధ్యక్షుడుగారావడం అధ్యక్షుడి ప్రధాన లక్ష్యంగా ఉన్న సంగతి తెలిసిందే. అదే జరిగితే పార్టీ వ్యవస్థాపకుడు మావో జెడాంగ్ తర్వాత పదేళ్లకు మించి అధికారంలో ఉన్న ఏకైక నేతగా జిన్‌పింగ్ నిలుస్తారు. అయితే తైవాన్‌పైచైనా వైఖరికి అటు అమెరికా, ఇటు యూరోపియన్ యూనియన్, జపాన్‌లు తీవ్ర నిరసన వ్యక్తంచేస్తుండటంతోపాటు సైనిక చర్యను అడ్డుకుంటామని తైవాన్‌కు భరోసా ఇవ్వడం, దేశీయంగా కూడా పలు ఒత్తిళ్లు ఎదురవుతుండటంతో జిన్‌పింగ్ మూడోసారి అధ్యక్షఎన్నికకావడం ఆయనకు సవాలుగానే మారింది. జిన్‌పింగ్‌చేపట్టిన జీరో కొవిడ్‌పాలసీతో దేశీయంగా ఆర్థిక మందగమనం చోటుచేసుకుంది. పాతవిధానాలు, పిడివాదం, మూస విధానాలకు మళ్లీ వెళ్లేప్రశ్నేలేదని జెండాలుమార్చే పద్ధతులు అలవాటులేదని ఆదివారం కేడర్‌నుద్దేశించి జిన్‌పింగ్ హితబోధచేసారు. రాజకీయ వ్యవస్థను మార్చే విప్లవాత్మక భావజాలంతోనే ముందుకువెళతామని జిన్‌పింగ్ కమ్యూ నిస్టుపార్టీ కేడర్‌కు దిశా నిర్దేశంచేసినట్లు తెలుస్తోంది. 2012 లో అధికారంలోకి వచ్చినప్పటినుంచి జిన్‌పింగ్ అవినీతి వ్యతిరేక జాతాను కొనసాగించారు. పదిలక్షలమందికిపైగా ప్రభుత్వ సిబ్బంది, టాప్ మిలిటరీ అధికారులు దజను కుపైగా శిక్షలకు లోనయ్యారు. ఈ విధానంతోనే జిన్‌పింగ్ తన పార్టీ, ప్రభుత్వంపై పట్టును పెంచుకోగలిగారని, మిలిటరీపైనా తన పట్టును కొనసాగించగలుగుతున్నారని పరిశీలకులు అంటున్నారు. ఐదేళ్లకోసారి చైనా కమ్యూనిస్టుపార్టీ సమావేశాలు జరగడం సహజమే అయినా ఈసారి జరిగే సమావేశాలు నాయకత్వ మార్పుకోసం జరుగుతున్నట్లుగా ఉండటంతో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. చైనా ప్రీమియర్ లీ ఖెయాంగ్ మాట్లాడుతూ స్థానిక సంస్థలు మరింతగా కృషిచేసి ఆర్థిక వ్యవస్థను పటిష్టంచేయాలని కోరారు. జిన్‌పింగ్ తర్వాత రెండో స్థానంలో ఉన్న కీలకమైన ప్రతినిధి కావడంతో ఆయనకు సైతం చైనా ప్రభుత్వంలో మంచి పట్టుంది. కెఃయాంగ్‌మాట్లాడుతూ చైనా ఆర్థిక వ్యవస్థ ఇపుడు అనేక కష్టాలు,సవాళ్లను ఎదుర్కొంటున్నదని, సమయం మనకోసం ఆగదని, మనమే అన్ని నివారణ చర్యలకు ఉపక్రమించాలని, ఆర్థికవ్యవస్థ స్థిరీకరణ ముఖ్యలక్ష్యంగా పనిచేయాలనిసూచించారు.



## ఉక్రెయిన్ అధ్యక్షుడు స్వస్థలంలో రష్యా డ్రోన్‌దాడులు



**కీవ్, అక్టోబరు 2:** ఉక్రెయిన్‌పై తన దండ యాత్రను కొనసాగిస్తున్న రష్యా తాజాగా ఉక్రెయిన్ అధ్యక్షుడు స్వస్థలం క్రివ్యీరిహ్‌పై ఆత్మా హుతి డ్రోన్లతో దాడులునిర్వహించింది. లైమాన్ నగరాన్ని రష్యాదళాలనుంచి ఉక్రెయిన్ సైనికులు తిరిగి తమ అధీనంలోకి తీసుకోవడంతో ఇపుడు రష్యా మరింతగా రెచ్చిపోతోంది. లైమాన్‌నగరం కీలకమైన రవాణా హబ్‌గా నిలిచింది. దీనితో ఇపుడు తమ స్వాధీనంనుంచి తిరిగి ఉక్రెయిన్ పట్టులోకి వెళ్లిపోవడంతో రష్యాకు ప్రతిష్టాత్మకంగా మారింది. ఉక్రెయిన్‌లోని నాలుగు ప్రాంతాలను తమభూభాగంలోనివేనని ఎవ్వరు దాడులుచేసినా రష్యాపై దాడులుచేసినట్లుగానే పరిగణిస్తామని అధ్యక్షుడు పుతిన్ చెప్పిన తర్వాత 24 గంటల్లోనే లైమాన్ నగరాన్ని స్వాధీనంచేసుకుని ఉక్రెయిన్ దళాలు తమ పట్టును మరింత పెంచుకున్నాయని తెలుస్తోంది. లైమాన్ నగరంలో ఉక్రెయిన్‌పతాకం ఎగురుతోందని, మరో వారంరోజుల్లో మరికొన్ని నగరాల్లో ఉక్రెయిన్‌పతాకాలు కనిపిస్తాయని, డాన్‌బాస్‌పైనా ఉక్రెయిన్‌పతాకం ఎగురుతుందని అధ్యక్షుడు వోలోదిమిర్‌జెలెన్‌స్కీ తెలిపారు. కాగా ఆదివారం ఉక్రెయిన్ అధ్యక్షుడు స్వస్థలంలోని పాఠశాలపై ఆత్మాహుతి డ్రోన్‌దాడిజరిగిందని, ఈ మంటలను సకాలంలోనేఆర్పివేసినట్లు ఆప్రాంత గవర్నర్ వెల్లడించారు. రష్యా తన దాడులను జపోరిఝియాపైనే కేంద్రీకరించిందని తెలిపారు. రష్యాకు చెందిన ఆయుధడిపోపై దాడిని చేసామని, చెర్నిహివ్‌లో ఉన్న ఈ ఆయుధడిపో ధ్వంసంతో రష్యాకు భారీ నష్టం కలిగించగలిగినట్లు ఉక్రెయిన్‌మిలిటరీ వెల్లడించింది. రెండు ఎస్300 యాంటి ఎయిర్‌క్రాఫ్ట్ బ్యాటరీలను కూడా నాశనంచేసింది. రష్యా స్వాధీనంచేసుకున్న ప్రాంతాలపై ఉక్రెయిన్ మళ్లీ పట్టు సాధించి తిరిగి స్వాధీనంచేసుకోవడంతో రష్యాకు ఆగ్రహం పెంచింది. మరింత ఉద్రేకానికి లోనయింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్‌పుతిన్ మాట్లాడుతూ ఉక్రెయిన్‌కు పెరుగుతున్న ఈ మద్దతు అంతా అమెరికా పర్యవేక్షణలోనే జరుగుతోందని రష్యాను మరింత నాశనం చేయాలన్న కుట్రతోనే అమెరికా వ్యవహరిస్తోందని విమర్శించారు. పశ్చిమదేశాలన్నీ ఒక్కటయినా రష్యా తన సార్వభౌమత్వ పరిరక్షణకు అవసరమైతే అణుదాడులకుసైతం సిద్ధం కావాల్సి వస్తుందని మరోసారి ఆయన హెచ్చరికలుచేసారు.

## ఆప్‌ను ఓడించేందుకు ఒక్కటైన కాంగ్రెస్, బిజెపిలు

### గుజరాత్‌లో ఆప్ అధినేత కేజ్రీవాల్

**అహ్మదాబాద్, అక్టోబరు 2:** గుజరాత్‌లో ఆమ్ ఆద్మీపార్టీ అధికారంలోకి వస్తే గోవుల పరిరక్షణకోసం రోజుకు 40 రూపాయలుచొప్పున చెల్లిస్తామని, పాడిలేని పశువులకోసం కొత్తగా షెల్టర్ ఏర్పాటుచేస్తామని ఆమ్ ఆద్మీపార్టీ అధినేత కేజ్రీవాల్ వెల్లడించారు. హిందూ ఓటర్లను ఆకట్టుకునేందుకు గుజరాత్‌లో ఆమ్ ఆద్మీపార్టీ పలు హామీలు కుమ్మరిస్తున్న సంగతి తెలిసిందే. బిజెపి, విపక్ష కాంగ్రెస్‌పార్టీలు ఆప్ ఓట్లను చీల్చేందుకు ఇపుడు రాష్ట్రంలో ఒక్కటి అయ్యాయని ఇంటెలిజెన్స్ నివేదికలే స్పష్టంచేస్తున్నాయని చెప్పారు. రాష్ట్రంలో ఎన్నికల నంతరం తమ పార్టీ ప్రభుత్వం ఏర్పాటుచేస్తుందని వెల్లడించారు. ఢిల్లీలో తాము ప్రతి గోవుకు రోజుకు 40 రూపాయలు చెల్లిస్తున్నామని, ఢిల్లీ ప్రభుత్వం 20 రూపాయలు, మున్సిపల్‌కార్పొరేషన్ 20 రూపాయలు చెల్లిస్తు న్నట్లు తెలిపారు. ఆప్ గుజరాత్‌లో అధికారంలోకి వస్తే రోజుకు ఒక్కొక్క గోవుకు 40 చొప్పున చెల్లిస్తామన్నారు. పశువులకోసం గోశాలలు ఏర్పాటుచేస్తామని ప్రతిజిల్లాలోను పాడి ఇవ్వని పశువులకు కూడా గోశాలలునిర్మిస్తామన్నారు. దీనివల్ల గోవులు రోడ్లపై తిరగడం తగ్గుతుందని ఆయన అన్నారు. రాష్ట్రంలో గోసరంక్షణకు ఆప్ ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. గోశాలలకోసం ప్రభుత్వం హామీ ఇచ్చిన 500 కోట్ల నిధులను విడుదలచేయడంలో జరుగుతున్న జాప్యంపై షెల్టర్ నిర్వాహకులు చేపట్టిన నిరసనలపై ఆప్ అధినేత స్పందించారు. తాను భోజనంచేసిన ఆటోడ్రైవర్ తాను బిజెపికే మద్దతిస్తానన్న వ్యాఖ్యలపై వ్యక్తులను పార్టీల ఆధారంగా వివక్ష చూపించలేనని అదివారి స్వేచ్ఛ అని ఆయన అన్నారు. వారు కాంగ్రెస్ అయినా బిజెపి అయినా వారు తనను డిన్నర్‌కు ఆహ్వానించారని, అందువల్లనే పార్టీ రహితం గానే ఆలోచించి తాను వారి ఇంటికి వెళ్లానన్నారు. వారి స్వేచ్ఛకు అనుగుణంగా ఏపార్టీకి అయినా వారు ఓటువేయవచ్చన్నారు. నేనెవ్వరినీ మీరేపార్టీకి ఓటువేస్తారని అడగలేదన్నారు. అధికారంలోకి వచ్చిన మరుసటిరోజునుంచే అన్ని వర్గాలప్రజల సంక్షేమానికి పనిచేస్తామని ఎలాంటి వివక్ష ఉండబోదన్నారు. బిజెపి కాంగ్రెస్ పార్టీలు ఇపుడు గుజరాత్‌లో ఒక్కటిఅయ్యాయని, ఆప్‌ను ఓడించే లక్ష్యంతోనే పనిచేస్తున్నాయన్నారు. గుజరాత్‌లో బిజెపి ఆప్ ఓట్లను సంగ్రహించేందుకు కాంగ్రెస్‌పార్టీకి బాధ్యతలు అప్పగించిందన్నారు. ఇంటెలిజెన్స్ నివేదికలు వచ్చిన తర్వాతనుంచే బిజెపి, కాంగ్రెస్ పార్టీలకు వణుకు ప్రారంభం అయిందని, రెండు పార్టీలు ఒక్కటయ్యాయని, రహస్య సమావేశాలు నిర్వహిస్తున్నాయన్నారు. 182 మందిసభ్యులున్న గుజరాత్ అసెంబ్లీలో కాంగ్రెస్‌పార్టీకి ఈసారి పదిస్థానాలకు మించి రావన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలందరూ బిజెపిజేబులోని మనుషులేనన్నారు. అవసరమైన కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బిజెపి కొనుగోలు చేస్తుందని, మరికొందరిని అలా స్టాకులో పెట్టుకుందని ఎద్దేవాచేసారు. దేశం మొత్తం ఇపుడు ఇదే జరుగుతోందని దుయ్యబట్టారు. ప్రధానిమోడీ ప్రారంభించిన 20వేల కోట్ల ప్రాజెక్టులు కాంట్రాక్టర్లు, మంత్రులకే లాభం చేకూరుతుందని, ప్రజలకు కానేకాదని అన్నారు. ప్రజలకు మంచి విద్య, ఉపాధి, విద్యుత్ వ్యయంలో తగ్గింపు, సురక్షిత మంచినీరు, ద్రవ్యోల్బణంనుంచి ఊరట కలిగించాలని కోరుతున్నారని, ఢిల్లీ పంజాబ్‌లలో మేం చేసి చూపించామని, గుజరాత్‌లో కూడా చేపట్టిన విజయం సాధిస్తామన్నారు.



## ఆర్థికవ్యవస్థ స్థిరీకరణకే నా తొలిప్రాధాన్యం: బ్రిటన్‌ప్రధాన మంత్రి లిజ్‌ట్రస్



**లండన్, అక్టోబరు 2:** ప్రభుత్వ వ్యయపరిమితులు పెరిగిపోతుండటం, పౌండ్ కనిష్టస్థాయికి తాకినందున బ్రిటన్ ఆర్థిక వ్యవస్థ స్థిరీకరణకు తాను అత్యంత ప్రాధాన్యతనిస్తానని బ్రిటన్ కొత్తప్రధాన మంత్రి లిజ్‌ట్రస్ వెల్లడించారు. బిబిసి టివితో జరిగిన చిట్‌చాట్‌షోలో ఆమె మాట్లాడుతూ కేబినెట్ మంత్రులకు ప్రభుత్వం పన్నుల్లో ఉన్న టాంరేట్‌ను రద్దుచేస్తామన్న సమాచారం ఇవ్వలేదని, బడ్జెట్‌కు సంబంధించిన రూపకల్పన, తీసుకునే నిర్ణయాలు కొన్ని గోప్యంగానే జరుగుతాయని ఆమె పేర్కొన్నారు. అయితే తాము చేపట్టే ఆర్థిక స్థిరీకరణ చర్యలకు మార్కెట్లనుంచి ప్రతికూల స్పందన కూడా అతితక్కువగానే ఉండేటట్లు చూస్తామని అన్నారు. కన్సర్వేటివ్‌పార్టీ వార్షిక సదస్సు సందర్భంగా మొదటిరోజు లిజ్‌ట్రస్ మాట్లాడుతూ ఆర్థికవ్యవస్థ స్థిరీకరణకు అత్యంత ప్రాధాన్యతనిస్తానని, ఆర్థికవృద్ధి ప్రణాళికపైనే తాను కొనసాగుతానని, ఇన్వెస్టర్లు, ఆర్థికవేత్తలు విమర్శలు చేసినా అదనపు వ్యయంకోసం ప్రస్తుతం బిలియన్లకొద్దీ పౌండ్లను కేటాయింపులు జరిపినా కొన్ని వివరాలు మాత్రమే ఇవ్వడంపై వచ్చిన ప్రశ్నలకు ఆమె స్పందించారు. వారి ఆందోళనను అర్థంచేసుకోగలనని, మేం ప్రకటించిన ప్యాకేజీకే తాను కట్టుబడి ఉన్నానని, సత్వరమే అమలుకు సైతం బాధ్యత తీసుకుంటానన్నారు. అయితే ఇందుకు క్షేత్రస్థాయినుంచి మంచి ప్రణాళికను అమలు చేయాల్సి ఉందన్నారు. తన కేబినెట్‌లోని కీలక మంత్రులకు టాప్‌రేట్‌టాక్స్ రద్దుపై ముందస్తు సమాచారం లేదన్న ప్రశ్నలపై ఆమె మాట్లాడుతూ ఈ నిర్ణయం తమ ఆర్థికమంత్రి క్వాసీ క్వార్టెంగ్ తీసుకున్నారని, ట్రెజరీ ఛాన్సలర్ తీసుకున్న నిర్ణయం అని ఆమె తెలిపారు. బడ్జెట్లను రూపకల్పన చేసే సమయంలో వాటిని అత్యంత గోప్యతతో కూడిన విధానంలో రూపొందిస్తారని లిజ్‌ట్రస్ వెల్లడించారు.

## ఇరాన్ హిజబ్ నిరసనల్లో ఇప్పటివరకూ 92 మందిమృతి

**టెహ్రాన్,అక్టోబరు 2:** మెహసా ఆమిని మృతిసంఘటనను పురస్కరించుకుని ఇరాన్‌దేశవ్యాప్తంగా ఎగిసపడిన నిరసనల్లో ఇప్పటివరకూ 92 మంది చనిపోయారు. ఇరాన్ నైతికత పోలీసులు అరెస్టుచేసిన మహసా అమినిని దారుణంగా హింసించడంతో ఆమె చనిపోయింది. నార్వే కేంద్రంగాపనిచేస్తున్న ఇరాన్ మానవహక్కుల ఎన్‌జిఒ ఆదివారం మొత్తం 92 మంది చనిపోయారని ప్రకటించింది. ఇరాన్‌ప్రభుత్వ అకృత్యాలపై అంతర్జాతీయ సమాజం విచారణచేయాల్సిన అవసరం ఎంతో ఉందని సంస్థ డైరెక్టర్ మహమూద్ అమిరి మోఘద్దమ్ వెల్లడించారు. అంతకుముందు 83 మంది చనిపోయారని, రానురాను నిరసనలు మరింత ఉధృతం అవుతుండటంతో అణిచివేత కార్యాచరణలో పోలీసులు చేపట్టిన దమనకాండలో 92 మంది ఇప్పటివరకూ చనిపోయినట్లు మహమూద్ అమిరి తెలిపారు. హిజబ్ నిబంధనల ప్రకారం వదులుగా ఉన్న దుస్తులు ధరించి పూర్తిగా శిరస్సును కూడా కప్పి వేసుకోవాలని ఆవిధమైన వస్త్రధారణమాత్రమే అనుమతిస్తామని ఇరాన్ ప్రభుత్వం ప్రకటించింది. దీనిపై ఇరాన్‌మహిళలనుంచి తీవ్రస్థాయి నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. మోహసా అమిని మృతితో ఇపుడు ఈనిరసనలు దేశవ్యాప్తంగా ఎగిసిపడుతున్నాయి.

## తిరుమల బ్రహ్మోత్సవాలు



### హనుమంతునిపై 'వేంకటాద్రిరాముడు'

**తిరుమల,అక్టోబరు 2ప్రభాతవార్తప్రతినిధి:** అంజనాద్రీశుడు శ్రీవేంకటేశ్వరుడు ఆదివారం ఉదయం ప్రియదాసభక్తుడైన ఆంజ నేయుడిపై వేంకటాద్రిరాముడుగా దర్శనమిచ్చాడు. ఏడుకొండల్లో అంగరంగవైభ వంగా జరుగుతున్న సాలకట్లబ్రహ్మోత్సవాల్లో ఆరవరోజు ఆదివారం ఉదయం మలయప్పస్వామి విశేషఅలంకారభూషితుడై వాహనమండపం వద్దకు వేంచేపు చేశారు. ఇక్కడ వేద మంత్రోచ్ఛరణల నడుమ స్వామివారిని హనుమంతవాహనంపై అధిరోహింపజేశారు. ఉదయం 8గంటలకు వాహనం ఆలయమాఢవీధుల్లో ప్రదక్షణగా బయలుదేరింది. భక్తులు ఆదపమొక్కులవాడా..గోవిందా..వేంకట రమణ గోవిందా అంటూ నామస్మరణలతో తన్మయత్వం పొందారు.

**భగవంతుని వాహనంమోసిన సిజెఐ లలిత్:** దేశఅత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టుకు ప్రధాన న్యాయమూర్తి అయినా భగవంతుని చెంత సేవకుడిగానే జస్టిస్ యుయు లలిత్ దంపతులు భక్తితో హనుమంతవాహనాన్ని భుజాలపైమోశారు. దైవంముందు సేవకులుగా అనందపరవశుల య్యారు. ఈ వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ యుయు లలిత్‌దంపతులు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్‌మిశ్ర దంపతులు, టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి దంపతులు, టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి దంపతులు, బోర్డుసభ్యులు పోకలఅశోక్‌కుమార్, నందకుమార్, ఢిల్లీ స్థానిక సలహామండలి అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, జెఇఒలు సదాభార్గవి, వీరబ్రహ్మం, సివిఎస్‌ఓ నరసింహకిశోర్, సిఇ నాగేశ్వరరావు, డిప్యూటీ ఇఒ రమేష్‌బాబు, పేష్కార్ శ్రీహరి, విజిఓ బాలిరెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.



### ఉభయదేవేరులతో స్వర్ణరథంపై శ్రీనివాసుడు

**తిరుమల,అక్టోబర్ 2ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచంలోనే అత్యంత సంపన్నవంతమైన దేవుడు, భక్తులకు కొంగుబంగారంగా నిలిచిన ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామి ఆదివారం సాయంత్రం తనకెంతో ఇష్టమైన స్వర్ణరథంపై ఉభయదేవేరులతో కలసి ఊరేగారు. కలియుగవైకుంఠమ్‌లో జరుగుతున్న శ్రీవేంకటేశ్వరస్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ఆరవరోజు సాయంత్రం బంగారుదేవుడు స్వర్ణాభూషితఅలంకృతుడై ధగధగమెరిసే ఆభరణాలతో బంగారురథంపై భక్తులకు దర్శనమిచ్చాడు. సంధ్యాసమయంలో చల్లటిగాలులు వీస్తుండగా స్వర్ణరథోత్సం ఒక విశిష్టమైన వాహనం. స్వర్ణమయమైన రథం ఆలయం వద్దనుంచి బయలుదేరింది. ఈ స్వర్ణ రథోత్సవంలో కల్యాణకట్టమిరాశీదారులు సమర్పించిన ఒక సువర్ణఛత్రాన్ని తొలుత రథంపై అలంకరించారు. భగవంతుడు శైల్య, సుగ్రీవ, మేఘ, పుష్ప, పలహాకా అనే నాలుగు గుర్రాలు పూన్చిన రథమెక్కి విహరించాడు. దారుకుడు ఆయన సారధి. ఈ రథంమీద పయమినిస్తూన్న శ్రీమలయప్పస్వామిని దర్శించిన భక్తులు గోవిందనామంతో పునీతులయ్యారు. స్వర్ణరథాన్ని మహిళా భక్తులు లాగారు. స్వర్ణరథంలో పెద్దజీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి దంపతులు, టిటిడి ఇఓ ఏవి ధర్మారెడ్డి దంపతులు, బోర్డుసభ్యులు పోకలఅశోక్‌కుమార్, నందకుమార్, ఢిల్లీ స్థానిక సలహామండలి అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, జెఇఓలు సదాభార్గవి, వీరబ్రహ్మం, సివిఎస్‌ఓ నరసింహకిశోర్, మహిళా భక్తులు పాల్గొన్నారు.



### గజవాహనంపై గోవిందుడు దర్శనం

**తిరుమల,అక్టోబర్ 2 ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండలదేవుడు ఆదివారం రాత్రి గజవాహనాన్ని అధిరోహించి మాఢవీధుల్లో భక్తులకుదర్శనమిచ్చాడు. శ్రీవారి సాలకట్లబ్రహ్మోత్సవాలలో ఆదివారం రాత్రి గజవాహనంపై గజరాజరక్షకుడు అభయమిచ్చాడు. రాజులకు విజయచిహ్నంగా గజాలపై యుద్ధాలకు వెళతారు. అంతటి శక్తివంతమైన గజాన్ని దేవదేవుడు వాహనంగా చేసుకుని గజేంద్రమోక్షకుడు దర్శనమివ్వడం శుభకరం. రాత్రి 7గంటలకు అర్చకులు కర్పూరహారతులిచ్చి వాహనం బయలుదేరింది. వాహనసేవలో పెద్దజీయర్ స్వామి, చిన్న జీయర్‌స్వామి, టిటిడి ఛైర్మన్ వైవిసుబ్బారెడ్డి దంపతులు, ఇఒ ఏవి ధర్మారెడ్డి దంపతులు, బోర్డుసభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## 62.33 కోట్లకుపెరిగిన ప్రపంచ వైరస్ కేసులు

### 65.50 లక్షలకు చేరుకున్న మరణాలు

**జెనీవా, అక్టోబరు 2:** ప్రపంచదేశాల్లో కరోనా కేసులు స్వల్పంగాపెరిగాయి. ప్రపంచవ్యాప్తంగా ఆదివారంనాటికి కరోనా కేసులు 62.33 కోట్లకుపైగా నమోదుకాగా 65.50 లక్షలమంది చనిపోయారు. మరో 39,485 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 60.32కోట్లవరకూ ఉన్నాయి. మరో 1.36 కోట్లమంది ఇప్పటికీ వైరస్‌తో సతమతం అవుతున్నారు. యూరోప్ దేశాల్లో మొత్తం 22.77 కోట్లమందికికరోనాసోకి 19.21 లక్షల మంది చనిపోయారు. మరో 9324 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 22.10 కోట్లకుపైగా నమోదుకాగా మరో 47.19 లక్షల మంది ఇప్పటికీ వైరస్‌తో సతమతం అవుతున్నారు. ఉత్తర అమెరికా దేశాల్లో 11.64 కోట్ల మందికి కరోనాసోకి 15.40 లక్షలమంది చనిపోయారు. మరో 8091 మంది పరిస్థితి ఆందోళనగాఉంది. రికవరీలు 11.13 కోట్లకుపైగా నమోదుకాగా మరో 35.68 లక్షలమంది ఇప్పటికీ వైరస్‌తోపోరాటంచేస్తున్నారు. ఆసియా దేశాల్లో మొత్తం 19కోట్లమందికికరోనాసోకితే వారిలో 14.80లక్షలమంది మృతిచెందారు. మరో 10,696 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 18.42 కోట్లకుపైగా నమోదు కాగా మరో 43.69 లక్షలమంది ఇప్పటికీ మృత్యువుతో పోరాడుతున్నారు. దక్షిణ అమెరికా దేశాల్లో మొత్తం 64.11కోట్లకుపైగాబాధితులుంటేవారిలో 13.30 లక్షలమందిచనిపోయారు. రికవరీలు 6.23కోట్లకుపైగా నమోదుకాగా మరో 4,03,633 మంది ఇప్పటికీ వైరస్‌తో ఉన్నారు. ఆఫ్రికాదేశాల్లో మొత్తం కరోనాబాధితులు 1.26 కోట్లకుపైగా ఉంటే వారిలో 2,57,633 మందిచనిపోయారు. రికవరీలు 1.20 కోట్లవరకూ ఉన్నాయి. వీరుకాకుండా మరో 4.02 లక్షలమంది ఇప్పటికీ ఆసుపత్రుల్లోనే కొనసాగుతూ వైరస్‌తో సతమతం అవుతున్నారు. 19 ద్వీపకల్పదేశాల పరంగాచూస్తే మొత్తం 1.24 కోట్లమందికి కరోనాసోకి 20,973 మందిచనిపోయారు. రికవరీలు 1.22కోట్లకు పైగా ఉన్నాయి. మరో 1.36లక్షల మంది ఇప్పటికీ ఆందోళనకర పరిస్థితుల్లోనే ఉన్నట్లు ప్రపంచ ఆరోగ్యసంస్థకు ఈ దేశాలనుంచి నివేదికలు వెళ్లాయి.



# విశాఖలో భీమ జ్యుయెలరీ

## సినీనటి నిక్కీ గల్రానిచే ప్రారంభం

**విశాఖపట్నం (అల్లిపురం), అక్టోబర్ 2, ప్రభాతవార్త:** బంగారం, వజ్రాలు కొనాలనుకునేవారికి శుభవార్త ప్రముఖ ఆభరణాల సంస్థ భీమ జ్యూయలరీ స్టోర్ తన సరికొత్త షోరూంను ఆదివారం విశాఖలో ప్రారంభించారు. ఆశీలమెట్ట సంపత్ వినాయక గుడి రోడ్డు వేమనమందిరం దరి లాంఛనంగా ప్రారం భించింది. ముందుగా జ్యోతి ప్రజ్వలనా కార్యక్రమం సినీనటి నిక్కీ గల్రాని చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ముఖ్యఅతిధులు మాట్లాడుతూ భీమ గ్రూప్ దక్షిణ భారతదేశం, యు.ఎ.ఐ లలో 50 వరకు షోరూమ్‌లను కలిగివుందన్నారు. బెంగళూరు, మంగుళూరు, ఊడిపి, హాసన్ షియోగ, త్రివేండ్రం, నాగర్‌కోయిల్, మధురై, అడోర్, మర్తనదం, అతింగల్, సేలం, కాసరాగాడ పోతిన్‌కోడ్, తిరున్‌వెల్లి, పతనమ్‌తిట్ట, విజయవాడల్లో సో ట్రర్స్ ఉన్నాయన్నారు. వివిధ ప్రాంతాలు, తరాల అభిరుచులకు అనుగుణంగా ఆధునిక ట్రెండ్స్ ప్రకారం, భీమ తమ ఆభరణం స్వచ్ఛత యొక్క ఉన్నత ప్రమాణాలైన 916 హాల్ మార్క్‌ను కలిగి ఉంటుందన్నారు. చైన్స్, గాజులు, ఆభరణాలు, డిజైనర్‌వేర్, వజ్రాలు, బంగారం, వెండి ఆభరణాలను నిష్కలంకమైన పనితరంతో సమకాలిన, సాంప్రదాయ డిజైన్స్‌ను భీమ అందిస్తుందన్నారు. మా ఖాతాదారుల జీవితంలోని ప్రతి దశలోనూ పాపాయి కడియాల నుంచి మంగళకరమైన మంగళ సూత్రం వరకు భీమ ఒక ముఖ్య భూమికను పోషిస్తున్నందుకు మాకు చాలా గర్వంగా ఉందని డాక్టర్ బి.గోవిందన్ తెలిపారు. వివిధ ప్రాంతాల అభిరుచులకు అనుగుణంగా ట్రెండ్స్ ప్రకారం భీమ తన ఆభరణాలను స్థిరంగా రూపొందిస్తుందన్నారు. ఈ కార్యక్రమాలు సంస్థ ప్రతినిధులు గాయిత్రి సుహాస్, ఎంఎస్ సుహస్, దీపా కపూర్, సుదీర్ కపూర్, ఆర్తీ గురురాజ్, గురురాజ్, జయ, శివన మేనేజర్ కృష్ణభాస్కర్, వివిధ సంస్థల ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

# పథకాలు కేంద్రానివి: స్టిక్కర్లు వైఎస్సార్సీవి

## జనం గమనిస్తున్నారు: ప్రజాపోరు ముగింపు సభలో సిఎం రమేష్

**శ్రీకాళహస్తిరూరల్, అక్టోబర్ 2 ప్రభాతవార్త:** మూడేళ్లుగా అంధ్ర రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోదీ కట్టుబడి పని చేస్తున్నారని అయితే రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం తాము అందిస్తున్న పథకాలకు తమ స్టిక్కర్లు అంటించుకుంటూ ఫోజులు కొడుతూ తామే అభివృద్ధి చేస్తున్నామని బజా బజాన దారుణమని రాజ్యసభ సభ్యుడు సిఎం రమేష్ అన్నారు. రాష్ట్రంలో 14రోజుల పాటు నిర్వహించిన 'ప్రజాపోరు' కార్యక్రమాలు ఆదివారం తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండం వాంపల్లిలో ముగించారు. ఈ మేరకు రాష్ట్ర మీడియా ప్రతినిధి కోలా ఆనంద్‌కుమార్ భారి ఎత్తున కార్యక్రమాలు ఏర్పాటు చేసారు. ఈ సభకు ముఖ్యఅతిధిగారాజ్యసభ సభ్యుడు సిఎం రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ ప్రదాని నరేంద్రమోదీ సుపరిపాలనలో అంధ్ర రాష్ట్రానికి అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నారని వాటిని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పథకాలన్ని తామేఅమలుచేస్తున్నట్లు ప్రజల్ని మభ్యపెడుతున్నారని ధ్వజమెత్తారు. కేంద్ర నుంచి రాష్ట్రాభివృద్ధికి నిధులు అందిస్తున్నా తమ పబ్బం గడుపుకొనుటకు తామే అందిస్తున్నట్లు కలరింగ్ ఇస్తున్నారని ధ్వజమెత్తారు. కేంద్రం అందిస్తున్న ఉచిత బియ్యంను కూడా నిలిపివేసి పేదల కడుపు కొట్టి అక్రమంగా



బహిరంగ సభలోమాట్లాడుతున్న సిఎం రమేష్

సంపాదనలతో వారి జేబులు నింపుకకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రజల సంక్షేమానికి ఈ ముఖ్యమంత్రి చేసిందేమి లేదన్నారు. అలాగే ఒక్క అవకాశం అంటూ గద్దెనెక్కి నేడు ప్రజల్ని అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని ధ్వజమెత్తారు. నవరత్నాల పేరుతో పథకాలంటూ పేదలకుపది రూపాయలు అందిస్తూ మద్యం ద్వారా వేలు జేబులు నింపుకుంటున్నారు. రాష్ట్రంలో వైకాపా నాయకులు దోపిడికి అలవాటు పడి ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెడుతున్నారని ధ్వజమెత్తారు. పోలీసులను తమ జేబు రుమాలుగామార్చుకొని ప్రజల్ని భయభ్రాంతుల్ని చేస్తున్నారని ధ్వజమెత్తారు. పోలీసులు తమ బాధ్యతల్నిఎరిగి పరిపాలించాలని కోరారు. పోలీసు అధికారులు రక్షక భటులమనే వాస్తవాన్ని విస్మరించకూడదన్నారు. అక్రమ కేసులు బనాయిస్తున్న అదికారులు రాబోవు రోజుల్లో తప్పక మూల్యం చెల్లించుకుంటారని విమర్శించారు.

**శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అన్ని అక్రమ వ్యాపారాలే:** శ్రీకాళహస్తి నియోజకవర్గం దివ్యక్షేత్రం ఇక్కడ భక్తిభావం చోటు చేసుకుంటుంది. అలాంటి దివ్యక్షేత్రంలో నేడు ఆరాచక పాలన సాగుతుంది. ఇసుక, ఎర్రచందనం అక్రమరవాణా విచ్చల విడిగా సాగుతుందని తనకు ఈ దివ్యక్షేత్రంలో ఎంతో సన్నిహిత సంబంధం ఉంది. అయితే నేడుపోలీసులను తమ తాబేదార్లుగామార్చుకొని పాలకులు పబ్బం గడుపుకుంటున్నారని కాని వారి ఆగడాలకు చివరి రోజులు వచ్చాయని ధ్వజమెత్తారు. అధికార పార్టీకి తొత్తులుగామారి ప్రతి పక్షాల పై అక్రమకేసులు బనాయిస్తున్న పోలీసులు సమాధానం చెప్పుకోవాల్సి వస్తుందని సిఎం రమేష్ విమర్శించారు. రాబోవు ఎన్నికల్లో ప్రజలు వైకాపా తగిన గుణపాఠం చెబుతున్నారని కొన్ని నియోజకవర్గాల్లో డిపాజిట్లు కోల్పోయే పరిస్తితి ఉందన్నారు. ఈ కార్యక్రమాల్లో మీడియా ప్రతినిధి కోలా ఆనంద్ కుమార్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి సామంచి శ్రీనివాస్, నియోజకవర్గ బిజెపి నాయకులు కాసరంరమేష్, అబ్బూరి పుల్లయ్యనాయుడు, గాండ్ల శివకుమార్, కుమార్‌నాయుడు, ధర్మయ్య యాదవ్, తిరుపాల్‌నాయుడు, మేళాగారం సుబ్రమణ్యంరెడ్డి, బాలాజి, బొబ్బిలి రెడ్డి, వేడాంకృష్ణయ్య, బొక్కసం యుగందర్ తదితరులు పాల్గొన్నారు.



## టిడిపి అధినేత వస్తున్నా మీకోసం పాదయాత్రకు 10యేళ్లు

**మంగళగిరి, అక్టోబర్ 2, ప్రభాతవార్త :** టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు 2012లో చేసిన వస్తున్నా మీకోసం పాదయాత్రకు నేటితో 10ఏళ్ళు పూర్తియిన సందర్భంగా పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు అధినేతను హైదరాబాదులోని ఆయన నివాసంలో కలిశారు. నాటి పాదయాత్ర విశేషాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా కార్యకర్తల కోరిక మేరకు చంద్రబాబు కేక్ కట్ చేశారు. 2012అక్టొబర్ 2వ తేదీన ప్రారంభమైన వస్తున్నా మీకోసం పాదయాత్ర 208రోజుల పాటు సాగింది. ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు 63ఏళ్ళ వయస్సులో చంద్రబాబు నాయుడు 2817కిమీ మేర పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా పార్టీనేతలు పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబును ఆయన నివాసంలో కలిశారు. కార్యక్రమంలో మాజీ ఎంపి కంభంపాటి రామ్మోహన్, గోనుగుంట్ల కోటేశ్వరరావు, చంద్రదండు ప్రకాష్ నాయుడు సహా పలువురు నేతలు పాల్గొన్నారు.

# మహాత్ముని మార్గం సదా ఆచరణీయం

## రైల్వేలో ఘనంగా జాతిపిత మహాత్మాగాంధీ జయంతి, ముగిసిన స్వచ్ఛ భారత్

**గుంతకల్లు రైల్వే, అక్టోబర్ 2 ప్రభాతవార్త:** జాతిపిత మహాత్మా గాంధీ త్యాగనిరతి వల్లే నేడు మనం స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను అనుభవిస్తున్నామని, డిఆర్‌ఎం కె.వెంకటరమణారెడ్డి అన్నారు. మహాత్మా గాంధీ 153వ జయంతి, స్వచ్ఛత పక్షోత్సవ వేడుకల ముగింపు కార్యక్రమాల ఆదివారం స్థానిక డిఆర్‌ఎం కార్యాలయ ప్రాంగణంలో అట్టహాసంగా జరిగాయి. ఈ సందర్భంగా డిఆర్‌ఎం రమణారెడ్డి ఆంగ్లములోను, అదనపు డిఆర్‌ఎం మురళీ కృష్ణ హిందీ భాషల్లో, స్వచ్ఛతను నిత్యం పాటిస్తామని రైల్వే సిబ్బందిచే ప్రతిజ్ఞచేయించారు. అనంతరం డిఆర్‌ఎం రమణారెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఏటా సెప్టెంబర్ 16 నుంచి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛత పక్షోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. మహాత్మాగాంధీ ఆశించిన స్వరాజ్యం, సుపరిపాల నలు అందించడమే ఆయనకు మనమిచ్చే ఘనమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలోరైల్వే అధికారులు శీతల్ బన్సల్, జయశంకర్‌చౌహాన్, డాక్టర్ మురళీ, మోహన్, ప్రశాంత్‌కుమార్, బాలాజీ కిరణ్, మల్లికార్జున, వామన మూర్తి, సుదర్శనరెడ్డి, గంగరాజు, ప్రశాంత్ క్రిష్ణసాయి, కిశోర్‌కుమార్, రామస్వామినాయక్, మధుసూధన్‌రావు, ఎస్ఎస్ఈలు శివప్రసాద్‌రెడ్డి, నీలకంఠప్రసాద్, డి.శ్రీనివాసులు, వెంకటేష్ నాయక్, హరికృష్ణ, ఆయా విభాగాల సంబంధిత అధికారులు, సిబ్బంది, రైల్వే పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



పర్యవరణ పరిరక్షణను పాటిస్తానని రైల్వే సిబ్బందిచే ప్రతిజ్ఞచేయిస్తున్న డిఆర్‌ఎం రమణారెడ్డి

## రైల్వే సిబ్బందికి 78 రోజుల బోనస్

### ఒక్కో కార్మికుడికి రూ.17,951ల చొప్పున గుంతకల్లు డివిజన్ పరిధిలో నేటి నుంచి పంపిణీ

**గుంతకల్లు రైల్వే, అక్టోబర్ 2 ప్రభాతవార్త:** కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖలో పనిచేస్తున్న అర్హులైన సిబ్బందికి 2021-22 ఆర్థిక సంవత్సరానికిగాను రైల్వే శాఖ 78 రోజుల ఉత్పాదకతతో కూడిన బోనస్ మంజూరు చేసింది. నిబంధనల ప్రకారం ఒక్కో కార్మికుడు రూ.17వేల 951ల బోనస్‌ను పొందనున్నట్లు వర్గాలు తెలిపాయి. దక్షిణ మధ్యరైల్వే జోన్ పరిధిలో బోనస్ ప్రక్రియను పూర్తి చేసిన డివిజన్‌గా గుంతకల్లు రైల్వే డివిజన్‌రికార్డు నమోదు చేసింది. డివిజన్ పరిధిలో మొత్తం 151 బిల్ యూనిట్‌లలో పనిచేస్తున్న 13వేల305 మందిసిబ్బందికి సంబంధించి, రూ.23 కోట్ల02లక్షల52వేల750 రూపాయల బోనస్‌ను, సెలవు దినమైన ఆదివారం కూడా పర్సనల్, అకౌంట్స్ విభాగాల సంబంధిత ఉన్నతాధికారులు జయశంకర్ చౌహాన్, కుందా ప్రదీప్‌బాబులుతమ తమతమ కార్యాలయాల్లోనేఉండి, స్వయంగా పర్యవేక్షిస్తు కేవలం ఆరు గంటల స్వల్పకాల వ్యవధిలో బోనస్ బిల్లులను ఆమోదించి ఇందుకు సంబంధించిన చెక్కులను కార్మికుల బ్యాంకు ఖాతాలుగల బ్యాంకులకు పంపించారు. దీంతోదక్షిణ మధ్య రైల్వే జోన్ పరనిధిలో బోనస్ ప్రక్రియను కేవలం ఆరు గటల స్వల్ప కాల వ్యవధిలో పూర్తి చేసిన తొలి డివిజన్‌గా దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలోనే గుంతకల్లు రైల్వే డివిజన్ రికార్డు నెలకొల్పింది. రైల్వే సిబ్బంది సోమవారం నుంచి తమ తమ ఖాతాలున్న బ్యాంకుల ద్వారా తమ బోనస్‌ను పొందునట్లు రైల్వే వర్గాలు తెలిపాయి.

## లారీ ఆటో ఢీ: ఒకరు మృతి,మరొకరికి తీవ్ర గాయాలు

**మాడ్గుల,అక్టోబరు 2, ప్రభాతవార్త:** మాడ్గుల మండలంలోని నాగర్జునాసాగర్ ప్రదాన రహదారిపై ఆగివున్న లారీని ఆటో డీ కొని ఒకరు మృతి చెం దారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. సిఐ కృష్ణ మోహన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కూబ్య తాండ పంచాయితీ పరిధిలోని మాన్య తాండాకు చెందిన నేనావత్ లాలూ, మంజులలు హైదరాబాదులో కూలి పని చేస్తూ జివనం సాగించేవారు. దసరా పండగ కోసం తమ సొంత గ్రాయానికి వస్తుండగా కొలుకులపల్లి సమీపంలో ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మంజుల (28)మృతి చెందింది. లాలూనాయక్‌ను చికిత్సకోసం హెదరాబాద్‌కు తరలించారు. మంజుల మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ కృష్ణమోహన్ తెలిపారు.





వేదాద్రిలో గడప గడపకు కార్యక్రమంలో ప్రభుత్వం అమలుచేసిన పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న ప్రభుత్వవిప్, జగ్గయ్యపేట ఎంఎల్‌ఏ సామినేని ఉదయభాను

## పేదరికం ఏ ఒక్కరి చదువుకు ముగింపు కాకూడదు

### ప్రభుత్వవిప్, జగ్గయ్యపేట ఎంఎల్‌ఏ సామినేని ఉదయభాను

**జగ్గయ్యపేట, అక్టోబర్ 2, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్‌లో పేదరికం కారణంగా ఏ ఒక్కరి చదువు ఆగిపోకూడదని, విద్యకు, ప్రజల సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి ఇస్తున్న ప్రాధాన్యత దేశంలో ఏ రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి ఇవ్వటంలేదని ప్రభుత్వవిప్, జగ్గయ్యపేట ఎంఎల్‌ఏ సామినేని ఉదయభాను అన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం వేదాద్రి గ్రామంలో ఆదివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నరు. గ్రామంలోని ఎంబిబిఎస్, ఎండి విద్యార్థి భూక్యా సునీల్ చదువు నిమిత్తం జగనన్న విద్యాదీవెన ద్దారా రూ.17.25 లక్షలుమంజూరుకాగా అలాగే ఇతర సంక్షేమ పథకాల ద్వారా రూ.2.53 లక్షలు మొత్తం రూ.19.80 లక్షలను వీరికుటుంబం లబ్ధిపొందినట్లు ఉదయభాను వెల్లడించారు. అమ్మఒడి, విద్యాదీవెన విద్యారంగంలో అమలవుతున్న విశిష్ట పథకాలన్నారు. విద్యార్థులకు ఈప్రభుత్వం చేదోడుగా ఉంటుందని పునరుద్ఘాటించారు. ఈకార్యక్రమంలో మండల, గ్రామస్థాయి వైఎస్ఆర్‌సిపి నాయకులు కూడా పాల్గొన్నారు.

# సంక్షేమ హాస్టళ్లల్లో అరకొర కాస్మొటిక్స్

**హైదరాబాద్, అక్టోబరు 2, ప్రభాతవార్త:** క్రాప్ వేయించుకోలేక, తలకు రాసుకు నేందుకు నూనె లేక, స్నానం చేసేందుకు సబ్బు లేక, పళ్ల తోముకునేందుకు పేస్ట్ లేక సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు దయనీయ పరిస్థితులను ఎదుర్కొం టున్నారు. చింపిరి జుట్టు, అపరిశుభ్రతతో విద్యార్థులు కొట్టుమిట్టాడు తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి ఎనిమిదేళ్లు అయినా ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు ఇచ్చే కాస్మొటిక్ చార్జీలు మాత్రం పెరగ లేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 14 ఏళ్ల క్రితం పెంచిన చార్జీలనే ఇప్పటికీ అమలు చేస్తున్నారు.

ప్రతీ ఏటా కాస్మొటిక్ రేట్లు, ముఖ్యంగా కరోనా తరువాత భారీగా వాటి ధరలు పెరిగాయి. అయితే ఇందుకు అనుగుణంగా సంక్షేమ హాస్టళ్లల్లో ఇచ్చే కాస్మొటిక్ చార్జీలను పెంచకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో గత ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే కాస్మొటిక్ చార్జీలకు బదులుగా కాస్మొటిక్ కిట్లు అందించాలని గతంలో మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. అయితే ఈ ప్రతిపాదనలు అటకెక్కాయి. కాస్మొటిక్ కిట్లు ఇవ్వక పోయినా, కనీసం కాస్మొటిక్ చార్జీలను అయినా పెంచుతారని ఆశించిన విద్యార్థులకు అక్కడ కూడా నిరాశే ఎదురైంది. చివరి సారిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2008 సంవత్సరంలో కాస్మొటిక్ చార్జీలను అప్పటి ప్రభుత్వం పెంచింది. ఓ వైపు ధరలు భారీగా

> తీవ్ర ఇబ్బందుల్లో విద్యార్థులు
>
> ఇప్పటికీ 14 యేళ్ల క్రితం చార్జీలే దిక్కు
>
> అమలుకాని సౌందర్య సాధనాల కిట్

పెరిగినా అప్పటి నుండి వీటిని సవరించ లేదు. ప్రస్తుతం బాలికలకు నెలకు 75 రూపాయలు, బాలురకు 50 రూపాయలను ఇస్తున్నారు. అది కూడా మూడు, నాలుగు నెలలకు ఒకసారి ఇస్తుండటంతో పెరిగిన ధరలతో అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రస్తుత ధరలకు అనుగుణంగా విద్యార్థినులకు నెలకు కనీసం 450 రూపాయల నుండి 500 రూపాయలు, బాలురకు నెలకు 300 రూపాయల నుండి 350 రూపాయల వరకూ కాస్మొటిక్ చార్జీల కింద చెల్లించాల్సిన అవసరం ఉందని సంక్షేమ శాఖలకు చెందిన అధికారులే చెబుతున్నారు. అరకొర చార్జీలతో స్నానం సబ్బులు, దుస్తుల సోపులు, టూత్ పేస్టు, బ్రెష్‌లు వంటి వాటిని కొనలేని పరిస్థితి ఉందని అంటున్నారు ఇక కొబ్బరి నూనె, టాల్కం పౌడర్లు, షాంపూలు, బాలికలకు శానిటరీ నాప్కిన్లు, బాలురకు ప్రతీ నెలా క్షవరం వంటి వాటి ఖర్చులకు ఈ సొమ్ము సరిపోవడం లేదు. క్షవరం చేయడానికే 100 రూపాయలకు పైగా తీసుకుంటున్నారు. మరోవక్క కాస్మొటిక్ చార్జీలు పెంచకపోవడంతో శానిటరీ నాప్కిన్లు కొనలేక తరగతులకు హాజరు కాలేక డుమ్మా కొట్టాల్సిన దుస్థితి ఏర్పడిందని బాలికలు వాపోతున్నారు.



రాంకో సిమెంట్స్‌ను సందర్శించి, ఇంటర్‌షిప్‌లో వాగ్ధేవి మహిళా కళాశాల బిఎస్‌సి కెమిస్ట్రీ విద్యార్థినులు.

## రాంకో సిమెంట్స్‌లో వాగ్దేవి ఇంటర్న్‌షిప్

**జగ్గయ్యపేట,అక్టోబర్ 2ప్రభాతవార్త :** ఆంధ్రా-తెలంగాణ సరిహద్దు పట్టణమైన ఎన్‌టిఆర్ జిలా జగ్గయ్యపేట ప్రాంతంలోని రాంకో సిమెంట్స్‌లో వాగ్ధేవి మహిళా కళాశాల విద్యార్థినులు డిగ్రీ నూతన విధానంలో భాగంగా శనివారం ఇంటర్‌షిప్‌లో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డిగ్రీలో నూతన విద్యా విధానాన్ని నిర్ధేశిస్తూ జారీచేసిన ఆదేశాలకు అనుగుణంగా ఈవిద్యాసంవత్సరం నుండి ఏపి ఎస్‌సిహెచ్ఇ కృష్ణా విశ్వవిద్యాలయం వారు డిగ్రీ ఫైనలియర్ విద్యార్థులు ఎనిమిది వారాలు ఇంటర్‌షిప్‌ను సమీపంలోని పారిశ్రామిక సంస్థల్లో చెయ్యాలని సూచనలు జారీచేశారు. వాగ్ధేవి కళాశాల బిఎస్‌సి కెమిస్ట్రీ విద్యార్థినులు ప్రిన్సిపాల్ బుస్సా సురేష్ ఆధ్వర్యంలో ఫ్యాక్టరీని సందర్శించి ఎంసిఎల్ హెచ్‌ఆర్ సాయి ద్వారా ఉత్పత్తి, క్వాలిటీ కంట్రోల్, రీసైక్లింగ్, తదితర విధానాలగురించి తెలుసు కున్నారు. కార్యక్రమంలో వాగ్ధేవి కళాశాల కరస్పాం డెంట్ బుస్సా సరిత, సీనియర్ అధ్యాపకులు అబ్బాస్ అలీ, కంప్యూటర్ అధ్యాపకులు లింగరాజు పాల్గొన్నారు.

## డబుల్‌బెడ్ ఇళ్ల పేరిట 150 మందికి బురిడీ

**హైదరాబాద్ (ఎల్.బి.నగర్), అక్టోబరు 2, ప్రభాతవార్త:** డబుల్ బెడ్ ఇళ్లు ఇప్పిస్తామని 150 మందిని మోసం చేసిన వారిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంఘటన సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్స్పెక్టర్ సీతారాం తెలిపిన వివరాల ప్రకారం ఏజీ కార్యాలయంలో రికార్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మియాపూర్ న్యూహాఫీజ్‌పేట్, ప్రేమ్‌నగర్‌కు చెందిన పందరి బాలరాజు(29), మీర్‌పేట్ వరలక్ష్మీనగర్‌కాలనీకి చెందిన ఆటోడ్రైవర్ పావని రాజు(47)తో కలిసి డబల్‌బెడ్ రూమ్‌లు ఇప్పిస్తామని సుమారు 150మంది వద్ద డబ్బులు వసూలు చేశారు. డబల్‌బెడ్‌రూమ్‌కు రూ.70వేల నుంచి లక్ష రూపాయలు, వ్యక్తిగత ఇంటి గురించి లక్ష రూపాయల నుంచి రూ.1.50 లక్షల వరకు వసూలు చేశారు. వీరు హౌసింగ్ సొసైటీ ఉద్యోగి అయినా ఆనంద్‌కిషోర్‌తో కలిసి మోసానికి పాల్పడ్డారు. పలు బస్తీలకు చెందిన వారిని టార్గెట్ చేసి వారిని నమ్మబలికి ఈ ముగ్గురు మోసానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. చాలా రోజుల నుంచిడబల్‌బెడ్ రూమ్ కానీ, వ్యక్తిగత ఇల్లు కానీ ఇచ్చే విషయంలో ఎటువంటి ప్రయోజనం కనిపించలేదు.

## కంచి పీఠాధిపతుల సమక్షంలో గోపూజచేసిన టిడిపి జాతీయ కోశాధికారి శ్రీరాం రాజగోపాల్

**జగ్గయ్యపేట, అక్టోబర్ 2, ప్రభాతవార్త :** టిడిపి జాతీయ కోశాధికారి, మాజీ ఎం ఎల్ఏ శ్రీరాంరాజగోపాల్ (తాతయ్య) పెద్దాపురం లలిత బ్రాండ్ రైస్ వారి ఆహ్వా నంతో ఆదివారం కంచి శంకరపీఠాధిపతులు శ్రీశంకర విజయేంద్ర సరస్వతి స్వామివారి సమక్షంలో గోపూజ నిర్వహించారు.

అనంతరం స్వామివారి ఆశీస్సు లు స్వీకరించారు. మాజీమున్సిపల్ చైర్మన్ శ్రీరాంసుబ్బారావు, వ్యాపార ప్రము ఖులు శ్రీరాం రామ్మూర్తి, పెనుగొండ సతీష్, పెనుగొండ రాజీవ్, శ్రీరాం కృష్ణ పవన్, శ్రీడ్రెసెస్ నాగేశ్వరరావు కూడా ఈకార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీదేవి శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్న వేళ శ్రీస్వామివారి కరుణా కటాక్షాలు లభించటంపట్ల రాజగోపాల్‌స్వామివారికి కృతజ్ఞతాపూర్వక నమస్సులు సమర్పించారు.



కంచి శంకరపీఠాధిపతులు శ్రీశంకర విజయేంద్ర సరస్వతి స్వామివారి సమక్షంలో గోపూజ చేస్తున్న టిడిపి జాతీయ కోశాధికారి, మాజీ ఎంఎల్ఏ శ్రీరాం రాజగోపాల్

# దసరా పర్వదినం తర్వాత ప్రచారం ఉధృతం

## మునుగోడులో జాతీయ పార్టీ తరుపునే పోటీ

## సర్వేలన్నీ టిఆర్ఎస్‌కే అనుకూలం: తెలంగాణ సిఎం కెసిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 2:** దసరా తర్వాత మునుగోడు ప్రచారాన్ని ఉధృతం చేయాలని టిఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన మంత్రి జగదీశ్ రెడ్డితో సమావేశమయ్యారు. ఏ క్షణమైనా మునుగోడు ఉప ఎన్నిక షెడ్యూల్ రావచ్చని సిఎం కెసిఆర్ చెప్పారు. సర్వేలన్నీ టిఆర్ఎస్‌కే అనుకూలంగా ఉన్నాయని, ఎన్నికలు పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, శ్రేణులు కోరారు. టిఆర్ఎస్ పేరు మార్చుకుని నూతనంగా ఏర్పాటు చేయబోయే జాతీయ పార్టీ తరఫున అభ్యర్థిని మునుగోడు ఎన్నిక బరిలోకి దింపుతామని చెప్పారు. ఈసారి మునుగోడు బరిలో మూడు జాతీయ పార్టీలు ఉంటాయని వ్యాఖ్యలు చేశారు. మునుగోడులో అన్ని వర్గాలు టిఆర్ ఎస్‌కు అనుకూలంగా ఉన్నాయని తెలిపారు. మునుగోడు ఉప ఎన్నికలో టిఆర్ఎస్ విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## సైన్స్ విద్యార్థులకు సాహిత్యం మీద మక్కువ పెంచిన పులిచెర్ల

### --డాక్టర్ పులిచెర్లకు ఆర్యపురుష పురస్కారం

**గుంటూరు విద్య, అక్టోబర్ 2, (ప్రభాతవార్త) :** సైన్స్ విద్యార్థులు అయినప్పటికీ కళాశాల్లో తెలుగు మాస్టారు పాఠంకోసం ఎదురుచూసే వాళ్ళమని,సాహిత్యం మీద అభిమానం,మక్కువ పెంచిన ఆదర్శనీయ వ్యక్తి సాంబశివరావు మాస్టారు అని ప్రముఖ న్యూరాలజిస్టు డాక్టర్ వి.విజయ పేర్కొన్నారు.పండిత గోపదేవ్ వైదిక ధర్మ ప్రచార సమితి 17వ వార్షికోత్సవం సందర్భంగా ప్రముఖ రచయిత,ఆంధ్రోపన్యాసకులు డాక్టర్ పులిచెర్ల సాంబశివరావును సమితి 'ఆర్యపురుష' బిరుదుతో సత్కరించింది.స్థానిక అరండల్‌పేట లోని ఆర్యసమాజ మందిరంలో ఆదివారం ఉదయం జరిగిన పురస్కార సభకు వైదికధర్మ ప్రచారకులు డాక్టర్ కొసరాజు రవీంద్ర అధ్యక్షత



వహించారు.ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ విజయ మాట్లాడుతూ పాఠాలతోపాటు,తమకున సామాజిక అంశాలపై డాక్టర్ పులిచెర్ల స్పృహ కల్పించేవారని,క్రమశిక్షణకు మారుపేరైన మాస్టారు తమకు ఎప్పటికీ మార్గదర్శకులని తెలిపారు.మరో ప్రముఖ వైద్యులు,విద్యాపోషకులు డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ మాట్లాడుతూ డాక్టర్ పులిచెర్ల శిష్యులుగా ఆయనను సత్కరించుకోవడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు.జెకెసి కళాశాల విద్యార్థులుగా ఆయన వద్ద వేలాది మంది ఆదర్శనీయ శిక్షణ పొందారని పేర్కొన్నారు.ఆయన శిష్యులు వివిధ రంగాల్లో స్థిరపడినప్పటికీ,తెలుగు సాహిత్యం అంటే వస్తే,ఆందరి నోట పులిచెర్ల మాటే వస్తుందని పేర్కొన్నారు.సమితి వ్యవస్థాపక కార్యదర్శి,ఆర్యసమాజ కమిటీ సభ్యులు ఏలూరి సూర్యనారాయణ మాట్లాడుతూ మహర్షి దయానంద సరస్వతి స్థాపించిన ఆర్యసమాజ సిద్ధాంతాలను తెలుగు రాష్ట్రాల్లో ప్రచారం గావించి,నిండు నూరేళ్ళు జీవించిన మహాత్ములు పండిత గోపదేవ్ స్మృత్యర్థం ఈ రెండు రాష్ట్రాల్లో వేదాచార్యులన్నీ ప్రచారం గావిస్తున్న వారిని "పండిత గోపదేవ్ వైదికధర్మ ప్రచార సమితి" గత 17సంవత్సరాలుగా పురస్కారాలతో సత్కరిస్తుందని తెలిపారు.అనంతరం సభికుల హర్షధ్వానాల మధ్య డాక్టర్ పులిచెర్ల సాంబశివరావుకు ఆర్యపురుష బిరుదు పురస్కారాన్ని,బంగారు ఉంగరాన్ని సూర్యనారాయణ అందజేశారు.వీరితోపాటు విజయనగరం జిల్లా,చీపురుపల్లికి చెందిన వైదిక ధర్మ ప్రచారకులు రెడ్డి రామనాయుడు,కుమారు అప్పలనాయుడులకు కూడా ఆర్యపురుష బిరుదుతోపాటు నగదు పురస్కారాలను అందించారు.కార్యక్రమంలో డాక్టర్ బి.విజయభాస్కర్,ఆర్య సమాజ సేవకులు ఎమ్మెస్ రామారావు,వైదిక ధర్మ ప్రచారకులు కళా ్యణి రవీంద్రనాథ్,వేద ధర్మ ప్రచారకులు ఎం.హేమలత ఋషి,ముప్పానేని సువర్ణవాణి,ఆర్యసమాజం గుంటూరు అధ్యక్షులు గుర్రం నిర్మలాదేవి,కార్యదర్శి వాసిరెడ్డి శ్రీనివాసప్రసాద్ తదితరులు ప్రసంగించారు...

## గాంధీ జయంతి సందర్భంగా రక్తదాన శిబిరం

**పెదనందిపాడు, అక్టోబర్ 2, ప్రభాతవార్త :** ఆర్యవైశ్య కళ్యాణ మండపం పెదనంది పాడులో గాంధీ జయంతి సందర్భంగా ఆదివారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుపై రోటరీ క్లబ్ అడ్మినిస్ట్రేటట్ డైరెక్టర్ పోపూరి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ భారతదేశం గర్వించదగిన మహానీయుల్లో మహాత్మాగాంధీ ఒకరని చెప్పుకుంటే అందరికంటే ముందుంటారని చెప్పవచ్చు.భారతావనికి స్వేచ్ఛా స్వాతంత్రం అందించడం కోసం చేసిన



పోరాటానికి గాంధీజి ఎంచుకున్న శాంతి,ఆహింసా మార్గం భారతీయులకే కాదు యావత్తు ప్రపంచానికి మార్గదర్శకంగా నిలిచింది.అందుకే ఆయన మహాత్ముడు అయ్యారు అక్టోబర్ 2న జయంతి జరుపుకుంటున్న సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటుచేయడం జరిగింది.రక్తదాన శిబిరానికి 35మంది దాతలు రక్తదానం చేశారు.ఈ కార్య క్రమానికి ముఖ ్యఅతిధులుగా రోటరీ జిల్లా గవర్నర్ టి.రాజశేఖర్‌రెడ్డి,అసిస్టెంట్ గవర్నర్ పోపూరి నాగేశ్వరరావు,అధ్యక్షులు విక్టర్ జాన్‌పాల్ పాల్గొన్నారు.

## ట్రెక్కింగ్ ద్వారా శారీరక ఆరోగ్యం మానసిక వికాసం

### --వైహెచ్ఏఐ అధ్యక్షులు ప్రొఫెసర్ కె.కొండయ్య

**గుంటూరు కల్చరల్, అక్టోబర్ 2, ప్రభాతవార్త :** మనిషి జీవితంలో ట్రెక్కింగ్ ప్రధాన అంశంగా మారినప్పుడు వారి శారీరక పటుత్వంతోపాటు మనోవిజ్ఞానం కలిగి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఎదుగుతారని యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షులు ప్రొఫెసర్ కసెట్టి కొండయ్య పేర్కొన్నారు.స్థానిక బ్రాడీపేట మాజేటి గురవయ్య డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో ఇటీవల హిమాలయాల్లో ట్రెక్కింగ్ నిర్వహించి విజయవంతంగా తిరిగి వచ్చిన సభ్యుల అభినందన సభ నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రొఫెసర్ కొండయ్య మాట్లాడుతూ మినిస్ట్రీ ఆఫ్ యూత్ వెల్ఫేర్ చేయలేని అనేక కార్యక్రమాలు వైహెచ్ఎఐ నిర్వహిస్తుందని చెప్పారు.ఉన్నత పాఠశాలలు,కళాశాలల విద్యార్థులలో,యువతలో చదువుతోపాటు పర్యావరణం పట్ల ఆసక్తి ద్వారా మనోవికాసం కోసం ట్రెక్కింగ్ ఎంతగానో దోహదం చేస్తుందని తెలిపారు.వైహెచ్ఏఐ ఆధ్వర్యంలో ప్రతినెల నది సముద్రస్నానాలు అడవి,కొండ ప్రాంతాలతో పాటు మన జిల్లా,రాష్ట్రంలోని వివిధ పర్యాటక ప్రాంతాలు,దేశంలోని ప్రముఖ ట్రెక్కింగ్ ప్రదేశాలల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు.ప్రముఖ యోగాచార్యులు పులివర్తి కేశవ విశ్వకర్మ మాట్లాడుతూ ట్రెక్కింగ్ సాధన యోగాలో అంతర్భాగమన్నారు.సభకు వైహెచ్ఏఐ చైర్మన్ చంద్రశేఖర్ అధ్యక్షత వహించగా కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బోసుబాబు,కార్యదర్శి రవికిరణ్,ఆర్గనైజింగ్ కార్యదర్శులు సౌజన్య,భాను,కోశాధికారి వీరయ్య,సుధాకర్,కొండప నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## 9న గ్రూప్స్ సివిల్ సర్వీస్ పరీక్షలపై అవగాహన సదస్సు

**గుంటూరు విద్య, అక్టోబర్ 2, ప్రభాతవార్త :**

సివిల్స్ (ఐఎఎస్,ఐపిఎస్,ఐఎఫ్ఎస్) గ్రూప్-1,2 పరీక్షలపై ఉచిత ఆన్‌లైన్ అవగాహన సదస్సును ఈనెల 9వ తేదిన పొనూ ్నరురోడ్డులోని టార్గెట్ ఐఎఎస్ స్టడీ సర్కిల్ నందు నిర్వహించనున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ అన్నపురెడ్డి ఉషారాణి తెలిపారు.యూపిఎస్‌సీ ప్రతి సంవత్సరం భర్తీ చేసే ఐఎఎస్,ఐపిఎస్,ఐఎఫ్ఎస్,ఐఆర్ఎస్ మరియు ఏపిపిఎస్‌సీ ఇటీవల విడుదల చేసిన ఆర్‌డిఓ,డిఎస్పీ,సిటిఓ వంటి గ్రూప్-1 సర్వీసులు,డిప్యూటీ తహసీల్దార్,సబ్ రిజిస్ట్రార్,మున్సిపల్ కమీషనర్,ఏసిటిఓ,ఏఎస్ఓ వంటి గ్రూప్-2 నోటిఫికేషన్లు గురించి మరియు పరీక్షా విధానం,ప్రిపరేషన్ విధానం గురించి ఉచిత ఆన్‌లైన్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఉషారాణి పేర్కొన్నారు.ఆసక్తిగల ఏదైనా డిగ్రీ చదివిన యువతీ యువకులు మీ పేరు,మరియు విద్యార్హత వివరాలను 9440989629, 9030562728 నంబర్లకు వాట్సాప్ చేయవచ్చని తెలిపారు.ఆన్‌లైన్ అవగాహన సదస్సుకు హాజరైన వారికి 30మార్కులకు ఇంటరూ ్వ ఉంటుందని మెరిట్ మార్కులు వచ్చిన వారికి కోచింగ్ ఫీజులో 75శాతం ఫీజు రాయితీ ఇవ్వబడుతుందని టార్గెట్ ఐఎఎస్ అకాడమీ,డైరెక్టర్ ఉషారాణి తెలిపారు.

## సరస్వతీ దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

**పెదకూరపాడు, అక్టోబర్ 2 ప్రభాతవార్త :** మండలంలోని లగడపాడు గ్రామంలో దేవీశరన్నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన అమ్మవారు ఆదివారం సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

## దుప్పట్లు, దోమతెరల పంపిణీ

**పెదకూరపాడు, అక్టోబర్ 2 ప్రభాతవార్త :**

ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో హుస్సేన్‌నగర్, పెదకూరపాడు గ్రామాలలో ఆదివారం వృద్ధులకు దోమతెరలు, దుప్పట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాగులూరి ఫౌండేషన్ అధినేత ప్రవాస ఆంధ్రులు భానుప్రకాష్ మాట్లాడుతూ కుటుంబంలోని వృద్ధులు ప్రశాంతంగా కాలం గడపడానికి అవసరమైన చేయూత అందజేయడం మన కనీస బాధ్యత అని అన్నారు. వృద్ధులకు అండగా ఉందామని, వాళ్ళతో ప్రేమగా ఉంటూ వారి ఆలోచనలు పంచుకుందామన్నారు. ఎందుకంటే మనం కూడా ఎప్పుడో ఒకప్పుడు వృద్ధులమవ్వక తప్పదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి షేక్.ముంతాజ్, కృష్ణారావు, ప్రసాద్, కుంచనపల్లి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## అచ్చంపేట మండలంలో మారుతున్న పాఠశాలల రూపురేఖలు

### - రూ.2.20 కోట్లతో నాడు - నేడు పనులకు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు శంకుస్థాపన

**అచ్చంపేట, అక్టోబర్ 2 ప్రభాతవార్త :** పెదకూరపాడు నియోజకవర్గంలో రాష్ట్ర ప్రభుత్వ చొరవతో పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయి. నాడు - నేడు పథకం ద్వారా అచ్చంపేట మండలంలోని పలు పాఠశాలలు, జూనియర్ కాలేజీలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు శంఖుస్థాపన చేశారు. అచ్చంపేట మండలంలో పాఠశాలల అభివృద్ధికి నాడు - నేడు ద్వారా సుమారు రూ.2.20 కోట్ల నిధులు మంజూరయ్యాయి. అచ్చంపేటలోని జిల్లా పరిషత్



హైస్కూల్‌లో ఆరు అదనపు గదుల నిర్మాణానికి రూ.71 లక్షలు, జూనియర్ కాలేజీలో నాడు - నేడు కింద రూ.46.75 లక్షలు, మాదిపాడు జిల్లా పరిషత్ హై స్కూల్‌లో మూడు అదనపు గదులు, మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.99 లక్షలు మంజూరయ్యాయి. ఆయా పనులకు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు శంఖుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడుతూ చదువుతోనే చిన్నారుల భవిష్యత్తు బాగుంటుందని నమ్మిన వ్యక్తి సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పారు. అందుకే వారి చదువు కోసం వేల కోట్లు ఖర్చు చేస్తున్నారన్నారు. విద్యాకానుక ద్వారా విద్యార్థులకు అవసరమైన యూనిఫామ్స్, పుస్తకాలు అందజేస్తున్నారన్నారు. ప్రతి వాళ్ళు చదువుకోవాలనే ఉద్దేశంతోనే కళ్యాణమస్తు వంటి పథకాలకు 10వ తరగతి అర్హతగా నిర్ణయించారని చెప్పారు. పెదకూరపాడు నియోజకవర్గంలో కేవలం విద్య కోసం సుమారు రూ.250 కోట్లు ఖర్చు పెట్టిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి కష్టాన్ని గుర్తించి బాగా చదువుకోవాలని కోరారు. తల్లిదండ్రులు కూడా చదువు ప్రాముఖ్యతను గుర్తించి చిన్నారులను బడికి పంపాలని సూచించారు. మన భవిష్యత్తు కోసం కష్టపడుతున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని ఎమ్మెల్యే శంకరరావు కోరారు.

## నాణ్యమైన విద్యాబోధనలో గురుకుల విద్యాలయాల పాత్ర గణనీయం

### --శాసనమండలి సభ్యులు కె.ఎస్.లక్ష్మణరావు

**గుంటూరు కల్చరల్, అక్టోబర్ 2, ప్రభాతవార్త :**

నాలుగు దశాబ్దాల క్రితం ప్రారంభించిన గురుకుల విద్యాలయాల నుండి మేధావులైన ఎంతోమంది విద్యార్థులు దేశం గర్వించే పౌరులుగా ఎదిగి రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నారని శాసనమండలి సభ్యులు కెఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు.ఆదివారం స్థానిక బ్రాడీపేటలోని సీపిఎం కార్యాలయం జాషువా విజ్ఞానకేంద్రం సమావేశ మందిరంలో వివిఎస్‌ఆర్ ఫౌండేషన ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఉత్తమ గురుకుల ఉపాధ్యాయ అవార్డుల ప్రధానోత్సవం ఘనంగా నిర్వహించారు.ముఖ్యఅతిధిగా పాల్గొన్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ గురుకుల విద్యాలయాల్లో సమస్యలు ఎన్ని ఉన్నా తాము చేస్తున్న పోరాటలు విజ్ఞప్తుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పూరి ్తస్థాయిలో సహకరిస్తుందని చెప్పారు.గురుకుల విద్యాలయాల అధ్యాపకులు ఉపాధ్యాయులు ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 62సంవత్సరాలు చేసేందుకు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సముఖత వ్యక్తం చేశారని చెప్పారు.వివిఎస్‌ఆర్ ఫౌండేషన్ ద్వారా 26జిల్లాల నుండి 26మంది ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తించి గౌరవించుకోవడం శుభపరిణామం అన్నారు.ఏపి రాష్ట్ర గురుకుల విద్యాలయాల సంస్థ,ఏపి మహాత్మా జ్యోతిరావు పూలే బిసి గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శులు ఆర్ నరసింహారావు,ఎ.కృష్ణమోహన్‌లు మాట్లాడుతూ విద్యాప్రమాణాల మెరుగుదలకు మరింతగా గురుకుల విద్యాలయాలు కృషిచేయవలసిన అవసరం ఉందని తెలియజేశారు.సభకు అధ్యక్షత వహించిన వివిఎస్‌ఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు ప్రొఫెసర్ వివిఎం రోజా మాట్లాడుతూ గురుకుల విద్యాలయాల సంఘ నేతగా తన భర్త ఆకాల మరణం తమను ఎంతగానో కృంగతీసిందని చెప్పారు.ఆయన జ్ఞాపకార్థం ప్రతి యేటా వివిఎస్‌ఆర్ ఫౌండేషన్ ద్వారా ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తించి,సత్కరించుకుంటామని తెలియజేశారు.డాక్టర్ పివి మల్లేశ్వర్ సభకు స్వాగతం పలకగా కార్యక్రమంలో గురుకుల విద్యాలయాల సొసైటీ ఎస్ఈ జి.వెంకటరమణ,గురుకుల విద్యాలయాల ఉపాధ్యాయుల అసోసియేషన్ అధ్యక్షులు దామచర్ల మదుసూదన్‌రావు,బిసి గురుకుల ఉపాధ్యాయుల సంఘ అధ్యక్షులు కె.బి.బి.రావు,రాపోలు జగన్,డి గోపింద్‌రెడ్డి,పాల్గొన్నారు.

## నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించిన హిందూ ఫార్మసీ కళాశాల విద్యార్థులు

**గుంటూరు విద్య, అక్టోబర్ 2, ప్రభాతవార్త :** ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరీక్షా విభాగం విడుదల చేసిన బి.ఫార్మసీ 8వ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో హిందూ ఫార్మశీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం తెలియజేశారు.ఈ పరీక్షలకు 86మంది విద్యార్థులు హాజరు కాగా వారిలో 80మంది 'ఓ'గ్రేడ్‌తోను 6 గురు 'ఎ' గ్రేడ్‌లోను ఉత్తీర్ణత సాధించారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు,సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదనరావు,వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కొండా రవికుమార్,ఫార్మా డి. డైరెక్టర్ డాక్టర్ పి.సీతారామయ్య,అధ్యాపకులు,విద్యార్థులకు తమ అభినందనలు తెలిపారు.

## భక్తి శ్రద్ధలతో దేవి శరన్నవరాత్రులు

**పెదకూరపాడు, అక్టోబర్ 3 ప్రభాతవార్త :** మండల పరిధిలోని 75 తాళ్ళూరు, తమ్మవరం, అబ్బరాజుపాలెం, బలుసుపాడు, కంభంపాడు, అత్తలూరు, కాశిపాడు గ్రామాలలో దేవి శరన్నవరాత్రులలో భాగంగా అమ్మవారు సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం భక్తులచే కుంకుమ పూజలు, లలితా సహస్ర పారాయణం, ఖడ్గమాల సూత్రాలు, వివిధ రకాల పూజలతో వేద పండితులు శ్రీపతి బాలకృష్ణ ఆచార్యులు పరుచూరి శ్రీనివాస్ ఆచార్యులు, వినుకొండ శ్రీనివాసాచార్యులు, తూములూరి శేషాచలపతి శర్మ పాల్గొని వివిధ రకాల పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మండల పరిధిలోని 75 తాళ్ళూరు గ్రామంలో బతుకమ్మను ఏర్పాటు చేసి పూలతో అమ్మవారికి అలంకరించి జానపద గేయాలతో బతుకమ్మ బతుకమ్మ అంటూ పాటలు పాడుతూ అంగరంగ వైభవంగా పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.



## అన్ని వర్గాల అభ్యదయమే మా లక్ష్యం

### : ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

**అచ్చంపేట, అక్టోబర్ 2 ప్రభాతవార్త :** అన్నివర్గాల ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా అచ్చంపేట మండలం వేల్పూరులో రెండవ రోజు పర్యటించారు. ప్రతి ఇంటికి వెళ్ళి సంక్షేమ పథకాలు అమలవుతున్న తీరు తెలుసుకున్నారు. వాలంటీర్ల సేవలు సరిగా అందుతున్నాయా, ప్రభుత్వ పథకాలు సక్రమంగా అమలవుతున్నాయా అంటూ ప్రజాభిప్రాయాన్ని తెలుసుకున్నారు. అర్హులైన వారందరికీ కులం, మతం, పార్టీలు చూడకుండా ప్రభుత్వ



ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

సంక్షేమ పథకాలు అందజేయాలని అధికారులకు సూచించారు. ఇంకా ఏవైనా సమస్యలున్నాయా అంటూ స్వయంగా స్థానికులనే అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరుపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు.

**వేల్పూరులో అభివృద్ధి, సంక్షేమానికి రూ.18 కోట్లు ...**


అచ్చంపేట మండలం వేల్పూరులో సంక్షేమ సిరులు వెల్లివిరిశాయి. గ్రామంలో నవరత్నాలైన సంక్షేమ పథకాల ద్వారా సుమారు రూ.13.75 కోట్లు పేదల ఖాతాల్లో జమ అయ్యాయి. వేల్పూరులో రూ.4.26 కోట్లతో పలు అభివృద్ధి పనులు జరిగాయి. రూ.40 లక్షలతో గ్రామ సచివాలయం మంజూరైంది. రూ.17.5 లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ మంజూరైంది. బల్క్ మిల్క్ కలెక్షన్ యూనిట్ కోసం రూ.15.74 లక్షలు మంజూరయ్యాయి. త్వరలో వీటి నిర్మాణం చేపట్టనున్నారు. వేల్పూరులో పాఠశాలకు నాడు - నేడు మొదటి విడత కింద రూ.41 లక్షలతో పాఠశాల అభివృద్ధి చేయగా రెండవ విడతలో రూ.44.5 లక్షలతో మరింత అభివృద్ధి చేస్తున్నారు. పాఠశాల ప్రహరీగోడ నిర్మించారు. సి.సి.రోడ్లు, డ్రైన్ల కోసం రూ.36 లక్షలు ఖర్చు చేశారు. ప్రతి ఇంటికి సురక్షిత మంచినీరు అందించేందుకు రూ.90 లక్షలతో జల జీవన్ మిషన్ పనులు జరుగుతున్నాయి. మూడేళ్ళలో వైఎస్సార్ రైతు భరోసా ద్వారా 1472 మందికి రూ.5.32 కోట్ల సాయం అందింది. అమ్మఒడి ద్వారా 405 మందికి రూ.1.43 కోట్లు, వైఎస్సార్ చేయూత ద్వారా 239 మందికి రూ.66 లక్షలు, వైఎస్సార్ ఆసరా ద్వారా 79 మందికి రూ.74 లక్షల సాయం అందింది. వీటితో పాటు వైఎస్సార్ పెన్షన్ కానుక రూపంలో 769 మంది ఖాతాల్లో మూడేళ్ళలో రూ.5.43 కోట్లు జమ అవ్వడం విశేషం.

**వేల్పూరులో రేపు మూడవ రోజు గడపగడపకు మన ప్రభుత్వం...**

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా అచ్చంపేట మండలం వేల్పూరులో మూడవ రోజు కొనసాగనుంది. రేపు సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వేల్పూరులో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొననున్నారు. సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, సంబంధిత అధికారులు, వైకాపా ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

## ఘనంగా గాంధీజీ, లాల్‌బహుదూర్ శాస్త్రి జయంతి వేడుకలు


**క్రోసూరు అక్టోబర్ 2 ప్రభాత వార్త :** మండల కేంద్రమైన క్రోసూరులో ఘనంగా గాంధీజీ, లాల్ బహుదుర్ శాస్త్రి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నంబూరు



శంకరరావు క్రోసూరులోని విగ్రహాల సెంటర్ వద్ద గాంధీ విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించి ఆయన మాట్లాడుతూ గాంధీజీ, శాస్త్రి జయంతి వేడుకలు జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. మహనీయుల త్యాగాలు, వారు అనుసరించిన మార్గాలు, వారు పాటించిన సూత్రాలు మనకు ఎల్లప్పుడు స్ఫూర్తి దాయకమని అన్నారు. వారి అడుగుజాడల్లో మనం నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు షేక్ మస్తాన్, వెలది అప్పారావు, కూనాల శ్రీనివాసరావు, కూనాల రవితేజ, జుజ్జూరి వెంకట్రావు, గార్లపాటి దాసు, నారు శ్రీనివాసరెడ్డి, కట్టమూరి అప్పారావు, డాక్టర్ షరీఫ్, తొమ్మండ్రు నాగేశ్వరరావు, చిన్నబాబు, కూరపాటి లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొని గాంధీజీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేసారు.

## గింజుపల్లి వాసుల సమస్యలపై ఎమ్మెల్యే శంకరరావు సమీక్ష

**అచ్చంపేట, అక్టోబర్ 2 ప్రభాతవార్త :** మండలంలోని గింజుపల్లి తండాలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆదివారం పర్యటించారు. మాదిపాడులో పాఠశాల అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేశారు. అనంతరం గింజుపల్లి తండా సమస్యలు తెలియడంతో వెంటనే అక్కడ ఆగి గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు త్రాగునీటి సమస్య గురించి తెలియజేయడంతో అక్కడికక్కడే ఏఈతో మాట్లాడి పరిష్కారానికి సూచనలు చేశారు. అలాగే గ్రామస్తులు తెలిపిన ఇళ్ళ పట్టాలు, ఎలక్ట్రిసిటీ, రోడ్డు సమస్యలపై సంబంధిత అధికారులతో చర్చించారు. రెవిన్యూ సమస్యలపై గ్రామస్తులు వివరించడంతో అచ్చంపేట తహశీల్దార్‌తో చర్చించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. గింజుపల్లి గ్రామస్తులు తెలిపిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. తమ సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యే శంకరరావుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



# సరస్వతీ నమస్తుభ్యం

**గుంటూరు కల్చరల్, అక్టోబర్ 2, ప్రభాతవార్త :** శరన్నవరాత్రుల్లో భాగంగా ఆదివారం అమ్మవారు సరస్వతీ దేవి అలంకారంలో భక్తులను కరుణించారు.దేవాలయాల్లో అమ్మవారికి విశేషపూజలు,అలంకరణలు జరిగాయి.తమకు విద్యాబుద్ధులు ప్రసాదించాల్సిందిగా బాలబాలికలు అమ్మవారిని వేడుకున్నారు.మారుతీనగర్ శ్రీకంచికామకోటి పీఠ మారుతీదేవాలయంలో కార్యదర్శి తంగిరాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వేడుకలు జరుగుతున్నాయి.ఆర్.అగ్రహారం శ్రీ కన్యకా పరమేశ ్వరీ అమ్మవారి దేవస్థానంలో చైర్మన్ దేవరశెట్టి సత్యనారాయణ తన బృందంతో భక్తులకు అసౌకర్యం కలగకుండా పర్యవేక్షిస్తున్నారు.సంపత్‌నగర్ శృంగేరీ శారదాపీఠంలో వీణాశారదాగా అమ్మవారికి అలంకరణ జరిపారు.సువాసినుల పూజలు జరిగాయి.ఆలయ గౌరవాధ్యక్షుడు పోలిశెటి ్ట శ్రీహరి ప్రసాదరావు పర్యవేక్షణలో కార్యక్రమాలు జరుగుతున్నాయి.విద్యానగర్ శ్రీసాయినాధుని సన్నిదానంలో చైర్మన్ యడ్లపాటి అశోక్‌కుమార్ నేతృత్వంలో శ్రీసరస్వతీ దేవి అలంకారాన్ని జరిపి ప్రత్యేకపూజలు నిర్వహించారు.సా ్థనిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం శ్రీ పద్మావతి కళ్యాణమండపం వేదికగా ఆలయ పాలకమండలి అధ్యక్షులు సిహెచ్ మస్తానయ్య,పాలకమండలి నిర్వహణలో ఆదివారం అమ్మవారిని శ్రీ సరస్వతీదేవిగా అలంకరించి రుత్విక్కులు విశేషపూజలు నిర్వహించారు.సుమారు 300మంది విద్యార్థిని విద్యార్థులు సరస్వతి పూజల్లో పాల్గొనా ్నరు.శ్రీ నారాయణం ప్రసాదాచార్యులు అనేక విశేషాలను తెలిపారు.విశేషంగా పాల్గొన్న భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలను స్వీకరించారు.ధార్మిక ప్రాంగణంలో శ్రీ భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ వ్యవస్థాపకులు బొల్లేపల్లి సత్యనారాయణ,లలితాంబ దంపతుల ఆధ్వర్యంలో వేదసభ నిర్వహించారు.ప్రతిరోజూ సాయంత్రం జరుగుతున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగ శ్రీ సాయిరాగ సంగీత కళాశాల ఆధ్వర్యంలో జరిగిన భక్తి సంగీత విభావరి ఆహుతులను అలరించింది.అరండల్‌పేట శ్రీ అష్టలక్ష్మీ మందిరంలో ఆలయ నిరా ్వహకులు మర్రిపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారిని శ్రీ సరస్వతిదేవిగా అలంకరించి విశేషపూజలు నిర్వహించారు.పలువురు చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు.సువాసినులచే కుంకుమ పూజలు,పారాయణాలు జరిగాయి.ప్రతిరోజూ పూజల్లో పాల్గొన్న భక్తులకు అన్నప్రసాద వితరణ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.బ్రాడీపేట శ్రీ శంకరమందిరంలో శ్రీ శారదా నవరాత్ర మహోత్సవాల సందర్భంగా శ్రీ స్వరూపానందేంద్ర స్వామి ఆశీస్సులతో రుత్విక్కులు అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించారు.వేద సభ జరిగింది,ప్రతిరోజూ ఉదయం నిర్వహిస్తున్న హోమాల్లో భాగంగా సరస్వతీ హోమం,చండీహోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.పూర్ణాహుతి మంత్రపుష ్పం,తీర ్థప్రసాద వితరణ జరిగింది.మల్లారెడ్డినగర్ శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయం పాలకమండలి చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి రుత్విక్కుల ఆధ్వర్యంలో శ్రీదేవి శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా శ్రీమహాలక్ష్మిగా అలంకరించి విశేషపూజలు నిర్వహించారు.ప్రతిరోజు ఉదయం అభిషేకాలు,చండీహోమం పూర్ణాహుతి తర్వాత భక్తులకు తీర్థప్రసాద వితరణ జరిగాయి.సిద్ధార్థనగర్ శ్రీ షిర్డిసాయిమందిరంలో ఆలయ పాలకమండలి అధ్యక్షులు నూతలపాటి పూర్ణచంద్రరావు దంపతుల ఆధ్వర్యంలో శ్రీదేవి శరన్నవరాత్ర మహోత్సవాల సందర్భంగా ఉదయం అమ్మవారిని శ్రీ సరస్వతీ దేవిగా అలంకరించి విద్యార్థిని విద్యార్థులతో సామూహిక సరస్వతీ పూజలు నిర్వహించారు.కృష్ణనగర్‌లోని శ్రీ గోదా పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం నిర్వాహకులు ధనకుదనం శ్రీనివాసాచార్యులు నిర్వహణలో శ్రీదేవి శరన్నవరాత్రల సందర్భంగా అమ్మవారిని శ్రీసరస్వతీ అలంకారంతో విద్యార్థిని విద్యార్థులచే సామూహిక సరస్వతి పూజలు,విశేషాభిషేకాలు నిర్వహించారు.







# సఫారీలను బెంబేలెత్తించిన టీమిండియా

## రెండో టి20లో 16 పరుగుల తేడాతో గెలుపు



**గువాహతి:** గెలుపేలక్ష్యంగా గౌహతి వేదికగా దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో టి20 మ్యాచ్‌లో భారత్ 16 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై గెలిచింది. చివరివరకూ ఉత్కంఠగా సాగిన ఈ పోరులో దక్షిణాఫ్రికా మూడు వికెట్ల నష్టానికి 221 పరుగులుచేసి ఓవర్లు పూర్తికావడంతో ఇక భారత్ 16 పరుగుల తేడాతో విజయం సాధించేందుకు మార్గం వేసింది. సఫారీలతో సిరీస్ ఆధిక్యంతోనిలిచింది. 2:0 తేడాతో ప్రస్తుతం టీమిండియా మూడో మ్యాచ్‌నుసైతం గెలిచేవిధంగా ఉరకలు వేస్తోంది. గెలుపేలక్ష్యంగా టీమిండియా బ్యాటర్లు దూకుడు చూపించారు. మొదటినుంచే చొరంవగా సాగిన టీమిండియా బ్యాటర్లు ఫోర్లు, సిక్సర్లతో స్కోరుబోర్డును పరుగులుపెట్టించారు. రాహుల్, సూర్యకుమార్ యాదవ్, కోహ్లీలు చెలరేగి ఆడటంతో 20 ఓవర్లకు 3 వికెట్లనష్టానికి 237 పరుగులు చేసి భారీ లక్ష్యం దక్షిణాఫ్రికాకు ఉంచింది. ఓపెనర్లుగా వచ్చిన రోహిత్ రాహుల్‌లు దూకుడుతో సాగారు. తర్వాత క్రీజులోకి వచ్చిన సూర్య కుమార్ యాదవ్ ఫోర్లు, సిక్సర్లతో రెచ్చిపోయాడు. కోహ్లీకి దినేశ్‌కార్తీకజత కావడంతో 20 ఓవర్లు ముగిసేసరికే భారత్ భారీ స్కోరుచేసి సఫారీలకు భారీ లక్ష్యం ముందుంచింది. 9.5 ఓవర్లలోనే భారత్ 96 పరుగులుకు చేరింది. వీరిద్దరిని కేశవ్‌మహరాజ్ వేరుచేయగా భారీ షాట్‌కు ప్రయత్నించి కెప్టెన్ రోహిత్‌శర్మ, ట్రిస్టన్ స్టబ్స్ చేతికి దొరికిపోయి పెవిలియన్‌కు చేరుకున్నాడు. 37 బంతుల్లో 43పరుగులుచేసిన రోహిత్ తృటిలో అర్థసెంచరీ మిస్ అయ్యాడు. తర్వాత క్రీజులోకి వచ్చిన కోహ్లీ కాసేపటికే అర్థసెంచరీపూర్తిచేసుకున్న రాహుల్‌కూడా కేశవ్‌మహరాజ్ బౌలింగ్‌లోనే ఔట్ అయ్యాడు. 28 బంతుల్లోనే 57 పరుగులుచేసి ఎల్బీ డబ్ల్యు అయ్యాడు. తర్వాత సూర్యకుమార్ ఎంట్రీతో సౌతాఫ్రికా బౌలర్లకు చుక్కలు కనిపించాయి,. వచ్చినబంతిని వచ్చినట్లు బౌండరీకి తరలించడంతో సఫారీ బౌలర్లకు దిమ్మదిరిగింది. 18 బంతుల్లోనే సూర్యకుమార్ అర్థసెంచరీపూర్తిచేసాడు. 22 బంతుల్లోనే ఐదుఫోర్లు, ఐదు సిక్సులతో 61 పరుగులుచేసి స్కోరు బోర్డును పరుగులుపెట్టించాడు. 18 ఓవర్లలో మొదటి బంతికి అవసరమైన పరుగుకు ప్రయత్నించి రనౌట్‌గా క్రీజును వీడాడు. కోహ్లీకూడా దూకుడుగా ఆడి 28 బంతుల్లోనే ఏడుఫోర్లు ఒక సిక్స్‌తో 49 పరుగులుచేసాడు. సూర్యకుమార్ వికెట్‌తోక్రీజులోకి వచ్చిన దినేశ్‌కార్తీక్ రెండుసిక్సులు ఒక ఫోరుతో 17 పరుగులుచేసాడు. 20 ఓవర్లుపూర్తి చేసేసరికే 237 భారీ పరుగులతో టీమిండియా సఫారీలకు పనిచెప్పింది. బ్యాటింగ్‌లోదూకుడుచూపించిన టీమిండియా సభ్యులు మొత్తం బౌలింగ్‌లోను తమ సత్తాచూపించి సఫారీ జట్టుసభ్యులకు ఊపిరాడనీయకుండా కట్టడిచేసారు. లక్ష్యఛేదనకు వచ్చిన సఫారీ బ్యాటర్లు తొలినుంచే తడబడ్డారు. ఓపెనర్లుగా క్వింటన్ డీకాక్, టెంబా బువమా క్రీజులోకి రాగా తొలి ఓవర్‌ను దీపక్‌చాహర్ మెయిడిన్‌చేసాడు. తర్వాత బౌలింగ్‌చేసిన అర్ష్‌దీప్‌సింగ్ రెండో బంతికే దక్షిణాఫ్రికా కెప్టెన్ బవుమా కోహ్లీచేతికి క్యాచ్ ఇచ్చి డకౌట్ అయ్యాడు. తర్వాత వచ్చిన రొసోవ్, అదే ఓవర్‌లో నాలుగో బంతికి దినేశ్‌కార్తిక్‌కు చిక్కాడు. ఒక్కపరుగుకే సఫారీజట్టు రెండు వికెట్లు నష్టపోయింది. భారత్ బౌలర్ల ధాటికి 47 పరుగులవద్ద సఫారీలజట్టు మూడో వికెట్ నష్టపోయింది. జట్టును ఆదుకునే బాధ్యత డీకాక్, డేవిడ్‌మిల్లర్లపైనే పడింది. పది ఓవర్లకు 70 పరుగులు మాత్రమే ఉన్న స్కోరును వీరిద్దరూ 17వ ఓవర్‌ముగిసే సమయానికి 175 పరుగులకు చేర్చారు. చివరి ఓవర్‌లో మూడో బంతికి భారీ సిక్స్ కొట్టి మిల్లర్ తన సెంచరీపూర్తిచేసాడు. డేవిడ్ మిల్లర్ సెంచరీచేసినా జట్టు విజయం సాధించలేకపోయింది.



# ఒడిఐ కెప్టెన్‌గా శిఖర్‌ధావన్

## వైస్‌గా శ్రేయస్ అయ్యర్

**న్యూఢిల్లీ:** దక్షిణాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్ ఆడుతున్న భారత ద్వితీయ శ్రేణిజట్టును బిసిసిఐ వెల్లడించింది. 16 మంది సభ్యులతోకూడిన జట్టు వివరాలను వెల్లడించింది. శిఖర్ దావన్ జట్టుకు కెప్టెన్‌గా ఉంటాడు. సంజూశాంసన్‌కు వైస్‌కెప్టెన్సీ ఇస్తారని భావించినా సెలక్టర్లు శ్రేయస్ అయ్యర్‌ను ధావన్ డిప్యూటీగా ఎంపికచేసారు. యువ ఓపెనర్లు రుతురాజ్ గైక్వాడ్, శుభ్‌మన్‌గిల్ ఛాన్స్ దక్కించుకోగా ఇండియా ఎ జట్టు తరపున చెలరేగిన ఆర్సీబి స్టార్ బ్యాటర్ రజత్ పటీదార్‌కు తొలిసారి టీమిండియా పిలుపు వచ్చింది. షమీ తప్ప స్టాండ్‌బై ఆటగాళ్లంతా ఉన్నారు. రాహుల్‌త్రిపాఠికి మరోసారి అవకాశం దక్కింది. వికెట్ కీపర్లుగా ఇషాన్ కిషన్, సంజుశాంసన్‌కు అవకాశం దక్కితే స్పిన్ ఆల్‌రౌండర్లు షాబాజ్ అహ్మద్, పేస్ ఆల్‌రౌండర్‌గా శార్దూల్ ఠాకూర్ జట్టులోకి వచ్చారు. స్పెషలిస్టు స్పిన్నర్లుగా కుల్దీప్ యాదవ్, రవిబిష్ణోయ్‌లను తీసుకున్నారు. దేశవాలీ క్రికెట్‌లో సత్తాచాటిన ముకేష్‌కుమార్‌కు తొలిసారి టీమిండియా పిలుపు అందింది. ఇక వరల్డ్‌కప్ టీమ్ స్టాండ్‌బైలో ఉన్న మహ్మద్ సిరాజ్, దీపక్ చాహర్‌లను కూడా ఈసిరీస్‌కు ఎంపికచేసారు. ఆసియా కప్‌లో దారుణంగా విఫలమైన ఆవేశ్‌ఖాన్ మళ్లీజట్టులోకి వచ్చాడు. ఇక తెలుగు క్రికెటర్ తిలక్‌వర్మకు మరోసారి మొండి చెయ్యి చూపించారు. టి20 ప్రపంచకప్ స్టాండ్‌బైగా ఉన్న అందరినీ సిరీస్‌కు ఎంపికచేసారు. మూడు వన్డేల సిరీస్‌లోభాగంగా తొలిమ్యాచ్ లక్నో వేదికగా దసరా పండుగ మరుసటిరోజే జరుగుతుంది. రెండోమ్యాచ్ రాంచీ వేదికగా తొమ్మిదిన జరుగుతుంది. చివరిమ్యాచ్ ఢిల్లీ వేదికగా ఈనెల 11న జరుగుతుంది. చివరిగా వన్డేసిరీస్‌కు కెప్టెన్‌శిఖర్‌ధావన్, వైస్‌గా శ్రేయస్ అయ్యర్, రుతురాజ్‌గైక్వాడ్, శుభ్‌మన్‌గిల్, రజత్ పటీదార్, రాహుల్‌త్రిపాఠి, ఇషాన్‌కిషన్, సంజూశాంసన్, షెహబాజ్ అహ్మద్, శార్దూల్‌ఠాకూర్, కుల్దీప్‌యాదవ్, రవిబిష్ణోయ్, ముకేష్‌కుమార్, ఆవేశ్‌ఖాన్, మహ్మద్‌సిరాజ్, దీపక్‌చాహర్‌లున్నారు.

# ప్రపంచంలో బుమ్రా లాంటి పేసర్లు ఎవ్వరూలేరు!



### ఆసీస్ మాజీ ఆల్‌రౌండర్ షేన్ వాట్సన్

**న్యూఢిల్లీ:** జస్‌ప్రీత్‌బుమ్రా లాంటి భారతపేస్‌బౌలర్‌ప్రపంచంలో మరొకరు లేరని, మిగిలిన ఎవ్వరూ ఆతడిస్థానం భర్తీచేయలేరని ఆసీస్‌మాజీ ఆల్‌రౌండర్ షేన్‌వాట్సన్ పేర్కొన్నాడు. అటాకింగ్, డిఫెన్సివ్ బౌలర్ అయిన బుమ్రా లేకపోతే ప్రపంచకప్ గెలవడం భారత్‌కుకష్టమేనన్నాడు. అద్భుతనైపుణ్యం కలిగిన బుమ్రాఅటాకింగ్, డిఫెన్సివ్‌గా బౌలింగ్‌చేయడంలో ప్రపంచంలోనే ఉత్తమం అని అన్నాడు. పిట్‌గా లేక ఆతడు ఈ ప్రపంచకప్‌లో ఆడలేకపోతే టీమిండియాకు తీవ్రనష్టం అన్నాడు. డెత్‌ఓవర్లలో విజయవంతంగా బౌలింగ్‌చేసే బౌలర్లు దొరకడమే అదృష్టమని, అదే పెద్ద ఛాలెంజ్ అన్నాడు. టోర్నీలో భారత్‌చివరివరకూ నిలవాలంటే జట్టులోని పేసర్లు ఆతడి పాత్రను పోషించాలని అన్నాడు. బుమ్రాగాయంపై కోచ్ ద్రవిడ్ ఇప్పటికే స్పందించాడు. పరీక్షలకోసం జాతీయ క్రికెట్ అకాడమికి వెళ్లాడని, అక్కడ వైద్య బృందం పరిశీలించి పరిస్థితి ఏంటనేది వెల్లడిస్తుందని తెలిపాడు. ఇప్పటివరకూ అధికారిక ప్రకటన ప్రకారం బుమ్రా దక్షిణాఫ్రికాతో టి20 సిరీస్‌కుమాత్రమే అందుబాటులోలేదని, జాతీయ క్రికెట్ అకాడమీకి వెళ్లాడని అక్కడవైద్యబృందం పరిశీలించిస్పష్టంచేస్తుందన్నాడు. బుమ్రాను దక్షిణాఫ్రికాతోసిరీస్‌కు మాత్రమే తప్పించారని, సానుకూల నిర్ణయం వస్తుందనే భావిస్తున్నట్లు చెప్పాడు.

# అమల్లోకి వచ్చిన కొత్త రూల్స్




**ముంబై, అక్టోబరు 2:** మీరు వంట గ్యాస్ వాడకం నుంచి ఆదాయపు పన్ను దరఖాస్తు చేసే వరకు ఎన్నో మార్పులు జరుగుతుంటాయి. ఎందుకంటే అక్టోబరు 1 నుంచి దేశంలో కొన్ని పెద్ద మార్పు లు జరగబోతున్నాయి. దీని కారణంగా మీకు మరింతగా ఖర్చు పెరిగే అవకాశం ఉంటుంది. అదే సమయంలో ఆదాయపు పన్ను రిటర్న్‌లను దాఖలు చేసే పన్ను చెల్లింపుదారులు, అటల్ పెన్షన్ యోజన ప్రయోజనాన్ని అక్టోబరు 1 నుంచి పొందలేవు. దీనితో పాటు మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టడానికి నియమాలు కూడా మారుతాయి. నామినేషన్ ప్రక్రియ కూడా అవసరమవుతుంది. అదే సమయంలో ఎన్‌పిఎస్ లో ఇ-నామినేషన్ తప్పనిసరి చేయబడుతుంది. ఇది కాకుండా ఆన్‌లైన్ కొనుగోళ్లకు కార్డులకు బదులుగా టోకెన్లను ఉపయోగించబడుతుంది. మీరు ఎల్‌పిజిని ఉపయోగిస్తుంటే గ్యాస్ సిలిం డర్ల ధరలు ప్రతి నెల 1వ తేదీన సమీక్షించబడ తాయనే విషయం తెలిసిందే. ఈ సారి గృహ, వాణిజ్య గ్యాస్ సిలిండర్ల ధరలు తగ్గుతాయని భావించినా, వాణిజ్య సిలిండర్‌పై రూ.25 మేర తగ్గించాయి చమురు కంపెనీలు. దీంతో కొంత ఊరట లభించినట్లయింది. ఆర్‌బిఐ సూచనల మేరకు అక్టోబర్ 1 నుంచి కార్డు చెల్లింపులకు టోకెన్ విధానం అమల్లోకి రానుంది. దీని అమలు తర్వాత, వ్యాపారులు, చెల్లింపుల అగ్రి గేటర్లు, చెల్లింపు గేట్‌వేలు కస్టమర్ల కార్డ్ సమా చారాన్ని రక్షించలేరు. ఆన్‌లైన్ బ్యాంకింగ్ మోసా లను అరికట్టడమే దీని ప్రధాన లక్ష్యం. ఈ విధా నం ఏర్పాటుతో మీరు మోసాల బారినుంచి కాపాడుకోవచ్చని అంటున్నారు నిపుణులు. ఇంతకుముందు కస్టమర్ తన క్రెడిట్ కార్డు, డెబిట్‌కార్డ్ వివరాలను చెల్లింపు కోసం ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌తో పుంచకోవాల్సి ఉండేది. ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లు ఈ సమాచారాన్ని తమ వద్ద సురక్షితంగా ఉంచడానికి, తదుపరి ఏదైనా లావాదేవీ కోసం ఈ సమా చారాన్ని ఉపయోగించేందుకు ఉపయోగించబడ తాయి. దీంతో సమాచారం చోరీకి గురయ్యే ప్రమాదం ఉంది. దీన్ని నివారిం చేందుకు రిజర్వ్ బ్యాంకు టోకనైజే షన్ నిబంధనను రూపొందించింది. వాస్తవానికి మీ క్రెడిట్, డెబిట్ కార్డు వివరాలకు బదులుగా టోకెన్ జారీ చేయబడుతుంది. మీరు ఆన్‌లైన్ చెల్లింపు చేసి నప్పుడు వ్యాపారి ఈ టోకెన్ నంబర్‌ను మాత్రమే పొందుతారు. ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేసే వారు అక్టోబరు 1 నుంచి అటల్ పెన్షన్ యోజన ప్రయోజనాన్ని పొందలేరు. అంటే రూ.2.50 లక్షల కంటే ఎక్కువ ఆదాయం ఉన్న వ్యక్తులు అటల్ పెన్షన్ యోజనలో పెట్టుబడి పెట్టలేరు. ప్రస్తుత నిబంధ నల ప్రకారం, 18సంవత్సరాల నుంచి 40సంవ త్సరాల మధ్య వయస్సు గల భారతీయ పౌరుల ఎవరైనా ఆదాయపు పన్ను చెల్లించినా చెల్లించకపోయినా ఈ ప్రభుత్వ పెన్షన్ పథకంలో చేర వచ్చు. ఈ పథకం కింద ప్రతి నెలా రూ.ఐదు వేల ఫించన్ అందచేస్తారు. అక్టోబర్1 నుంచి మ్యూచు వల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టే వ్యక్తులు నామినే షన్ సమాచారంఇవ్వడం తప్పనిసరి. ఇలా చేయ డంలో విఫలమైన పెట్టుబడిదారులు డిక్లరేషన్ ఫారమ్‌ను పూరించాలి. రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా రెపోరేటును పెంచిన తర్వాత బ్యాంకు లు పొదుపు ఖాతా, ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీని పెంచాయి.

# వ్యాపార వృద్ధిలో డిజిటల్ మార్కెటింగ్ కీలకం

ముంబై, అక్టోబరు 2: ప్రపంచీకరణ విస్తరిస్తున్న తరుణంలో కాలానుగుణంగా మనం మారాల్సిన అవసరం ఉంది. అందులో భాగంగానే వాణిజ్య సంస్థలన్నీ కొత్తదారులు వెతుక్కుంటూ వ్యాపార విస్తరణ చేసుకుంటున్నాయి. శాస్త్రీయ సంప్రదాయ మార్కెటింగ్‌ను పక్కను నెట్టి డిజిటల్ మార్కెట్‌పై ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. డిజిటల్ మార్కె టింగ్‌లోకి ప్రవేశించకపోతే భవిష్యత్తులో వ్యాపా రం వృద్ధి చెందకుండా మన పరిస్థితి ఆగమ్య గోచరంగా మారుతుంది. దానికి ఉదాహరణే నోకియా సెల్ ఫోన్ల తయారీ కంపెనీ. ఒకప్పుడు మార్కెట్‌లో ఒక ఊపు ఊపున నోకియా కంపెనీ నేడు దాదాపు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడిం ది. దానికి కారణం మారుతున్న కాలానుగుణంగా నోకియా మారకపోవడమే. డిజిటల్ మార్కెటింగ్ వ్యాపారానికి ఎన్నో అవకాశాలను, వృద్ధిని తీసు కొస్తుంది. కంపెనీ వస్తువులను ప్రపంచానికి తెలియచేసి అమ్మకాలు పెంచుతోంది.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14